అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 02-04-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 91 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

మందుల ధరలు ప్రియం

- 900 రకాలపై ప్రభావం
- అత్యవసర ఔషధాలే ఎక్కువ



న్యూఢిల్లీ: దేశంలో వైద్యం మరింత ఖరీదు కానుంది. అధిక ధరలతో ఇప్పటికే అల్లాడు తోన్న సామాన్యులపై మరింత భారం పడేలా కేంద్ర ప్రభుత్వ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా 900 రకాల ఔషధ ధరలు పెరగడమే ఇందుకు నిదర్శనం. వీటిలో యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, గుండె జబ్బులు, మధుమేహానికి సంబంధించిన అత్యవసర మందులున్నాయి. పెంచిన ...13లో

హెచ్‌సీయూ భూముల చుట్టే రాజకీయం

- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు
- హెచ్‌సీయూలో ఇంకా ఉద్రిక్త పరిస్థితులు
- పట్టు వదలకుండా విద్యార్థుల ఆందోళన
- బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు హౌస్ అరెస్టు
- బీజేపీ ఎమ్మెల్యేల అరెస్టు
- అది ప్రభుత్వ భూమి అంటూ భట్టి ఉద్ఘాటన
- వర్సిటీలో భాగమంటున్న విద్యార్థులు

ఆ 400 ఎకరాలే ఇప్పుడు హాట్‌టాపిక్ | **క్యాంపస్‌ను ముట్టడించిన సీపీఐ(ఎం)**



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర రాజకీయం భూమి కేంద్రంగా సాగుతున్నది. సాగు భూములు పంచాలనీ, ఇండ్లస్థలాలను కేటాయించాలని కమ్యూనిస్టుల సారథ్యంలో ప్రభుత్వ భూముల్లో పేదలు ఎర్రజెండాలను పాతిన కార్యక్రమాలను చూశాం. కానీ భూమిని పరిరక్షించాలనీ, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టొద్దని విద్యార్థులు పోరాటాలు చేయడం అరుదుగా చూస్తాం. ఇప్పుడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లో అదే జరుగుతోంది. విద్యార్థులు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. వారికి మద్దతుగా రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు నిలిచాయి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వేనెంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమి ఇప్పుడు రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా మారింది. ప్రతిపక్ష పార్టీలతోపాటు అధికార పార్టీ కూడా ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీంతో ఆ భూమి గురించే ఇప్పుడు అంతా చర్చనీయాంశంగా మారింది. 400 ఎకరాల భూమిని హెచ్‌సీయూకే అప్పగించాలని వర్సిటీ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వేలంపాట వేసి భుములను అమ్మడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందనీ, జీవ వైవిధ్యం నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ భూమి పరిరక్షణ కోసం విద్యార్థుల ఆందోళన కొనసాగుతూనే ఉన్నది. అయితే ప్రాంగణం వద్ద భారీగా పోలీసుల మోహరింపు భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ఆ భూమి హెచ్‌సీయూది కాదనీ, ప్రభుత్వానిదేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. హెచ్‌సీయూకు సంబంధించి ఇంచు భూమిని కూడా తీసుకోబోమని ప్రకటించారు. కంచ గచ్చిబౌలిలో ఉన్న 400 ఎకరాల భూమిని హెచ్‌సీయూకు అప్పగించాలనీ, వేలం పాటను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో హెచ్‌సీయూ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావులను పోలీసులు ...3లో

హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత

యూనివర్సిటీ భూముల్లో ప్రభుత్వం అడుగుపెట్టొద్దు

విద్యార్థులకు మద్దతుగా సీపీఐ(ఎం) నిరసన | నాయకుల అడ్డగింత.. అరెస్టులు.. పలు పోలీస్‌స్టేషన్లకు తరలింపు 3లో

వేలాన్ని వెనక్కి తీసుకోవాలి

రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసనలు

పలు జిల్లాల్లో ముందస్తు అరెస్టులు

వివరాలు 3లో..

ఇంచు భూమీ తీసుకోలేదు

400 ఎకరాలకు బదులుగా 397 ఎకరాలిచ్చాం

విద్యార్థులు బీజేపీ, బీఆర్ఎస్ ట్రాప్‌లో పడకండి

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి వివరాలు 3లో

నేడు లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు

బీఏసీ నుంచి ప్రతిపక్షం వాకౌట్

- ఎనిమిది గంటల చర్చకు బీఏసీ నిర్ణయం
- బీజేపీ, కాంగ్రెస్‌లు తమ సభ్యులకు విప్ జారీ
- పార్లమెంట్ వ్యూహంపై ఇండియా బ్లాక్ భేటీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లు చర్చ, ఆమోదం కోసం నేడు (బుధవారం) లోక్‌సభ ముందుకు రానుంది. ఈ బిల్లును ఎలాగైనా ఆమోదించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించు కుంది. అయితే ప్రతిపాదిత బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తో న్నాయి. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం బిల్లుపై చర్చకు ఎనిమిది గంటలను కేటాయిస్తూ అంగీకరించింది. ప్రతిపక్షాలు 12 గంటల పాటు సుదీర్ఘమైన, విస్తృతమైన చర్చకు పట్టుబట్టాయి. కానీ ఎన్‌డీఏ పార్టీలు కేవలం నాలుగు నుంచి ఆరు గంటల చర్చ సరిపోతుందని పేర్కొన్నాయి. అయితే ప్రభుత్వం తమ గొంతు నొక్కుతోందని ...13లో



గుజరాత్ బాణాసంచా గిడ్డంగిలో భారీ అగ్నిప్రమాదం

18 మంది మృతి

అహ్మదాబాద్: గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా దీసా పట్టణంలోని ఓ బాణాసంచా గిడ్డంగిలో మంగళవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ఐదుగురు గాయ పడ్డారు. దీపక్ ఫైర్‌క్రాకర్స్ ...13లో

విదేశీ యువతిపై లైంగికదాడి

నిందితుడికి రిమాండ్

రంగారెడ్డి జిల్లా పహాడీషరీఫ్‌లో ఘటన



నవతెలంగాణ-బడంగ్‌పేట్

పర్యాటక ప్రాంతాలను చూపిస్తానంటూ తీసుకెళ్లి విదేశీ యువతిపై లైంగికదాడికి ఒడిగట్టాడు ఓ యువకుడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా పహాడీ షరీఫ్ పోలీస్ ...13లో

ఆక్రమణల చెరలో అడవులు

25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కబ్జా

అడవులు పచ్చగా ఉంటేనే పర్యావరణం బాగుంటుంది. పర్యావరణం బాగుంటేనే అక్కడ జీవించే జంతువులు, పశుపక్ష్యాదులతో పాటు ప్రజలూ బాగుంటారు. అయితే ఈ అటవీ ప్రాంతాల్లో ఉన్న నిక్షేపాలు, సంపదపై కేంద్రం, బీజేపీ పాలిత రాష్ట్రాల కన్నుపడింది. 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని అడవులు ఆక్రమణల చెరలో ఉన్నట్టు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ గుర్తించింది. జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు సమర్పించిన కీలకమైన డేటాలో ఈ విషయాన్ని తెలిపింది.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అధికం

ఎన్జీటీకి కేంద్ర పర్యావరణ శాఖ నివేదిక



న్యూఢిల్లీ : ఢిల్లీ, సిక్కిం, గోవాల మొత్తం భౌగోళిక విస్తీర్ణం కంటే 13,000 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఆక్రమణల చెరలో ఉన్నట్టు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)కు నివేదించింది. ఢిల్లీ కంటే ఐదు రెట్లు ఎక్కువ పరిమాణంలో ఉన్న 7,50,648 హెక్టార్ల (లేదా 7,506.48 చదరపు కిలోమీటర్లు) అటవీ ప్రాంతం భారతదేశంలో ఆక్రమణకు గురైనట్టు ...6లో



ప్రతీకారానికి సమయమిదే

భారత్ 100 శాతం సుంకాలను వసూలు చేస్తోంది : వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్

అందరి చూపు ట్రంప్ వైపే

వాషింగ్టన్: తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాల పైన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధానికి కౌంట్‌డౌన్ షురూ అయింది. ఇప్పుడు అందరి దృష్టీ ఆయన పైనే నిలిచి ఉంది. ఎందుకంటే ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల విధింపు ప్రక్రియ బుధవారం (ఏప్రిల్ 2) నుంచి అమలులోకి రాబోతోంది. దీనిని ఆయన విమోచన దినోత్సవంగా అభివర్ణించారు. అమెరికా ఉత్పత్తులపై విదేశీ వాణిజ్య భాగస్వాములు ఎంత మేర సుంకాలు విధిస్తారో తాము కూడా వారి ఉత్పత్తులపై ఆ స్థాయిలోనే దిగుమతి సుంకాలు విధిస్తామని, కాబట్టి ఇక తాము విదేశీ ...13లో

అమానుషం... చట్టవిరుద్ధం

ప్రయాగరాజ్ కూల్చివేతలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- పిటిషనర్లకు రూ.పది లక్షల చొప్పున చెల్లించాలని ఆదేశం



న్యూఢిల్లీ : 2021లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో కొన్ని నివాస గృహాలను కూల్చివేసిన ఉదంతంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ చర్య 'అమానుషం...చట్టవిరుద్ధం' అని వ్యాఖ్యానించింది. పిటిషనర్లకు ఒక్కొక్కరికీ రూ.పది లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రయాగరాజ్ అభివృద్ధి సంస్థను ఆదేశించింది. ప్రయాగరాజ్‌లో ఇండ్ల కూల్చివేతలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను గతంలో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. దీనిని సవాలు చేస్తూ కొందరు బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై జస్టిస్ ఏఎస్ ఓకా, ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ మంగళవారం విచారణ జరిపింది.

తమ సమాధానాన్ని తెలియ జేసేందుకు పిటిషనర్లకు తగిన సమయం ఇవ్వలేదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. 'ఈ కేసులు మా మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురిచేశాయి. అప్పీలెంట్లు నివసిస్తున్న గృహాలను దౌర్జన్యపూరితంగా కూల్చివేసిన తీరుపై చర్చించాము. ప్రయాగరాజ్ అభివృద్ధి సంస్థలో సున్నితత్వం లోపించిందన్న విషయాన్ని కూల్చివేతలు సూచిస్తున్నాయి' అని సుప్రీం బెంచ్ అక్షింతలు వేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో నివాస హక్కు అంతర్భాగంగా ఉన్నదన్న విషయాన్ని అధికారులు...ముఖ్యంగా అభివృద్ధి సంస్థ గుర్తుంచుకోవాలని సూచించింది. అలహాబాద్ హైకోర్టు రూలింగ్‌ను వ్యతిరేకిస్తూ ఓ ప్రొఫెసర్, ఓ న్యాయవాది, మరో ముగ్గురు సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేశారు.

మార్క్సిస్టుల మహాసభకు మదురై సిద్ధం

నేటి నుంచి సీపీఐ(ఎం) 24వ అఖిల భారత మహాసభలు

- విచ్చేసిన అతిరథ మహారథులు
- ఏర్పాట్లను పరిశీలించిన ప్రకాశ్ కరత్, బీవీ రాఘవులు, బృందా కరత్ తదితరులు
- కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర ప్రదర్శన, పుస్తక ప్రదర్శన ప్రారంభం
- ఉత్సాహభరితంగా సాంస్కృతిక కార్యక్రమాలు



మదురై నుంచి బీవీఎన్.పద్మరాజు

రాబోయే మూడేండ్ల కాలానికి దేశానికి దిశా నిర్దేశం చేయనున్న సీపీఐ (ఎం) అఖిల భారత మహాసభలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ మహాసభలకు తమిళనాడులోని మదురై నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. మహాసభల్లో పాల్గొనేందుకు వీలుగా ఇప్పటికే పార్టీ అగ్ర నాయకత్వం అక్కడకు చేరుకుంది. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్, పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, బృందా కరత్‌తో పాటు తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పీ.షణ్ముగం, స్థానిక ఎంపీ వెంకటేశన్ తదితరులు మంగళవారం ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

మహాసభల వేదికైన కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్ (మదురై కన్వెన్షన్ సెంటర్)లోని కామ్రేడ్ కొడియెరి బాలకృష్ణన్ హాల్‌తో పాటు ఆహ్వాన సంఘం, వైద్య శిబిరం, కేంద్ర కమిటీ మీటింగ్ హాల్, మీడియా సెంటర్, అమర వీరుల స్థూపం, పుస్తక ప్రదర్శన, కమ్యూనిస్టు పార్టీ చరిత్రను తెలిపే ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక తదితర విభాగాలను వారు కలియదిరిగారు. నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లకు తగిన సూచనలు, సలహాలనిచ్చారు.

మదురైలోని తముక్కమ్ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను తెలిపే ప్రదర్శనను సీనియర్ పాత్రికేయులు ఎన్.రామ్, పుస్తక ప్రదర్శ నను సీపీఐ (ఎం) సీనియర్ నేత వీ.పరమేశ్వరన్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ కార్పొరేట్ శక్తుల పైనా, మతోన్మాదంపైనా పోరాడాలని పిలుపునిచ్చారు.



ప్రాంగణానికి సీతారాం ఏచూరి పేరు

ద్వారానికి బుద్ధదేవ్.. ఆడిటోరియానికి కొడియేరి హాల్‌గా నామకరణం..

- అరుణ పతాకాన్ని ఆవిష్కరించనున్న బిమన్ బసు
- సౌహార్ద సందేశాలివ్వనున్న వామపక్ష అగ్ర నేతలు
- నేటి ఉదయం 10 గంటలకు సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభ ప్రారంభం

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ మహాసభకు ఆతిథ్యం ఇవ్వనున్న మదురై నగరం అడుగడుగునా సీపీఐ (ఎం) అగ్రనేతలను స్మరించుకుం టోంది. ఇక్కడి కన్వెన్షన్ సెంటర్‌కు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేరును, ద్వారానికి పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య పేరును పెట్టారు. ఆడిటోరియానికి సీపీఐ (ఎం) మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు కొడియేరి బాలక్రిష్ణన్ హాల్‌గా నామకరణం చేశారు. మహాసభల్లో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనంతరం వెణ్మణి అమరవీరుల స్మారక పతాకాన్ని కేంద్ర కమిటీ సభ్యులు యూ.వాసుకి స్వీకరించి, పార్టీ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మెన్ ఏకే పద్మనాభన్‌కు ...14లో

విద్యుద్ఘాతంతో కార్మికుడి మృతి



మెదక్ జిల్లా శ్రియన్ పాలిమర్స్ పరిశ్రమలో ఘటన

భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే

యాజమాన్యం నిర్లక్ష్యమే : కార్మిక సంఘాలు 13లో

మార్కెట్లలో టారిఫ్‌ల కల్లోలం

సెన్సెక్స్ 1400 పాయింట్ల పతనం

తొలి రోజు ట్రంప్ సుంకాల ఎఫెక్ట్

ఐటీ షేర్ల విలవిల

రూ.3.44లక్షల కోట్ల సంపద ఆవిరి

భగ్గుమన్న చమురు ధర 13లో

లైంగిక దాడి ఘటనల్లో నేరస్తులను కఠినంగా శిక్షిస్తాం

- మత్తుపదార్థాలే ఘటనలకు కారణమని తేల్చాం
- వాటి నివారణకు చర్యలు తీసుకుంటాం : మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

లైంగిక దాడి ఘటనల్లో బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామనీ, నిందితులను కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట, హైదరాబాద్ లైంగిక దాడుల ఘటనలపై ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖా గోయల్, హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు సివి ఆనంద్, సుధీర్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీలతో సీతక్క టెలిఫోన్లో మాట్లాడి ఆరా తీశారు. ఈ సందర్భంగా రెండు ఘటనల కేసుల పురోగతి వివరాలు, బాధితుల ఆరోగ్య పరిస్థితులను అధికారులు వివరించారు. బాధితులకు అన్ని రకాల సహాయం చేయడంతో పాటు, నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. రెండు ఘటనల్లో నిందితులర్నీ అరెస్టు చేశామనీ, కఠిన శిక్షలు పడేలా చూస్తామని తెలిపారు. బాధితులకు అండగా నిలిచామనీ, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సఖి సెంటర్ సంరక్షణలో బాధితులను సంరక్షిస్తున్నామని చెప్పారు. లైంగిక దాడి ఘటనలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. లైంగిక దాడి ఘటనకు మత్తు పదార్థాలూ కారణమని భావిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల కట్టడి కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పోలీస్ శాఖ సహకారంతో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలి

- సన్నబియ్యం పంపిణీపై సీఎస్ శాంతికుమారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రేషన్ బియ్యం నాణ్యత, పరిమాణానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. మంగళవారం ఆమె కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సమీక్షించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించేందుకు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలనీ, అందుకు తగిన విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. ఇప్పటికే యాభై శాతానికి పైగా సన్నబియ్యం చౌక ధరల (రేషన్ షాప్) దుకాణాలకు వచ్చాయనీ, మిగిలిన స్టాక్‌ను రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు.

హైదరాబాద్‌లో 11 నుంచి తెలంగాణ రైతు మహోత్సవం

- రైతు కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అగ్రి హార్టీ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏప్రిల్ 11 నుంచి 14 వరకు తెలంగాణ రైతు మహోత్సవం-2025 నిర్వహిస్తున్నట్టు రైతు కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రైతులు పండించే ఉత్పత్తులు, యంత్ర పరికరాలు ప్రదర్శించబడతాయని తెలిపారు. రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి మాట్లాడుతూ భూసార పరిరక్షణకు చర్యలు చేపట్టాలనీ, వచ్చే పదేండ్లలో మరింత క్షీణించే ప్రమాదముందని హెచ్చరించారు. దీంతో ఇప్పటికే పంట దిగుబడి తగ్గుముఖం పట్టిందని తెలిపారు. ఎక్కువగా రసాయన పురుగు మందులు చల్లడం వల్ల ఈ ప్రమాదం ఏర్పడుతోందని వివరించారు. సేంద్రియ ఎరువు, పశువుల పెంట పొలాల్లోకి వదలడం వల్ల పంట పొలాలు మళ్లీ జీవం పోసుకుంటాయని సూచించారు. తన సొంత పొలం పూర్తిగా పాడైతే దాన్ని పశువుల పెంటతో తిరిగి సాధారణ స్థాయికి వచ్చేలా చేసినట్టు తెలిపారు. వానపాములు వదిలే వ్యర్థాలతో తన పంట పొలంలో ఏ పంట వేసినా బాగా దిగుబడి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో నాగార్జునసాగర్ ప్రాంతం ఏపీలో మరికొన్ని జిల్లాల్లో పంట పొలాలు క్షీణిస్తున్నాయ న్నారు. వ్యవసాయ భూముల సారం పెంచుకునే బాధ్యత మనందరిదనీ, లేదంటే ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

సెక్యూరిటీ గార్డుల వేతన వెతలు..!

నిమ్స్‌లో 3 నెలలుగా పెండింగ్ | **ఇబ్బందులు పడుతున్న సిబ్బంది కుటుంబాలు**



OPDSS

నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్ హాస్పిటల్‌లో పని చేసే సెక్యూరిటీ సిబ్బంది వేతన వెతలు ఎదుర్కొంటున్నారు. వేతనాలు సకాలంలో చెల్లించక మూడు నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఈ నెల 19వ తేదీన బాధితులు హాస్పిటల్‌లో నిరసన సైతం తెలిపారు. ఇది గడిచి దాదాపు 15 రోజులు కావస్తున్నా.. ఇటు నిమ్స్ యాజమాన్యం కానీ.. అటు సంబంధిత ఏజెన్సీ కానీ స్పందించకపోవడంతో రోజురోజుకూ పరిస్థితి జఠిలంగా మారుతోంది.

పంజాగుట్ట నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్స్ (నిమ్స్)లో సెక్యూరిటీ సిబ్బంది జీవితాలకు భద్రత కరువైంది. ఇక్కడ దాదాపు 120 మంది వరకు సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారు. నిత్యం వేలాది మంది రోగులు, వారి సహాయకులతో పాటు డైట్ క్లర్క్ మొదలు వార్డు బాయ్‌ల వరకు అందరికీ రక్షణగా నిలిచే వీరికి సకాలంలో వేతనాలు అదకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. 24/7 గంటలు హాస్పిటల్ భద్రతను పర్యవేక్షించే సెక్యూరిటీ గార్డులకు వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఉగాది పండగ పూట సైతం పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది. ఇచ్చేది అరకొర వేతనాలే అయినా.. సకాలంలో అందకపోవడంతో పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారు. స్కూల్ యాజమాన్యం, ఇంటి యజమానులతో నిత్యం అవమానాలు తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 3 నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇంటిల్లిపాది రోడ్డున పడే దుస్థితి నెలకొందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిమ్స్ యాజమాన్యం స్పందించి పెండింగ్ వేతనాలతోపాటు ఇక నుంచి నెల నెలా సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గోల్‌మాల్ ఏజెన్సీకే మళ్లీ బాధ్యతలు..!

నిమ్స్ హాస్పిటల్‌లో సెక్యూరిటీ గార్డుల ఏజెన్సీలు ఎన్ని మారినా రెండు, మూడు నెలలకోసారి వేతనాలివ్వడం పరిపాటిగా మారిపోయింది. గతంలో ఓ ఏజెన్సీ నిమ్స్ సెక్యూరిటీ గార్డులకు చెల్లించాల్సిన రూ.లక్షల పీఎఫ్ డబ్బులను నొక్కేసినా ఇప్పటి వరకు యాజమాన్యం ఆ ఏజెన్సీపై ఎలాంటి విచారణకు ఆదేశించకపోగా, మళ్లీ అలాంటి సంస్థలకే బాధ్యతలు అప్పగిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా ఏజెన్సీలతో నిమ్స్ యాజమాన్యం కుమ్మక్కై, చిరు ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కార్తికేయ, ఓపీడీఎస్ఎస్ (ఓం సాయి ప్రొఫెషనల్ డిటెక్టివ్ అండ్ సెక్యూరిటీ ప్రయివేటు లిమిటెడ్ సంస్థలు) నిమ్స్ సెక్యూరిటీ బాధ్యతలను చూసుకుంటున్నాయి. దాదాపు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా తాత్సారం చేస్తున్నారు. దాంతో సెక్యూరిటీ గార్డులు ఇటీవల విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. కాగా గతంలో సుమారు రూ.3 కోట్ల పీఎఫ్ డబ్బులు గోల్‌మాల్‌కు పాల్పడినట్టు ఆరోపణలు సైతం బహిరంగంగానే వచ్చాయి. ఆ సంస్థకు ఈ విషయంపై కార్మికశాఖ నుంచి నోటీసులు సైతం అందినట్టు సమాచారం. ఆయా ఏజెన్సీలతో నిమ్స్ యాజమాన్యం కుమ్మక్కై సెక్యూరిటీ గార్డుల వేతనాల విషయంలో తాత్సర్యం వహిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.



6 నుంచి 14 వరకు సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్

- 12న హైదరాబాద్‌లో "సమకాలీన పరిస్థితుల్లో భారత రాజ్యాంగం అంబేద్కర్ - కార్మికవర్గ కర్తవ్యం"పై సెమినార్
- రణదీవె వర్ధంతి, అంబేద్కర్, పూలే, విమలా రణదీవె జయంతులను నిర్వహించాలి : కార్మికవర్గానికి సీఐటీయూ పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహనీయుల జయంతులు, వర్ధంతులను పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల ఆరో తేదీ నుంచి 14వరకు సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్‌ను నిర్వహించనున్నట్టు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రకటించారు. 6న కార్మికోద్యమ నేత, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ.రణదీవె వర్ధంతి, 10న విమలా రణదీవె జయంతి, ఏప్రిల్ 11న భారతీయ సామాజిక సంఘసంస్కర్త పూలే జయంతి, ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత, సామాజి కోద్యమకారుడు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయ సాధన యాత్ర పేరుతో ఏప్రిల్ 13న జిల్లాలో 15 కిలో మీటర్ల బైక్ ర్యాలీలు నిర్వహించాలనీ, ఏప్రిల్ 8, 9, 10 తేదీల్లో సీఐటీయూ అనుబంధ యూనియన్లన్నీ కార్మికుల నుంచి భారీగా సామాజిక సంఘీభావ నిధిని సేకరించాలని పిలుపునిచ్చారు. 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "సమకాలీన పరిస్థితుల్లో భారత రాజ్యాంగం అంబేద్కర్ - కార్మికవర్గ కర్తవ్యం" అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్టు తెలిపారు. నిధి క్యాంపెయిన్‌తో పాటు అన్ని కార్యక్రమాల్లోనూ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎస్వీకేలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులం, మతం, ప్రాంతం, లింగ బేధం లాంటి సామాజిక రుగ్మతలు మన దేశంలో ప్రజల్ని, కార్మికవర్గాన్ని ఐక్యం కానివ్వకుండా దారికడ్డంగా, ముళ్ళ కంచెలా వున్నాయన్నారు. రాష్ట్రంలో నేటికీ పరిశ్రమల్లో, విద్యాలయాల్లో, పని ప్రదేశాల్లో చాప కింద నీరులా కులవివక్ష కొనసాగుతున్నదని వాపోయారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీ ఉద్యోగులూ వివక్ష, దాడులకు గురవుతున్న తీరును వివరించారు. రాష్ట్రంలో కుల వివక్ష, అంటరానితనం, కుల దురహంకార హత్యలు, సాంఘిక బహిష్కరణలు, మహిళలపై లైంగిక దాడులు నిత్యకృత్యంగా మారడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బూజు పట్టిన మనువాద సిద్ధాం తాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్నదని విమర్శించారు. దేశ భక్తి ముసుగులో మతం పేరుతో శ్రామిక ప్రజలు, కార్మికుల్లో చిచ్చుపెడుతున్న తీరును ఎండగట్టారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పాలన చేస్తున్న బీజేపీ అదును చూసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నదని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చి కార్మిక హక్కులను హరించబోతున్నదని తెలిపారు. కార్మికవర్గంలో సున్నితమైన కులం, మతం అంశాలను ముందుకు తెస్తూ ఐక్యతను విచ్ఛిన్నం చేసి పాలక, దోపిడీ వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకుం టున్నా యని విమర్శించారు. సమాజంలో అన్నిరకాల దోపిడీ, అణచివేత, వివక్ష నుంచి శ్రామిక వర్గాన్ని విముక్తి చేసి, పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యా మ్నాయంగా కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపిం చాలనే లక్ష్యంతో సీఐటీయూ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ఇటీవలి కాలంలో కుల దురంహకార ఘటనలు జరిగినప్పుడు బాధితుల పక్షాన జరిగిన పోరాటాలకు సీఐటీయూ ప్రత్యక్షంగా, పరోక్షంగా అండగా నిలిచిన తీరును వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, వీఎస్. రావు, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, పి. సుధాకర్, ఎ. సునీత తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములు లాక్కోవడం లేదు

- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయం భూములను లాక్కోవడం లేదని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ భూములకు బదులుగా ఎప్పుడో వేరే చోట భూములు కేటాయించినట్టు తెలిపారు. ఆ భూమి ఇప్పటి వరకు కోర్టు కేసులో ఉన్నందున ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదనీ, ఇప్పుడు ఆ కేసులో ప్రభుత్వం గెలిచినందున వాటిని స్వాధీనం చేసుకుందని తెలిపారు. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు కావాలని ఈ విషయాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం తమదేనని స్వాధీనం చేసుకోవడంతో విద్యార్థులను రెచ్చగొట్టి వివాదం సృష్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా కోర్టు తీర్పు తర్వాత స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని గుర్తుచేశారు.

కృష్ణ, బీమా నదులకు నీటిని విడుదల చేయండి

- మహారాష్ట్రకు కర్నాటక సీఎం సిద్ధరామయ్య విజ్ఞప్తి

బెంగళూరు : ఉత్తర కర్నాటకలోని బెళగావి, విజయపుర, బాగల్‌కోట్, కాల్‌బుర్గి, యాద్గిర్, రాయిచూర్ జిల్లాల ప్రజల తాగునీటి అవసరాలు తీరేవిధంగా మహారాష్ట్రలోని రిజర్వాయర్ల నుంచి కృష్ణ, బీమా నదులకు నీటిని విడుదల చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం విజ్ఞప్తి చేశారు. వార్నా/కొయినా రిజర్వాయర్ నుంచి కృష్ణా నదికి కనీసం రెండు టిఎంసిల నీటిని, ఉజ్జిని రిజర్వాయర్ నుంచి ఒక టీఎంసీల నీటిని విడుదల చేసే విధంగా సంబంధిత అధికారుల్ని ఆదేశించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను సిద్ధరామయ్య అభ్యర్థించారు.

ఉత్తర కర్నాటకలోని ప్రజల, పశువుల తాగునీటి అవసరాలను తక్షణం తీర్చేవిధంగా చూడాలని కోరారు. ఈ ఏడాది మార్చి ప్రారంభం నుంచి ఉత్తర కర్నాటక ప్రాంతం తీవ్ర తాగునీటి కొరతను ఎదుర్కొంటుందని సిద్ధరామయ్య తెలిపారు.

హెచ్‌సీయూపై బీజేపీ, బీఆర్ఎస్ కపట ప్రేమ

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయంపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కపట ప్రేమ ప్రదర్శిస్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. మంగళవారం మై హెూం విహంగ వద్ద ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, విద్యార్థి నాయకులు ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కంచె గచ్చిబౌలిలో సర్వే నెంబర్ 25లో 2004లో 534 ఎకరాలు ప్రభుత్వానికి ఇస్తున్నట్టు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ సంతకం చేశారని తెలిపారు.

దానికి బదులుగా ప్రభుత్వం ఆ యూనివర్సిటీకి 397 ఎకరాలు ఇస్తున్నట్టు సంతకం చేసిందని చెప్పారు. 534లో 400 ఐఎంజీ భారత్‌కు 120 ఎకరాలు, ఉద్యోగ సంఘాలకు కేటాయించారని వివరిం చారు. అయితే ఐఎంజీ భారత్ ఒప్పందం ప్రకారం వ్యవహరించకపోవడంతో భూములు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ప్రభుత్వం న్యాయ పోరాటం చేసిందని గుర్తుచేశారు. కోర్టుల్లో న్యాయపోరాటం చేసి ప్రభుత్వం 400 ఎకరాలు సాధించిందని చెప్పారు. అయితే సదరు భూములు ప్రయివేటు వ్యక్తులకు చెందాలని కొందరు భావిం చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ 25 సర్వే నెంబర్‌లోనే బీఆర్ఎస్ హయాంలో మై హెూం విహంగకు 25 ఎకరాలు కట్టబెట్టారని చెప్పారు. ఆ స్థలంలో పెద్ద భవనాలు నిర్మించారనీ, రెండు భవనాలకే వంద ఫీట్ల రోడ్డు వేశారన్నారు.

మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆక్రమణకు ప్రయత్నం

ఉద్యోగ సంఘాలకు కేటాయించిన భూమిలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తప్పుడు పేర్లతో 20 ఎకరాలు ఆక్రమించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఆ 20 ఎకరాలు ప్రభుత్వం గుంజుకుంటుందన్న భయంతో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన మై హెూం నిర్మాణాల వద్దకు ఫాక్ట్ ఫైండింగ్ కమిటీ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. పర్యావరణం దెబ్బతింటుందంటున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మై హెూం విహంగకు 25 ఎకరాలు ఇచ్చినప్పుడు కనిపించలేదా? అని ప్రశ్నించారు. లోపాయికారీ ఒప్పందాలు లేకపోతే మై హెూం నిర్మాణం చేస్తున్నప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వ్యక్తిగత స్వార్థం కోసమే ప్రభుత్వ భూమిని మై హెూం కు కట్టబెట్టారని విమర్శించారు.

ఆన్‌లైన్ స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలు

- వాట్సప్‌లో లింకులు పంపించి డబ్బులు స్వాహా
- నిందితుని అరెస్ట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్‌లో అధిక లాభాలు వచ్చే విధంగా ఆన్‌లైన్‌లో ఐడియాలు ఇస్తామంటూ మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నోయిడాకు చెందిన శివశంకర్ డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని పథకం వేశాడు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆన్‌లైన్‌లో ఐడియాలు చెబుతానంటూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలీగ్రామ్, వాట్సప్‌లో ప్రచారం చేసేవాడు. 'ఓటీసీ స్టాక్స్, సామ్ గ్రూప్ పేరుతో ఐడియాలు ఇస్తామంటూ నమ్మించేవాడు. తాను చెప్పిన విధంగా ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే భారీగా లాభాలొస్తాయని నమ్మించి వాట్సప్‌లో లింక్‌లను పంపించేవాడు. స్పందించిన వారితో ఇన్వెస్ట్‌మెంట్ చేయించేవాడు. ఆ తర్వాత మీకు 20 శాతం లాభాలొచ్చాయని చెప్పేవాడు. వాటిని తీసుకోవాలంటే మరికొన్ని డబ్బులు డిపాజిట్ చేయాలంటూ ఇన్వెస్ట్ పెట్టించేవాడు. ఇన్వెస్ట్‌మెంట్ చేసిన డబ్బులను వివిధ (తన బినామీ బ్యాంక్ అకౌంట్స్‌కు) బ్యాంక్‌లకు ట్రాన్స్‌ఫర్ చేసుకునేవాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన పలువురిని మోసం చేశాడు. దాదాపు రూ.14,63,046ను దండుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి నిందితున్ని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్లు, నాలుగు చెక్‌బుక్‌లు, రెండు డెబిట్‌కార్డులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టాలని, ఉద్యోగాలిపిస్తామని, రుణాలిస్తామని ఎవరైనా చెబితే నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచించారు.



గడ్డి పోచలు

'గడ్డి పోచలు పేని/గట్టి ఏనుగునేని/ కట్టు వాడే జ్ఞాని' అని ఆరుద్ర కూనలమ్మ పదాలులో అన్నారు. ఒక గొప్ప విషయాన్ని ఇంత చిన్న మాటలో అల్లిన ఆరుద్రని మనం గురువుగా భావించాలి. గడ్డిపోచ విడిగా ఒకటిగా వుంటే చాలా బలహీనంగా, గాలివాటుకు ఎటుపడితే అటు కొట్టుకు పోతుంది. ఆ గడ్డిపోచలకే బలం రావాలంటే వాటిని ఎవరో ఒకరు పేనాలి. అంటే బయట నుంచి సహాయం ఉండాలన్న మాట. నిజానికి అసంఘటిత రంగానికి చెందిన కార్మికులను, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యాలు, సమాజంలోని ధనికవర్గాలు గడ్డిపోచల క్రింద తీసిపారేస్తుంటాయి. వారి మాన, ధన సమస్యలను సమస్యలుగానే గుర్తించవు.



కానీ, అన్ని సందర్భాలలో గడ్డిపోచలకు బలం తెప్పించటానికి జ్ఞానులు అవసరం ఉండకపోవచ్చు. వారి అనుభవాలే వారిని పెనవేసుకు పోయేటట్టు, బలంగా నిలబడేటట్టు చేస్తాయి. ఈ మధ్య విశాఖపట్నంలో జరిగిన డెలివరీ బాయ్ సంఘటన మనకు మంచి ఉదాహరణ.

విశాఖపట్నం అంటే ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పిడికిలెత్తిన నగరం. బంద్‌లు, రాస్తారోకోలతో సహా వివిధ పోరాట మార్గాలలో ఉక్కు కార్మికులను, విశాఖ ప్రజలను ఒక్క తాటిపైకి తెచ్చి ఏకదీక్షతో పోరాటం సాగిస్తున్న యూనియన్ ఉన్న నగరం అది. ధృఢ సంకల్పంతో రెండు, మూడేండ్లుగా సాగుతున్న ఈ పోరాటం విశాఖ కార్మికులపై తప్పక ఉంటుంది.

ఈ నేపథ్యంలో డెలివరీ బాయ్‌పై ఆక్సిజన్ అపార్ట్‌మెంటులో జరిగిన అమానుష దాడి ఆ నగరంలో పనిచేస్తున్న డెలివరీ బాయ్స్‌కు ఎక్కడలేని ఆగ్రహం తెప్పించింది. ఆ అపార్ట్మెంట్‌లో బాగా డబ్బున్న వారు మాత్రమే ఫ్లాట్ కొనగలరు. ఆ ఆక్సిజన్ అపార్టుమెంటులో ఫుడ్ పార్సిల్ ఇవ్వటానికి వెళ్లిన డెలివరీ బాయ్‌ని ఏ తప్పు లేకపోయినా కొట్టటమే కాక, సార్ అని పిలవనందుకు క్షమాపణ పత్రం రాయించుకుని గుడ్డలిప్పించి, రోడ్డు మీదకు గెంటటం డెలివరీ బాయ్స్ అందరూ అది తమకు జరిగిన అవమానంగా భావించారు. దీనికి ప్రతిగా స్విగ్గీ, జోమాటో, ఉబర్, ఓలా ఇలా అన్ని కంపెనీల డెలివరీ బాయ్స్ ఆక్సిజన్ అపార్ట్‌మెంట్ ఆర్డర్లను బాయ్‌కాట్ చేశారు. దానితో కదలిక వచ్చిన పోలీస్ డిపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్‌పై కేసు పెట్టింది. అతను తను చేసిన దానికి క్షమాపణ చెప్పాడు. గిగ్ వర్కర్స్‌కి తమ ఐకమత్యంలో ఉన్న బలమేమిటో తెలిసింది. ఐకమత్యం అంటే ఏమిటో కాదు, యూనియన్‌గా ఉండటం. తక్షణ సమస్యపై వచ్చిన ఈ ఐక్యతను శాశ్వతం చేసుకోవటానికి మరి అక్కడి డెలివరీ బాయ్స్ యూనియన్ ఏర్పాటు చేసుకుంటున్నారో లేదో తెలియదు. యాదచ్ఛికంగా వచ్చిన ఈ ఐక్యత అన్ని వేళలా రాదు. ఇటువంటి ఐక్యతను శాశ్వతం చేయటానికి ఆరుద్ర చెప్పిన జ్ఞానుల అవసరం వుంది.

తమ బలం ఎక్కడుందో సరిగ్గా గ్రహించారు కనుకనే తమిళనాడులో శ్యామ్‌సంగ్ కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు కోసం 35 రోజులపాటు పట్టువదలక సుదీర్ఘపోరాటం చేసి విజయం సాధించారు.. యూనియన్లు ఉన్న చోట, యూనియన్లు లేనిచోట కార్మికుల పని పరిస్థితులు బేరీజు వేసుకుంటే యూనియన్లు ఉండటం ఎంత అవసరమో తెలుతుంది.

తెలంగాణాలో చట్టంలో ఉన్నాగాని, కనీస వేతనాలు సవరించటం జరగలేదు. అటువంటి వేతన సవరణ కోసం వేలాది ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులు ఎదురు చూస్తున్నారు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ రెండూ ఈ విషయం గురించి పట్టించుకోవటం లేదు. ఆ పార్టీలకు ఎన్నికల సమయంలో తప్ప మిగతా సమయాలలో ఫ్యాక్టరీ ఓనర్లు తప్ప కార్మికులు దృష్టిలో ఉండరు. ఇటువంటి ప్రభుత్వాలకు కార్మికులు తమ బలం చూపి, చట్టం అవకాశం కల్పించిన జీతభత్యాల పెంపు, హక్కులను సాధించే యూనియన్లు ఉండాలి.

మీరు ఏ షాపింగ్ మాల్‌నైనా గమనించండి. అక్కడ మహిళా కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. వారు కూర్చోవటానికి అక్కడ స్టూల్లాంటివి కూడా ఉండవు. వారు రోజంతా-కస్టమర్స్ ఉన్నా, లేకున్నా-నిలబడే వుండాలి. అలా పనిచేయటం అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. తమిళనాడు, కేరళలలో షాపింగ్ మాల్స్‌లో కార్మికులు కూర్చునే హక్కును సాధించారు. తెలంగాణాలో ఆ హక్కు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో తెలంగాణాలో కూడా కార్మికులకు ఆ హక్కు కల్పిస్తానని అన్నది. అప్పుడు ప్రస్తావించటమే తప్ప, మళ్ళీ మరోసారి ఆ మాట ఎత్తలేదు. షాపింగ్ మాల్స్ కార్మికులకు యూనియన్ ఉంటే ఈ హక్కు ఎప్పుడో వచ్చేది కదా. ఇప్పుడు చూడండి ఈ విషయాన్ని అసెంబ్లీలో లేవనెత్తి అడిగే కార్మిక నాయకుడు లేకుండా పోయాడు. ఇలాంటి సమస్యలు, యూనియన్లు పెట్టు కునే అవకాశానికి ప్రభుత్వం అడ్డంకులు కలిగించటంతో, అన్ని రంగాలలోనూ పేరుకుపోయాయి.

ఫ్యాక్టరీ లేదా ఒక సంస్థ ఉన్నది అంటే అక్కడ యూనియన్ ఉండాలి. ఆ యూనియన్‌లో ప్రతి కార్మికుడు సభ్యుడై ఉండాలి. ఆ యూనియన్‌ను నడిపే నాయకత్వం వుండాలి. ఆ నాయకత్వం కార్మికులలో కుల, మత, ప్రాంతీయ, లింగ బేధాలు తెచ్చే విచ్ఛిన్న శక్తుల ఆట కట్టించేటట్టు వుండాలి.

ఒకసారి ఢిల్లీలో ఆల్ ఇండియా పోటీలకు గణేష్ పాత్రో బందం రైలు ఎక్కింది. అప్పటికి నాటిక స్క్రిప్ట్ తయారు కాలేదు, రిహార్స్‌లు కాలేదు. అవన్నీ ఆ 24 గంటల రైలు ప్రయాణంలో పూర్తి చేసుకున్నారు. ఆ నాటిక పేరు 'కొడుకు పుట్టాల'. ఆ నాటికకు జాతీయ అవార్డు వచ్చింది. దానిని గురించి చెపుతూ గణేష్ పాత్రో ఒక మాటంటాడు. 24 గంటలలో నాటిక రాయటం, రిహార్సులు వేయటం, స్టేజీ మీద ఆడటం, అవార్డు రావటం ఇవన్నీ యాక్సిడెంటలే అంటాడు. అలాటి యాక్సిడెంట్స్ జరగకూడదు అంటాడు. అలాగే కార్మికుల మధ్య ఐక్యత విశాఖపట్నంలో వచ్చినట్టు యాక్సిడెంటుగా రాకూడదు, యూనియన్‌ని నిర్మించాలి. కార్మికుల మధ్య ఐక్యతను ఆ విధంగా సాధించాలి. అప్పుడే దేశంలోని, శ్రమ జీవులలోని సగం సమస్యలు తీరుతాయి.

- కర్లపాలెం

ఇంచు భూమీ తీసుకోలేదు

400 ఎకరాలకు బదులుగా 397 ఎకరాలిచ్చాం

- యూనివర్సిటీ భూముల లెక్క తేల్చి టైటిలిస్తాం
- హెచ్‌సీయూతో మాది భావోద్వేగ బంధం
- విద్యార్థులు బీజేపీ, బీఆర్ఎస్ ట్రాప్‌లో పడకండి : డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కు చెందిన ఇంచు భూమిని కూడా ప్రభుత్వం తీసుకోలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై వివరణ ఇచ్చారు. "కంచె గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25లో 400 ఎకరాల భూమిని 2004లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం క్రీడా వసతుల అభివృద్ధికి ఐఎంజీ అకడమీస్ భారత ప్రయివేట్ లిమిటెడ్‌కు కేటాయించింది. అందుకు బదులుగా గోపనపల్లిలో 397 ఎకరాల భూమిని యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. దాంతో ఆ వివాదం అక్కడితో ముగిసింది. ఐఎంజీ సంస్థ ప్రాజెక్టును ప్రారంభించకపోవడంతో 2006లో భూ కేటాయింపును రద్దు చేసింది. దాంతో ఐఎంజీ సంస్థ 2006లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత 2024లో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. దాంతో ఐఎంజీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. అక్కడ కూడా ఆ సంస్థకు చుక్కెదురైంది. ఆ భూమి ప్రభుత్వానిదేనని తేల్చింది. ఐటీ, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆ 400 ఎకరాలు కేటాయించాలని టీజీఐఐసీ 2024, జూన్ 19న ప్రతిపాదనలు సమర్పించింది. ప్రభుత్వ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆ భూమి హక్కులను టీజీఐఐసీకి బదలాయిస్తూ 2024, జూన్ 24న ఉత్తర్వులు జారీ చేశారు" అని భట్టి తెలిపారు. న్యాయస్థానంలో కొట్లాడి వేల కోట్ల విలువైన భూమిని రాష్ట్రానికి తీసుకొచ్చామనీ, ఇది ప్రజల విజయమని పేర్కొన్నారు. ప్రయివేట్ వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతమైన వేల కోట్ల విలువైన భూమిని కాపాడి ప్రజలకు ఆస్తిగా ఇచ్చిన ప్రభుత్వాన్ని శభాష్ అని ప్రశంసించాల్సిన ప్రతిపక్షాలు విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. లక్షల మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్న తాపత్రయంతో రెవెన్యూ శాఖ నుంచి టీజీఐఐసీకి అప్పగించామే తప్ప ఇందులో ఎవరికీ ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదన్నారు. ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి హైటెక్ సిటీలో ఫేస్ 1, ఫేస్ 2కి పునాదులు వేయడంతోనే హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందని గుర్తు చేశారు. "హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతో నాకు శ్రీధర్‌బాబుకు భావోద్వేగ బంధముంది. అక్కడ చదువుకున్న విద్యార్థులుగా దాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తప్పకుండా సహకారం అందిస్తాం. హెచ్‌సీయూలో చదివిన ప్రతి విద్యార్థికి బయటకు రాగానే ఉద్యోగాలు రావాలని, మంచి భవిష్యత్ ఉండాలని మా ప్రభుత్వం కోరుకుంటుంది" అని భట్టి తెలిపారు.

బీఆర్ఎస్, బీజేపీ గ్లోబల్ ప్రచారం: పొంగులేటి

కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిపై బీఆర్ఎస్, బీజేపీ గ్లోబల్ ప్రచారం చేస్తున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తమ స్వార్థ రాజకీయాల కోసం విద్యార్థులను, ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా రాజకీయాలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. టీజీఐఐసీ తయారు చేసిన డ్రాఫ్ట్ లేఔట్‌లో ఈ భూముల్లో ఉన్న న్యాచురల్ రాక్ ఫార్మేషన్స్, మష్రుమ్ రాక్‌ను మినహాయించామని చెప్పారు. ప్రయివేటు వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతం కాకుండా పోరాటం చేసి కాపాడిన భూమిని ప్రజలకు ఆస్తిగా ఇవ్వడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని కొన్ని రాజకీయ పార్టీలు వారి మీడియా సంస్థలు, సోషల్ మీడియా ద్వారా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రులతో సీఎం సమావేశం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క తదితర అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం కమాండ్‌కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం సమావేశమయ్యారు. కంచె గచ్చిబౌలి భూముల వ్యవహారం నేపథ్యంలో హెచ్‌సీయూలో చెలరేగుతున్న ఆందోళనలు, తాజా పరిణామాలపై చర్చించారు.

అది ప్రభుత్వ ఆస్తి : శ్రీధర్‌బాబు

కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో చట్టపరంగా గెలవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆ భూమిపై యాజమాన్యాన్ని దక్కించుకుందని పేర్కొన్నారు. వాస్తవం ఇలా ఉంటే తామేదో యూనివర్సిటీ భూమిని లాక్కున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. "ఇప్పటి వరకు ఒక్క ఎకరం భూమిపై కూడా యూనివర్సిటీకి చట్టబద్ధ హక్కులు లేవు. ఈ సమస్యను పరిష్కరించాలని యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నారు. కానీ గత బీఆర్ఎస్ సర్కార్ అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోలేదు. ఇప్పుడేమో పని గట్టుకొని మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. వీసీ, రిజిస్ట్రార్‌తో మేం ప్రత్యేకంగా సమావేశమయ్యాం. వారి విజ్ఞప్తి మేరకు మా ప్రభుత్వం యూనివర్సిటీకి నిబంధనల ప్రకారం భూములపై చట్టబద్ధ హక్కులు కల్పించేందుకు చొరవ తీసుకున్నాం. ఇందుకు సంబంధించిన కసరత్తు కొనసాగుతోంది. చట్టబద్ధంగానే ముందుకు వెళ్తాం. తప్పుడు ప్రచారంతో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, పర్యావరణ ప్రేమికులు ఆందోళనకు గురి కావొద్దు" అని మంత్రి విజ్ఞప్తి చేశారు.

సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఉన్న హెచ్‌సీయూ ఎస్ఎఫ్ఐ నాయకుడు

- ఎర్రం నవీన్‌ను పరామర్శించిన సీపీఐ(ఎం) నేతలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఉన్న హెచ్‌సీయూ ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎర్రం నవీన్‌ను సీపీఐ(ఎం) నేతలు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మీద, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి యూనియన్ నాయకుల మీద పోలీసుల నిర్బంధాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండించారు. హెచ్‌సీయూ భూముల రక్షణ కోసం పోరాడిన వారిని ప్రభుత్వం అరెస్టులు చేసి జైల్లో వేయడం సరికాదన్నారు. జైల్లో నాయకులను కలిసిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మానిక్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ తదితరులు ఉన్నారు.



వేలాన్ని వెనక్కి తీసుకోవాలి

- హెచ్‌సీయూ భూముల పై రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసనలు, అరెస్టులు
- పలు జిల్లాల్లో ముందస్తు అరెస్టులు

నవతెలంగాణ-విలేకరులు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేసే అనాలోచితమైన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, యూనివర్సిటీలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తూ సీపీఐ(ఎం) హెచ్‌సీయూ గేటు ఎదుట మంగళవారం ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ధర్నాకు వస్తున్న పలు జిల్లాల నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకొని ముందస్తు అరెస్టులు చేశారు. దాంతో జిల్లాల్లోనే ఎక్కడికక్కడ నిరసనలు, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, మెదక్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో పలుచోట్ల గృహనిర్బంధం చేశారు. తెల్లవారు జాము నుంచే నేతలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఇందులో ప్రజాసంఘాలు కూడా పాల్గొన్నాయి. మధ్యాహ్నం వరకు వారిని అదుపులో ఉంచుకున్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భువనగిరిలోని ప్రిన్స్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జనగామలోని బస్టాండ్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఫ్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ఆదిలాబాద్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో, నిర్మల్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ లోనూ దిష్టిబొమ్మను దహనం చేశారు.

యూనివర్సిటీల్లో ఎస్ఎఫ్ఐ, పలు విద్యార్థి సంఘాల నిరసన

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌సీయూలో భూముల వేలాన్ని ఆపాలని, విద్యార్థులపై నిర్బంధాన్ని ఆపాలని, అలాగే ఓయూలో అప్రజాస్వామిక సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ (విజృంభణ), ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, పీడీఎస్‌యూ(వి) నాయకులు విజయ్, పీడీఎస్‌యూ నాయకులు నవీన్ పాల్గొన్నారు. విద్యార్థి నాయకులు ర్యాలీగా తార్నాక వైపు వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని వారిని అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర చేసి మొదటి గేటు వద్ద దహనం చేశారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిమధ్య తోపులాట జరిగింది. దాంతో మొదటి గేటు ముందు రహదారిపై విద్యార్థి సంఘాలు రాస్తారోకో చేపట్టాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు.

బీఆర్ఎస్ బహిరంగ సభ కోసం ఆతృత

- ప్రజలే స్వచ్ఛందంగా తరలివస్తారు
- వింతగా కాంగ్రెస్ పాలన : కేసీఆర్



హైదరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం జనం ఆతృతతో ఎదురుచూస్తున్నారని ఆ పార్టీ అధినేత , మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. పార్టీ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో కేసీఆర్ మంగళవారం సమావేశమయ్యారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎల్కతుర్తిలో బహిరంగ సభకు భూమిపూజ చేయనున్నట్టు కేసీఆర్ వెల్లడించారు. సభకు వచ్చే జనానికి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.కాంగ్రెస్ పాలన వింతంగా ఉందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. మార్పు కోరుకున్న రైతుల కండ్లల్లో కన్నీళ్లే మిగిలాయన్నారు. రైతులకు ఈ దుస్థితి వస్తుందని కలలో కూడా తాను ఊహించలేదని చెప్పారు. ప్రభుత్వ చర్యలతో రైతులు, వివిధ వర్గాల ప్రజలు మనోధైర్యం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్‌సీయూ భూముల స్వాధీనం ఆపాలి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) భూముల స్వాధీనం వెంటనే ఆపాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భూమిని స్వాధీనం చేసుకునే చర్యను ఆపాలనీ, చెట్లను ధ్వంసం చేయడాన్ని నిలిపేయాలని కోరారు. అక్రమ అరెస్టులను ఆపాలనీ, కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీ భూములను, పర్యావరణ భూములు వర్సిటీ పరిధిలోనే ఉంచాలని సూచించారు. వర్సిటీ అడ్మినిస్ట్రేషన్, విద్యార్థులతో ఈ విషయంపై చర్చలు జరపాలని కోరారు. విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలతో చర్చలు జరిపి ఈ సమస్యకు ప్రత్యామ్నాయం చూడాలని తెలిపారు. హైదరాబాద్ పర్యావరణ సమతుల్యతను రక్షించడానికి ప్రభుత్వం, పౌర సంఘాలు, రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని కోరారు.

ఐద్రోజుల పాటు ఈదురుగాలులు, వడగండ్ల వానలు

- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ
- రాష్ట్రంలో 2 నుంచి 4 డిగ్రీల మేర తగ్గనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో వచ్చే ఐదు రోజుల పాటు రాష్ట్రంలో ఈదురుగాలులతో కూడి వర్షాలు పడే అవకాశముందనీ, పలుచోట్ల వడగండ్లు కూడా పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఎక్కువ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడుతాయని తెలిపారు. ఈదురుగాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొన్నారు. బుధవారం నుంచి తదుపరి నాలుగు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమేపి రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర తగ్గే అవకాశముందని తెలిపారు. 2,3 తేదీలకు సంబంధించి ఆరెంజ్ హెచ్చరిక జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలున్నాయి. ఆ జిల్లాల్లో పలుచోట్ల వడగండ్లు కూడా పడే ప్రమాదముంది. ఎల్లో హెచ్చరిక జాబితాలో జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సిద్దిపేట, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాలున్నాయి. రాబోయే 48 గంటల పాటు హైదరాబాద్‌లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

హెచ్‌సీయూ భూముల చుట్టే రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

హౌస్ అరెస్టు చేశారు. బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని కూడా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలు హెచ్‌సీయూ వద్దకు వెళ్లాలని బయల్దేరితే హైదర్‌గూడ వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

2,500 ఎకరాలతో హెచ్‌సీయూ

ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1974లో ఆరు సూత్రాల పథకంలో భాగంగా 2,500 ఎకరాలతో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అది యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గుర్తింపు పొంది దేశంలోనే ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంగా ప్రఖ్యాతి గాంచింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో యూనివర్సిటీల జాబితాలో 17వ ర్యాంకు, క్యూఎస్ ప్రపంచ ర్యాంకుల్లో 801 నుంచి 850వ ర్యాంకులో నిలిచింది. ఎంతో మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు.

2003లో ప్రయివేటు సంస్థకు ఇచ్చిన చంద్రబాబు యూజీసీ నిబంధనల ప్రకారం విశ్వవిద్యాలయ భూమిని విద్యా, పరిశోధన ప్రయోజనాలకే వినియోగించాలి. కానీ యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా 2004, జనవరి 13న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బిల్లీ రావుకు చెందిన ఐఎంజీ సంస్థకు 400 ఎకరాలను కేటాయించారు. అక్కడ క్రీడలను అభివృద్ధి చేసేందుకు ఆ భూమిని అప్పగించారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలను తీసుకున్న ప్రభుత్వం ఆ వర్సిటీకి గోపన్‌పల్లిలో 2004 జనవరి 31న సర్వేనెంబర్ 36లో 191.98 ఎకరాలు, సర్వేనెంబర్ 37లో 205.20 ఎకరాలు కలిపి మొత్తం 397.16 ఎకరాలను కేటాయించింది. అయితే ఐఎంజీ సంస్థ అక్కడ క్రీడలను అభివృద్ధి చేయలేదు. దీంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2006, నవంబర్ 21న ఐఎంజీకి కేటాయించిన 400 ఎకరాల భూమికి సంబంధించిన ఒప్పందాన్ని రద్దు చేశారు. దాన్ని సవాల్ చేస్తూ ఐఎంజీ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వానికి అనుకూలంగా 2024, మార్చి ఏడున తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీం కోర్టు కూడా 2024, మే మూడున ఐఎంజీ సంస్థ వేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో 400 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి దక్కినట్టు అయ్యింది. కానీ 2003లోనే చంద్రబాబు ప్రయివేటు సంస్థ ఐఎంజీకి 400 ఎకరాలను అక్రమంగా కట్టబెట్టడం గమనార్హం.

టీజీఐఐసీకి అప్పగించడం వల్లే వివాదం

అయితే తదనంతరం కంచ గచ్చిబౌలిలో ఉన్న 400 ఎకరాలను తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ)కి అప్పగించడమే ఇప్పుడు వివాదానికి కారణంగా ఉన్నది. 2022, సెప్టెంబర్ 14న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం భూ కేటాయింపులకు సంబంధించిన కొత్త విధానం ఆధారంగా 400 ఎకరాలను కొలిచి హక్కులను కల్పించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి 2024, జూన్ 19న టీజీఐఐసీ లేఖ రాసింది. అక్కడ ఐటీ, ఇతర ప్రాజెక్టులను నిర్మిస్తామని ప్రతిపాదనలు చేసింది. గతేడాది జూన్ 24న టీజీఐఐసీకి 400 ఎకరాల భూమిని బదలాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జులై ఒకటిన ఆ భూమిని రెవెన్యూ శాఖ టీజీఐఐసీకి అప్పగించింది. అదేనెల ఏడున హెచ్‌సీయూ రిజిస్ట్రార్‌ను టీజీఐఐసీ ప్రతినిధులు కలిసి ప్రాజెక్టు ప్రతిపాదనలను వివరించారు. జులై 19న రిజిస్ట్రార్, వర్సిటీ అధికారుల సమక్షంలో భూములను సర్వే చేశామని టీజీఐఐసీ ప్రకటించింది. ప్రతిపాదించిన 400 ఎకరాల ప్రాజెక్టులో వర్సిటీ భూముల్లేవని టీజీఐఐసీ స్పష్టం చేసింది. అయితే 400 ఎకరాల్లో పక్షి జాతులు, జంతువులు, వృక్ష సంపద ఉందని విద్యావేత్తలు చెప్తున్నారు. సహజ సిద్ధమైన చెరువులు, జీవ వైవిధ్యం ఉన్నది. పర్యావరణాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం దాన్ని బుల్డోజర్లు, జేసీబీలతో నాశనం చేసేందుకు పూనుకున్నది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.

సర్వే చేయలేదు : హెచ్‌సీయూ రిజిస్ట్రార్

వర్సిటీ ప్రాంగణంలోని భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులు సర్వే చేయలేదని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ దేవేశ్ నిగమ్ స్పష్టం చేశారు. అక్కడ ఐటీ, ఇతర ప్రాజెక్టుల ప్రతిపాదనలను తాము అంగీకరించలేదని తెలిపారు. అక్కడ భౌగోళిక పరిస్థితులు, జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని కోరారు.

నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు : సీపీఐ(ఎం) పిలుపు

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)కు సంబంధించిన 400 ఎకరాల భూములను వేలం వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద సీపీఐ(ఎం) ధర్నా చేపట్టింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి, అరెస్టులు చేయడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, పోలీసుల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వేలం ప్రక్రియను వ్యతిరేకిస్తున్న విద్యార్థుల మీద ప్రభుత్వం పెద్దఎత్తున నిర్బంధానికి పాల్పడుతున్నదని విమర్శించారు. యూనివర్సిటీ భూములు యూనివర్సిటీకే చెందాలనీ, భవిష్యత్ తరాలకు అవసరమని ఆందోళన చేస్తుంటే వారి మీద అక్రమ కేసులు పెట్టిందని తెలిపారు. నవీన్ అనే ఎస్ఎఫ్ఐ విద్యార్థిని, మరో విద్యార్థిని జైలుకు పంపించారని పేర్కొన్నారు. మిగతా విద్యార్థులను అరెస్టులు చేశారని తెలిపారు. క్లాసులు జరిగే పరిస్థితి లేదని పేర్కొన్నారు. పోలీసులు లోపలికి వెళ్లి అక్కడ భయానక వాతావరణాన్ని సృష్టించారని విమర్శించారు. 144 సెక్షన్ పెట్టి ఎలాంటి నిరసనలు తెలియజేయకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. అక్కడ ఉన్న యూనివర్సిటీ భూములను, అడవులను బుల్డోజర్లను పంపి చదును చేస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ పక్షులు, జంతవులు నివాసముంటున్నాయని వివరించారు. పర్యావరణానికి నష్టం కలిగించే చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి నిర్బంధాల ద్వారా ఈ ఉద్యమాన్ని అణచివేస్తామనుకుంటే మరింత ఉధృతమవుతుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా 400 ఎకరాల భూమి వేలం ప్రక్రియను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. 144 సెక్షన్ ఎత్తేయాలనీ, అక్రమ కేసులను రద్దు చేయాలనీ, అరెస్టు చేసిన విద్యార్థులు, సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ కోరారు.

అలవాటు అనే దాన్ని అరికట్టకపోతే, అది అతి త్వరలోనే ఒక అవసరంగా మారిపోతుంది - సెయింట్ అగస్టన్

సంపాదకీయం

బోధనలో నాణ్యత కలేనా?



ప్రపంచంలోనే యువత అత్యధికంగా ఉన్న దేశం మనది. వారిని సక్రమంగా ఉపయోగించుకున్నపుడే దేశ అభివృద్ధి సాధ్యం. యువతను శక్తివంతంగా తీర్చిదిద్దే శక్తి విశ్వవిద్యాలయాలకు మాత్రమే ఉంటుంది. అలాంటి విశ్వవిద్యాలయాలు నేడు పాలకుల నిర్లక్ష్యానికి గురై తల్లడిల్లుతున్నాయి. సరైన మార్గనిర్దేశం చేసే బోధనా సిబ్బంది లేమితో కునరిల్లుతున్నాయి. అంతేకాదు మన దేశ ఉన్నత విద్య పారదర్శకతను సైతం కోల్పోయింది. స్వయానా పార్లమెంటరీ ప్యానలే తన నివేదికలో ఈ వాస్తవాలను బయట పెట్టింది. దీన్నిబట్టి స్వాతంత్ర్యం అనంతరం దేశంలో మేధావులను తయారు చేసేందుకు ఐఐఎం వంటి సంస్థలను ప్రారంభించారే తప్ప వాటి కొనసాగించడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదనేది స్పష్టం.

నైపుణ్యాలు లేని మన యువత ఉద్యోగ, ఉపాధి, జీవనోపాధి వేటలో వెనుకబడిపోతున్నారు. దేశంలో స్థూలంగా నలభై రకాల విభిన్న సామర్థ్య రంగాల్లో ఐదువేల రకాల ఉద్యోగాలు ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. కానీ దేశ వ్యాప్తంగా 93 శాతం యువతకు తెలిసినవి కేవలం ఏడేనని ఓ సర్వేలో తేలింది. దీన్ని బట్టి దేశంలో ప్రాథమిక విద్య నుంచి యూనివర్సిటీ విద్య వరకు నైపుణ్యాల కల్పనలో పాలకులకు చిత్తశుద్ధి లోపించిందని స్పష్టమవుతోంది. ఇది విద్యార్థుల, నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది.

ఇలా దేశంలో ఉన్నత విద్యా ప్రాముఖ్యతను గుర్తించి ఏండ్లు గడుస్తున్నా నాణ్యమైన బోధన, నైపుణ్యాల అభివృద్ధి వంటి కీలక అంశాలు చర్చనీయాంశాలుగానే మిగిలిపోతున్నాయి. పాలకుల అరకొర చర్యలతో ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నాం. ఇది ఎవ్వరూ కాదనలేని వాస్తవం. తాజా నివేదికే దీనికి సాక్ష్యం. ఉపాధికి భరోసా ఇచ్చే బోధన మన విద్యాసంస్థల్లో కనబడడం లేదు. యువతకు నైపుణ్యాన్ని పెంపొందించడం కీలకం. అది లేక యువత ఉపాధి అవకాశాలు కోల్పోతుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు సైతం నష్టం కలుగుతోంది. నాణ్యమైన అధ్యాపకులు మాత్రమే ఈ లోటును భర్తీ చేయగలరు.

మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి 'విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. విద్యారంగాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దాం. ఉన్నత, సాంకేతిక విద్యలో మన దేశ యువతను ప్రపంచం ముందు అగ్రభాగంలో ఉంచుతాం, తద్వారా దేశ అభివృద్ధిన్ని పరుగులు తీయిస్తాం' అంటూ ఎన్నో గప్పాలు కొడుతూనే ఉన్నారు. ప్రతీసారీ తమ మన్‌కీ బాత్‌లోనూ యువశక్తికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని వల్లెవేస్తున్నారు. కానీ ఆచరణలో పరిస్థితి మరోలా వుంది. ప్రొఫెసర్ల కొరతతో యువత నాణ్యమైన చదువుకు దూరమవుతుందని పార్లమెంటరీ ప్యానల్ నివేదించింది. దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో 56 శాతానికి పైగా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ నివేదిక తేల్చిచెప్పింది. దేశ విద్యా నాణ్యతకు ఈ నివేదికే ఓ నిదర్శనం. పరిస్థితి ఇలా ఉంటే నాణ్యమైన యువత ఎలా తయారవుతుందో ఏలిన వారికి ప్రశ్న.

ప్రపంచ దేశాలతో పోలిస్తే చదువు పూర్తిచేసుకున్న మన యువతలో నైపుణ్యాలు అత్యంత పేలవంగా ఉంటున్నాయని అనేక సర్వేలు చెబుతున్నాయి. 2021లో ఇంజనీరింగ్ పట్టభద్రుల్లో కేవలం 46 శాతానికే ఉద్యోగాలు దక్కాయి. మన ఇంజనీరింగ్ కాలేజీల నుంచి బయటకు వస్తున్న వారిలో ఉద్యోగ నైపుణ్యాలు కలిగిన వారు కేవలం 25శాతమే ఉన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నైపుణ్యాలు లేని మన యువత ఉద్యోగ, ఉపాధి, జీవనోపాధి వేటలో వెనుకబడిపోతున్నారు. దేశంలో స్థూలంగా నలభై రకాల విభిన్న సామర్థ్య రంగాల్లో ఐదువేల రకాల ఉద్యోగాలు ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. కానీ దేశ వ్యాప్తంగా 93 శాతం యువతకు తెలిసినవి కేవలం ఏడేనని ఓ సర్వేలో తేలింది. దీన్ని బట్టి దేశంలో ప్రాథమిక విద్య నుంచి యూనివర్సిటీ విద్య వరకు నైపుణ్యాల కల్పనలో పాలకులకు చిత్తశుద్ధి లోపించిందని స్పష్టమవుతోంది. ఇది విద్యార్థుల, నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది.

మరో ముఖ్యమైన విషయం ఉన్నతవిద్యను అభ్యసించే విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లు కూడా బీజేపీ పాలనలో బాగా తగ్గిపోయాయి. పైగా నేటి మన కాషాయ పాలకులు విశ్వవిద్యాలయాలను మతవిద్వేషాలు రెచ్చగొట్టే కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారే తప్ప, యువత నైపుణ్యాలను పెంచడంపై అస్సలు దృష్టి పెట్టడం లేదు. ఇక మన విద్యా మంత్రిత్వ శాఖైతే తమ కాషాయ ఎజెండాను విద్యా సంస్థల్లోకి జొప్పించడంలో తలమునకలైపోతోంది. విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాలపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తే హడావుడిగా కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించి 'మమ' అనిపిస్తున్నారు.

ఈ తాత్కాలిక నియామకాల వల్ల విద్యాస్వేచ్ఛకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. మన యువత నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. అంతేకాదు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీతో పాటు ఇతర అణగారిన వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులు హరించి వేసే ప్రమాదం కూడా పొంచివుంది. కనుక విద్యారంగంలో శాశ్వత నియామ కాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఏదిఏమైనా యువత వారి చదువుకు తగిన నైపుణ్యాలు పొందాలంటే సరైన అధ్యాపకులే కీలకం. తద్వారానే విశ్వవిద్యాలయాలు బలోపేతం అవుతాయి. నైపుణ్యంతో కూడిన విద్యను పూర్తి చేసుకొని వచ్చినప్పుడే నాణ్యమైన యువత తయారయ్యే అవకాశం ఉంటుంది. దానికి పాలకులే పూనుకోవాలి.

మెయిల్ @ నవతెంగాణ

ఎంపీల జీతాలు పెంచారు సరే! సామాన్యుల పరిస్థితేంది?

ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ప్రజల కోసం కాకుండా వారి స్వార్థ, వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారని ప్రజలు బాహటంగానే విమర్శిస్తున్నారు.ఎందుకంటే, పెరుగుతున్న ధరల దృష్ట్యా పార్లమెంట్‌లో ఎంపీలకు వేతనంతో పాటు, పెన్షన్ కూడా పెంచింది కేంద్రం. 1954 చట్టం ప్రకారం ఈ పెంపుదల చేసినట్టు ప్రకటించింది. అదే సమయంలో పేదలు, మధ్యతరగతి ప్రజలు కూడా పెరిగిన ధరలతో అనేక అవస్తలు పడుతున్నారు. ఉపాధి లేక ఒకపూట తింటూ, మరోపూట పస్తులుంటున్నారు. వారికి కూడా కనీస వేతనాల పెంపు, అలాగే నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ చర్యలు చేపడితే బాగుండేది. కానీ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారికి ఏదో తక్కువైనట్టు జీతాలు పెంచుకోవడం సమంజసం కాదు. చాలామంది దేశంలో కటిక దరిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. బయట ఏది కొనాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుంటున్నారే తప్ప, ముందడుగు వేయడం లేదు. కారణం, ఇంటి అవసరాలకే సరిపోని జీతంతో కాలం వెళ్లదీస్తున్నారు గనుక. విద్యా, వైద్యరంగాలకే వారి ఆదాయంలో సగానికంటే ఎక్కువ పోతున్నది. ఇలాంటి సమయాల్లో సామాన్యులను గాలికొదిలేసి వారు మాత్రమే జీతాలు, పెన్షన్ పెంచుకోవడం సరికాదనేది అభిప్రాయం. నేడు సుదీర్ఘ కాలం ప్రభుత్వానికి సేవలందించి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఎలాంటి సౌకర్యాలు లేవు. చిరుద్యోగి నుంచి మొదలుకుంటే కేంద్ర కార్మిక రంగాల వరకు ఉద్యోగుల పరిస్థితి ఇలాగే ఉన్నది. చాలామందికి కనీస అవసరాలు తీరేంత కూడా పెన్షన్ రావడం లేదు. వీరేకాదు, చాలామంది వేతన జీవులతో పాటు, కార్మికులు, కర్షకులు, విశ్రాంత ఉద్యోగులు అనేక సమస్యలపై కేంద్రానికి విన్నవిస్తున్నా వివిధ రకాల కారణాల్ని చూపుతూ విస్మరిస్తున్నారు. సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేలో రాయితీలు పునరుద్ధరించాలని గగ్గోలు పెట్టినా పట్టించుకోవడం లేదు. జీతభత్యాల పెంపు విషయంలో కూడా కమిటీలు వేసి కాలయాపన చేస్తున్నారు. బొగ్గుగనుల్లో పనిచేసిన కార్మికులు వారి జీవితాంతం శ్రమ ధారబోసి దేశానికి వెలుగులు ప్రసాదించారు.అలాంటి వారికి పెన్షన్ పెంచే దిక్కులేదు. ఈ విషయమై పార్లమెంట్‌లో ఎంపీలు చర్చకూడా చేయడం లేదు. 1998 బొగ్గు గనుల ప్రావిడెంట్ ఫండ్ చట్టాన్ని అమలు చేయడంలో సరైన శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రతి మూడేళ్లకు ఒకసారి పెన్షన్ సమీక్ష చేసి పెంచుటకు పేర్కొన్నప్పటికీ ఇరవై ఏడు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు కూడా ఒక్కసారి కూడా పెన్షన్ పెంపుదల చేయ లేదు. నూట నలభై కోట్ల జనాభాకు ప్రాతినిధ్యం వహించే ఎంపీలు వారి సంక్షేమాన్ని పట్టించు కోకుండా, ధనవంతుల కొమ్ముకాసే చట్టాలు చేస్తున్న పాలకులకు ఊడిగం చేసేవారు నిజంగా ప్రజాప్రతినిధులేనా? ఇప్పటికైనా స్వార్థ ప్రయోజ నాలు పక్కనపెట్టి పేదల కోసం పనిచేయండి.

- దండంరాజు రాంచందర్ రావు,
9849592958

పిచ్చోడి చేతిలో రాయి - అమెరికాలో డోనాల్డ్ ట్రంప్!



ఎం కోటేశ్వరరావు
8331013288

ఆ సాయంత్రం... రాక్సీలో నార్మా షేరర్, బ్రాడ్వేలో కాంచనమాల, ఎటుకేగుటో సమస్య తగిందొక విద్యార్థికి (1939లో చెన్నయ్‌లో ఆంగ్ల, తెలుగు సినిమాలు ఆడిన సినిమా హాళ్లు) అని సంధ్యా సమస్యలు అనే కవితలో శ్రీశ్రీ మన ముందుంచినట్లుగానే ఏ అంశం గురించి రాయాలో ఈ విద్యార్థికి పరీక్ష పెట్టాడు డోనాల్డ్ ట్రంప్. ఏప్రిల్ రెండవ తేదీ నుంచి తనకు లొంగని, నచ్చని దేశాలన్నింటి మీద ప్రకటించిన వాణిజ్య యుద్ధంలో పన్ను అస్త్రాల ప్రయోగం, అణు ఒప్పందానికి రాకపోతే అంతు చూస్తామన్న బెదిరింపులపై తేల్చుకుందాం రా అంటూ ఇరాన్ అధినేత ఘాటు స్పందన, పుతిన్ మీద కోపం వస్తోందన్న ట్రంప్, గాజాపై సాగుతున్న మారణకాండ ఇలా అనేక సమస్యలు మన ముందున్నాయి. తాను చాలా దయతో వ్యవహరిస్తానని ట్రంప్ ప్రకటించాడు. పిచ్చివాడు అనేక మాటలు మాట్లాడతాడు, తన చేతిలో రాయితో అందరినీ భయపెడతాడు, ఎవరినైనా కొట్టవచ్చు, ఉన్మాదంలో తన తలను తానే పగలగొట్టుకోనూ వచ్చు.వాడి దాడి నుంచి తప్పించుకోవాటానికి ప్రతి ఒక్కరూ చూడటంతో పాటు అదుపులోకి తీసుకొని కట్టడి చేసేందుకూ చూస్తారు. ఇప్పుడు ప్రపంచంలో అదే స్థితిలో ఉందా! ఏం జరగనుంది !!

మంగళవారం రాత్రి నుంచి అమల్లోకి రానున్న ప్రతి సుంకాల విషయంలో తాను ఎంతో దయతో వ్యవహరిస్తానని సోమవారం నాడు డోనాల్డ్ ట్రంప్ చెప్పాడు. తమ నేత చైనా, కెనడా, ఐరోపా యూనియన్లను రెచ్చగొట్టి ప్రపంచ వాణిజ్య యుద్ధానికి తెరలేపుతున్నాడని కొంతమంది రిపబ్లికన్ పార్టీ సెనెటర్లే వ్యతిరేకతను వ్యక్తం చేసినట్లు వార్తలు. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నాం గనుక ప్రతి దేశం దాన్ని ముక్కలు చేస్తున్నందున ప్రతికూల పన్నులు వేయకతప్పటం లేదని, త్వరలో అమెరికాకు విముక్తి రోజు వస్తుందని చెప్పాడు ట్రంప్. తమ శత్రువుల మీద పోరాడా లంటూనే కొన్ని పన్నుల మీద అధికార పార్టీ సెనెటర్లు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు, కెనడా మీద చర్యలకు వ్యతిరేకంగా ఓటు వేస్తానని సుసాన్ కోలిన్స్, థోమ్ టిలిస్ ప్రకటించారు. తెలివితేటలు ఏ ఒక్కరి సొంతం కాదు.ఎవరి జాగ్రత్తలో వారున్నారు.పరస్పర వాణిజ్యంపై చైనా, జపాన్, దక్షిణ కొరియా ఆదివారం నాడు ఒక అవగాహనకు వచ్చాయి. ఏ దేశాల మీద ఎంత పన్ను, ఏ వస్తువుల మీద విధించేదీ బుధవారం నాడు ప్రకటిస్తామని అధ్యక్ష భవన మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ విలేకర్లతో చెప్పారు. పన్నులపై అనిశ్చితి ప్రభావం స్టాక్ మార్కెట్లపై పడింది. అమెరికా వాణిజ్య భాగస్వాములందరి మీద ఇరవై శాతం వరకు పన్ను విధించవచ్చని ట్రంప్ సలహాదారులు చెప్పినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొన్నది. పన్నులతో ముందుకుపోతే రానున్న ఏడాది కాలంలో అమెరికాలో మాంద్యం వచ్చే అవకాశాలు 20 నుంచి 35శాతానికి పెరుగు తాయని గోల్డ్‌మన్ శాచస్ విశ్లేషకులు చెబుతున్నారు. కార్ల ధరలు పెరిగితే వాటిని తాను పెద్దగా పట్టించుకోనని ట్రంప్ అన్నాడు.

ఇప్పటివరకు చైనా, కెనడా ప్రతి సుంకాలను ప్రకటించాయి. ఐరోపా యూనియన్ బేరసారాలాడుతున్నందున, మరో పదిహేను రోజుల వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవచ్చు. కార్ల మీద ట్రంప్ ప్రకటించిన పన్నులు గురువారం నుంచి అమల్లోకి వస్తాయి. అమెరికా పన్నులు ఆత్మతకు కారణమౌతున్నాయని ఐఎంఎఫ్ అధిపతి క్రిస్టాలినా జార్జియేవా వ్యాఖ్యానించారు. చైనా, ఐరోపా యూనియన్,మెక్సికో,కెనడా,వియత్నాం, జపాన్, దక్షిణ కొరియా, చైనీస్ తైవాన్, భారత దేశాలతో వస్తు వాణిజ్యంలో అమెరికా లోటులో ఉంది. ఈ దేశాలన్నీ కూడా వాటి లావాదేవీలను పరిమితం చేసుకొనేందుకు చూస్తున్నాయి. అమెరికా వత్తిడికి లొంగి లేదా మన ఎగుమతిదార్ల లాబీ కారణంగా మన దేశం అమెరికాకు కొన్ని రాయితీలు ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. మన మీద పన్నుల గురించి ఇంకా స్పష్టత రాలేదు.

ఇప్పటివరకు చైనా, కెనడా ప్రతి సుంకాలను ప్రకటించాయి. ఐరోపా యూనియన్ బేరసారాలాడు తున్నందున, మరో పదిహేను రోజుల వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవచ్చు. కార్ల మీద ట్రంప్ ప్రకటించిన పన్నులు గురువారం నుంచి అమల్లోకి వస్తాయి. అమెరికా పన్నులు ఆత్మతకు కారణమౌతు న్నాయని ఐఎంఎఫ్ అధిపతి క్రిస్టాలినా జార్జియేవా వ్యాఖ్యానించారు. చైనా, ఐరోపా యూనియన్, మెక్సికో, కెనడా,వియత్నాం, జపాన్, దక్షిణ కొరియా, చైనీస్ తైవాన్,భారత దేశాలతో వస్తు వాణిజ్యంలో అమెరికా లోటులో ఉంది. ఈ దేశాలన్నీ కూడా వాటి లావాదేవీలను పరిమితం చేసుకొనేందుకు చూస్తు న్నాయి. అమెరికా వత్తిడికి లొంగి లేదా మన ఎగుమతిదార్ల లాబీ కారణంగా మన దేశం అమెరికాకు కొన్ని రాయితీలు ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. మన మీద పన్నుల గురించి ఇంకా స్పష్టత రాలేదు. మొత్తంగా పరిస్థితిని గమనించి అమెరికా ప్రకటించిన పన్నులను గణనీయంగా తగ్గించవచ్చు లేదా కొంత కాలం అమలు వాయిదా వేయవచ్చని కొందరు ఆశిస్తున్నారు.

తమ మీద అమెరికా, దాని అనుయాయులు దాడులకు దిగితే అణ్వాయుధాలను సమకూర్చుకోవటం తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదని ఇరాన్ హెచ్చరించింది. దాడులు జరిగితే వారు కచ్చితంగా ప్రతిదాడులను ఎదుర్కోవాల్సి ఉంటుందని రంజాన్ ఉపవాసమాసం ముగింపు సందర్భంగా చేసిన ప్రసంగంలో అధినేత ఆయాతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించాడు. ఖమేనీ సలహాదారు అలీ లార్జియానీ టీవీలో మాట్లాడుతూ తాముగా అణ్వాయుధాలను సమకూర్చుకొనే దిశలో పయనించటం లేదని, ఒకవేళ అమెరికా స్వయంగా లేదా ఇజ్రాయిల్ ద్వారా దాడులకు దిగితే తమ నిర్ణయం భిన్నంగా ఉంటుందని, ఆత్మరక్షణకు వాటిని ప్రయోగించకతప్పదని చెప్పాడు. తమతో అణు ఒప్పందం మీద సంతకాలు చేయకపోతే పెద్ద ఎత్తున దాడులు చేస్తామని, సుంకాలు విధిస్తామని ఆదివారం నాడు ట్రంప్ బెదిరించాడు. దీని గురించి సోమవారం నాడు భద్రతా మండలికి ఇరాన్ ఫిర్యాదు చేసింది. రాయబారి అమీర్ సయిద్ ఇర్వానీ ఒక లేఖ ద్వారా తమ మీద దురాక్రమణకు పాల్పడితే నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తామని, యుద్ధోన్మాదం, రెచ్చగొట్టటాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నాడు. గతంలో 2015లో కుదిరిన ఒప్పందం నుంచి ఇదే ట్రంప్ 2018లో ఏకపక్షంగా వైదొలిగాడు. ఇరాన్ పరిసర ప్రాంతాల్లో అమెరికా పది మిలిటరీ కేంద్రాలను, యాభైవేల మంది సైనికులను నిర్వహిస్తున్నది.

గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం పశ్చిమ దేశాల ఆంక్షలు ఎత్తివేయాలంటే ప్రతిగా ఇరాన్ తన అణుశుద్ధి కార్యక్రమాన్ని నిలిపివేయాల్సి ఉంది. అయితే పశ్చిమ దేశాలు ఒప్పందాన్ని ఉల్లంఘించటంతో ఇరాన్ తన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. వాటిని శాంతియుత ప్రయోజనాలకు మాత్రమే అని పదే పదే చెబుతున్నది. తిరిగి అణు ఒప్పం దంపై చర్చలకు అంగీకరించాలని లేకుంటే మిలిటరీ చర్యతప్పదని మార్చి ఏడవ తేదీన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ద్వారా ట్రంప్ ఒక లేఖను పంపాడు. దానికి గాను గత వారంలో ఒమన్ ద్వారా ఇరాన్ సమాధానం పంపింది. గరిష్ట వత్తిడి, మిలిటరీ చర్య బెదిరింపుల పూర్వరంగంలో తాము ప్రత్యక్ష చర్చలకు సిద్ధం కాదని, పరోక్షంగా అంగీకరిస్తామని విదే శాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశాడు. ఇదే అంశాన్ని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కూడా తేటతెల్లం చేశాడు. చర్చలకు తాము విముఖం కాదని, ముందుగా అమెరికా తన గత తప్పిదాలను సరిచేసుకొని విశ్వాసం కలిగించాలని చెప్పాడు. గతంలో కుదిరిన ఒప్పందం నుంచి ట్రంప్ వైదొలిగిన తీరును బట్టి ఇరానియన్లకు నమ్మకం లేకపోవటం సరైనదే అని వాషింగ్టన్‌లోని స్టిమ్సన్ కేంద్ర బార్బరా స్లావిన్ వ్యాఖ్యానించారు.హిందూ మహా సముద్రం లోని డిగోగార్సియాలో సైనిక కేంద్రానికి అమెరికా అదనపు యుద్ధ విమానాలను తరలించిందని, మరొక విమానవాహక నౌకను తరలించటాన్ని చూస్తే ఇజ్రాయిల్‌తో కలసి ఏదో ఒక రకమైన మిలిటరీ చర్యకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తున్నదని ఆమె చెప్పారు. అణుకార్యక్రమంతో పాటు పశ్చిమాసియా ప్రాంతంలో ప్రతినిధుల ద్వారా తన పలుకు బడిని పెంచు కొనేందుకు చూస్తున్నదని పశ్చిమ దేశాలు ఇరాన్ మీద ఆరోపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో అలాంటి ప్రతినిధి ఎవరైనా ఉంటే యూదు దురహంకార ప్రభుత్వమేనని దాన్ని తుడిచి వేయాలని ఖమేనీ స్పష్టం చేశాడు. అనేక బాంబులను తయారుచేసేందుకు అవసరమైన యురేనియంను ఇరాన్ సమకూర్చుకుందని, అయితే ఇంకా బాంబులను తయారు చేయలేదని ఇటీవల అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ పేర్కొన్నది. అవసరమైతే రెండు నెలల వ్యవధిలో బాంబులను రూపొందించి, వాటిని పరీక్షించి, విడదీసి అవసరమైన చోటికి తరలించి తిరిగి తయారు చేసేందుకు, వాటిని ప్రయోగించే క్షిపణులను కూడా సమాంతరంగా సిద్ధం చేసిందనే వార్తలు వచ్చాయి. ఆ తర్వాతే ట్రంప్ బెదిరింపులకుదిగాడు. ఈ నేపథ్య ంలో తన భూగర్భ క్షిపణి ప్రయోగ కేంద్రాలన్నింటినీ ఇరాన్ సన్నద్ధం చేస్తున్నదని ఈ మేరకు వాటికి సంబంధించి కొన్ని వీడియోలను కూడా విడుదల చేసిందని వార్తలొచ్చాయి. శత్రు దేశాల దాడులనుంచి వాటిని కాపాడేందుకు భారీ భద్రతను ఏర్పాటుచేశారు. రెండు దేశాల మధ్య చర్చలకు తెరతీయాల ంటే విధించిన ఆంక్షలను అమెరికా సడలించాల్సి ఉంటుంది.



రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ మీద తనకు పిచ్చి కోపం వస్తున్నదని డోనాల్డ్ ట్రంప్ అన్నాడు.ఉక్రెయిన్‌పై ఒప్పందానికి ముందుకు రాకపోతే అదనంగా రష్యన్ చమురు మీద యాభైశాతం పన్నులు విధిస్తానని చెప్పాడు. నెల రోజుల పాటు నల్ల సముద్ర ప్రాంతంలో నౌకల రవాణాపై ఒప్పందానికి ఉక్రెయిన్-రష్యా అంగీకరించినట్లు ప్రకటించినప్పటికీ అదింకా అమల్లోకి రాలేదు.అ ందులో అంగీకరించినదాని ప్రకారం ఇరు దేశాలు తమ ఇంధన మౌలికవసతులపై పరస్పరం దాడులు నిలిపివేయాలి, అయితే ఇరుపక్షాలూ పాటించటం లేదని ఆరోపించుకుంటున్నాయి. తమ ఆహార, ఎరువుల రవాణాను స్వేచ్ఛగా జరగనివ్వటంతో పాటు వాటి లావాదేవీలు జరిపే బ్యాంకుల మీద పశ్చిమ దేశాలు ఆంక్షలను తొలగిస్తేనే అమలు చేస్తామని రష్యా షరతులు విధించింది. గతంలో జెలెన్‌స్కీని బెదిరించిన ట్రంప్ ఇప్పుడు మాటమార్చి రష్యా మీద కేంద్రీకరించాడు.

రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ మీద తనకు పిచ్చి కోపం వస్తున్నదని డోనాల్డ్ ట్రంప్ అన్నాడు.ఉక్రెయిన్‌పై ఒప్పందానికి ముందుకు రాకపోతే అదనంగా రష్యన్ చమురు మీద యాభైశాతం పన్నులు విధిస్తానని చెప్పాడు. నెల రోజుల పాటు నల్ల సముద్ర ప్రాంతంలో నౌకల రవాణాపై ఒప్పందానికి ఉక్రెయిన్-రష్యా అంగీకరించినట్లు ప్రకటించినప్పటికీ అదింకా అమల్లోకి రాలేదు.అ ందులో అంగీకరించినదాని ప్రకారం ఇరు దేశాలు తమ ఇంధన మౌలికవసతులపై పరస్పరం దాడులు నిలిపివేయాలి, అయితే ఇరుపక్షాలూ పాటించటం లేదని ఆరోపించు కుంటున్నాయి. తమ ఆహార, ఎరువుల రవాణాను స్వేచ్ఛగా జరగనివ్వటంతో పాటు వాటి లావాదేవీలు జరిపే బ్యాంకుల మీద పశ్చిమ దేశాలు ఆంక్షలను తొలగిస్తేనే అమలు చేస్తామని రష్యా షరతులు విధించింది. గతంలో జెలెన్‌స్కీని బెదిరించిన ట్రంప్ ఇప్పుడు మాటమార్చి రష్యా మీద కేంద్రీకరించాడు.తాను ఏది అనుకుంటే అది చేయగలననే అగ్రరాజ్య అహంకారంతో ఉన్నట్లున్నాడు.

ఉక్రెయిన్‌లో మరింత సమర్ధవంతమైన ప్రభుత్వం ఉండాలని, జెలెన్‌స్కీ పదవీకాలం ముగిసినందున ఐరాస పర్యవేక్షణలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పుతిన్ సూచించాడు. ఈ ప్రకటన ద్వారా జెలెన్‌స్కీని తాను గుర్తించటం లేదని స్పష్టం చేశాడు. నల్లసముద్రంలో నౌకల రవాణా గురించి కూడా అమెరికాతో తప్ప ఉక్రెయిన్‌తో రష్యాకు ఎలాంటి ఒప్పందం లేదు, అయితే అమలు జరపాల్సింది మాత్రం జెలెన్‌స్కీ యంత్రాంగమే. సుదూరంగా ఉన్న ఉత్తర రష్యా నగరమైన మురుమాన్స్క్‌కు జలాంతర్గామిలో ప్రయాణించిన పుతిన్ విలేకర్లతో మాట్లాడుతూ తాత్కాలిక ప్రభుత్వం అక్కడ ఎన్నికలు జరిపేందుకు దోహదం చేస్తుందని, ప్రజల మద్దతు ఉన్న ప్రభుత్వం ఏర్పడితే దానితో చట్టబద్ధమైన పత్రాలపై సంతకాలు చేసేందుకు శాంతి చర్చలకు సిద్ధమని చెప్పాడు. యుద్ధం కారణంగానే గడువు ముగిసినా రాజ్యాంగం ప్రకారం జెలెన్‌స్కీ అధికారంలో కొనసాగుతున్నాడని, యాభై లక్షల మంది పౌరులు దేశం వెలుపల ఉంటున్నపుడు, లక్షలాది మంది యుద్ధ రంగంలో ఉండగా ఎన్నికలు ఎలా సాధ్యమని ఉక్రెయిన్ అంటున్నది. గతంలో తూర్పు తైమూరు, పూర్వపు యుగోస్లావియా తదితర దేశాల్లో ఇలాగే ఎన్నికలు జరిగినపుడు ఇక్కడెందుకు సాధ్యం కాదని పుతిన్ ప్రశ్నించాడు. ఉక్రెయిన్ సంక్షోభంలో ఎవరి రాజకీయాలు వారు చేస్తున్నారు. ఒకవైపు శాంతి చర్చలు జరుగుతుండగానే నిలిపివేసిన ఆయుధ సాయాన్ని ట్రంప్ పునరుద్ధరించాడు. మరోవైపు ఐరోపా దేశాలు కూడా మరింతగా జెలెన్‌స్కీ సేనలను పటిష్టపరచటం ఎలా అని ముఖ్యంగా బ్రిటన్, ఫ్రాన్సు చర్చిస్తున్నాయి.తమ ప్రమేయం లేకుండా అమెరికా కుదుర్చుకున్న ఒప్పంద షరతులను తామెందుకు అమలు జరపాలని ఐరోపా సమాఖ్య పరోక్షంగా ప్రశ్నిస్తోంది.తన పరువు కాపాడుకొనేందుకు ట్రంప్ నానా తంటాలు పడుతున్నాడు. ఆ బలహీనతను ఉపయోగించుకొని తమపై ఆంక్షలను ఎత్తివేయించుకోవాలని, ఉక్రెయిన్‌లో తమకు ఎదురులేదని నిరూపించుకోవాలని రష్యా చూస్తోంది. ఎవరి రాజకీయం వారిది, ఈ క్రమంలో ఎవరి ఇబ్బందులు వారివి !

'గ్రోక్'తో బీజేపీకి హార్ట్‌స్ట్రోక్!



టి.నాగరాజు
9490098292

అబద్ధాలతో, డిజిటల్ రాతలతో, ఫేక్ వీడియోలతో, దేశ ప్రజల కండ్లకు గంతలు కట్టిన బీజేపీ నిజస్వరూపం యావత్తు జాతి ముందు ఆవిష్కృతం అవుతున్నది. ఇంత కాలం అబద్ధాలనే నిజాలు అని ఏ మార్చిన బీజేపీ, దాని ఐటీ సెల్, వారి అసత్య ప్రచారాలను గ్రోక్ చెడుగుడు ఆడుతున్నది. గ్రోక్ సంస్థకు అధిపతి ఎలన్ మస్క్ బడా సంపన్నుడు. అమెరికా పాలకవర్గాల ప్రతినిధి మస్క్, భారత పాలకవర్గాలు ప్రతినిధి అదానీ వారికి వ్యతిరే కంగా పనిచేయలేరు, మోడీ- ఆరెస్సెస్‌లకు వ్యతిరేకంగా చెప్పకూడదని ఆరెస్సెస్, మోడీల కోరిక. కానీ సమాచారం అందించే వారి కోరికను టెక్నాలజీ మన్నించడం లేదు. విశ్వగురు అంటూ మోడీని గొప్పగా కీర్తించిన బత్తాయిల అబద్ధాల పుట్ట బద్దలవుతున్నది. ఢిల్లీలోని అశోకారోడ్‌లో ఉన్న కేంద్ర బీజేపీ ఐటీ విభాగాన్ని చూస్తే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ మాదిరి అనిపిస్తుంది. దీనికి నేషనల్ డిజిటల్ ఆపరేషన్ సెంటర్ అని పేరు. అక్కడ గుంపులు గుంపులుగా టెక్కీలుగా పిలువబడే ఉద్యోగులు కనబడుతూ ఉంటారు. వీరంతా చిన్న చిన్న ఇంజినీరింగ్ కాలేజీలు డిగ్రీలు పూర్తి చేసుకొని వచ్చిన యువతీ, యువకులు. ఎక్కువమంది అబ్బాయిలే.

వీరిని ఉపయోగించి బీజేపీ గడిచిన దశాబ్ద కాలంగా ఫేస్ బుక్, వాట్సప్, ట్విట్టర్ (ఎక్స్)ను సమర్థవంతంగా ఉపయో గించిన, తన సోషల్ మీడియా టీమ్ ద్వారా అసత్య ప్రచారాన్ని ముమ్మరం చేసింది. దీని కోసం ప్రత్యేకంగా "టెక్‌ఫాగ్" యాప్‌లను తయారు చేసి, ఫేక్ ఖాతాలను సృష్టించి, సోషల్ మీడియాలో నకిలీ ట్రెండిరగ్, ఆటో ట్వీట్స్, ఆటో రిప్లేలతో ట్రోలింగ్ పెంచి దాడి చేసింది. అదే నిజమనే లాగా ప్రచారం నిర్వహించి 2002 గుజరాత్ అల్లర్ల ఘటనల్లో మోడీ పాత్రపై డాక్యుమెంట్లు ప్రచారం చేసిన బీబీసీని, రైతు ఆందోళనల్లో ఉన్నది ఉన్నట్లు ప్రచారం చేసిన ట్విట్టర్‌ను కూడా బీజేపి బెదిరింపులు చేసింది.ఇలా చేయడం వలన ఇప్పటికీ భావ ప్రకటన స్వేచ్ఛకు మద్దతు ఇస్తున్న 33 దేశాల్లో భారత్ 24వ ర్యాంకును పొందినట్లు 'ఫ్యూచర్ ఆఫ్ ఫ్రీ స్పీచ్' అనే సంస్థ తన రిపోర్టు వెల్లడించింది.

సోషల్‌మీడియాను ఎలా వాడుకోవాలో బీజేపీకి అసలైన శిక్షణను ఇచ్చింది తమిళనాడుకు చెందిన ఆరెస్సెస్ స్వయంసేవకులు. వీరికి నాయకత్వం వహిం చింది ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీర్ పట్టా పొంది ఆ తర్వాత పూర్తిస్థాయి ఆరెస్సెస్ ప్రచారక్‌గా మారిన వ్యక్తి రాంమాధవ్. మొదట్లో ఈ టెక్నాలజీని అందిపుచ్చుకోవటానికి ఆరెస్సెస్ శాఖలు మొండికేశాయి. కానీ, దీంతో ఎన్నో ప్రయోజ నాలున్నాయని ఆయన నచ్చచెప్పారు. బీజేపీ సోషల్ మీడియా కార్యకలాపాలన్నీ ఇప్పుడు బెంగళూరు నుంచి కొనసాగుతున్నాయి. వాస్తవానికి 2014 లోక్‌సభలో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశ్యంతో 2012 గుజరాత్ ఎన్నికల్లో పని చేసిన రాబిన్ శర్మను పొలిటికల్ స్ట్రాటజీ టీమ్‌గా బీజేపీ నియమించి సోషల్ మీడియాలో ఇన్నోవేటివ్ మార్కెటింగ్, అడ్వర్‌టయిజింగ్ క్యాంపెయిన్ చేసింది. అబద్ధాలను వాస్తవాలుగా ప్రచారం చేసేందుకు అనేక రకాల మ్యాన్యువల్స్‌ను సిద్ధం చేసి తర్వాత వాటిని సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో ప్రచారం కల్పించింది. వందల మంది ఐఐటిలలో చదివిన వారితో బీజేపీ ఐటి సెల్ ఏర్పాటు చేసింది.



ఈ క్రమంలోనే ఎవరైనా ఆరెస్సెస్, బీజేపీ ప్రధానిని విమర్శిస్తే దాడి చేయడం. పథకాలు, ప్రభుత్వ నిర్ణయాలు పట్ల ప్రజలు సంతో షంగా ఉన్నట్లు ప్రకటించటం, చరిత్ర అంశాలను వక్రీకరించి తమకు అనుకూలంగా మార్చు కోవటం చేసింది. ఈ సందర్భంగా ఎలన్‌మస్క్ ట్విట్టర్‌ను తనచేతికి తీసుకున్న తర్వాత "ఎక్స్"ను నియంత్రించాలన్న బీజేపీ ఆంక్షలకు "ఎక్స్" ఏమాత్రం భయపడడం లేదు. గతంలో ఢిల్లీ రైతుల ఉద్యమం సమయంలో ట్విట్టర్, ఫేస్‌బుక్‌లపై ఆంక్షలు విధించింది. ఇప్పుడు "గ్రోక్" పై ఆంక్షలు విధించాలని చూస్తే "గ్రోక్" బీజేపీ నిజ స్వరూపం బయట పెట్టడంతో బీజేపీ శ్రేణులు గ్రోక్ వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. రాజకీయ ప్రశ్నలకు "గ్రోక్" ఇస్తున్న సమాధానాలు సంచలనం రేపాయి. ముఖ్యంగా ప్రధాని మోడీ, బీజేపీ నేతల మీద అడుగుతున్న ప్రశ్నలకు "గ్రోక్" ఇస్తున్న సమాధానాలు బీజేపీకి మింగుడు పడటం లేదు. మోడీ ప్రధాని అయ్యాక నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌ల గురించి విశ్లేషించాలని కోరగా.. మోడీ మీడియా ముందుకు రావడం లేదని, మాట్లాడే పనిని అమిత్ షాకు అప్పగించారంటూ సమాధానం ఇచ్చింది. అంతేకాదు మోడీ ఇచ్చే ఇంటర్వ్యూలన్నీ స్క్రిప్టెడ్ (ముందే సిద్ధం చేసుకున్న ప్రశ్న, జవాబులు)గా అనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది. దీంతో గ్రోక్ చుట్టూ రాజకీయాలు తిరగడం మొదలయ్యాయి.

దేశంలో అత్యధికంగా నకిలీ వార్తలు ఎవరు ప్రచారం చేస్తున్నారని ఒకరు ప్రశ్నించగా.. దేశంలోని అనేక ప్రముఖ మీడియా సంస్థల పేర్లను, వాటిల్లోని ముఖ్య అధికారుల పేర్లను చెప్పింది. ప్రధాన మీడియా సంస్థలపై బీజేపీ ప్రభావం గురించి అడగగా.. మోడీతో సన్నిహితంగా ఉన్న అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ పెద్దలు పెద్దపెద్ద మీడియా సంస్థలకు అధిపతులుగా ఉన్నారని గ్రోక్ సమాధానం ఇస్తుంది. అయినా కేంద్రం చర్యలపై "గ్రోక్" ఏ మాత్రం భయపడటం లేదు."గ్రోక్" సంస్థ "ఎక్స్" కర్నాటక హైకోర్టులో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేసు దాఖలు చేసింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3)(బి)ని ఉపయోగించి గ్రోక్‌లో ఉన్న కంటెంట్ తొలగించాలని ఆదేశించిందని, తాము వేసిన కోర్టు దావాలో తెలిపింది. ఇలా తమకు ఆదేశాలివ్వడం గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆన్‌లైన్ భావస్వేచ్ఛ ప్రకటనకు విరుద్ధమని, మానవహక్కును కేంద్రం హరించడమేనని "గ్రోక్" వాదించింది. కేంద్రం ఈ సెక్షన్‌ని ఉపయోగించుకొని కంటెంట్ ఏది ఉండాలో, ఏది ఉండకూడదో నిర్ణయిస్తూ సమాచారాన్ని తొలగించాలని బ్లాక్‌మెయిల్ చేస్తుందని గ్రోక్ వాదిస్తున్నది.

"గ్రోక్" చేస్తున్న ఈ వాదనతో నెటిజన్లు స్వాగతిస్తున్నారు. గ్రోక్ సూటిగా నిర్భయంగా సమాధానాలు ఇస్తుందని ప్రశంసలు ఇస్తున్నారు. కానీ బీజేపీ ఈ ప్రభావాన్ని నిలువరించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుంది. గ్రోక్‌కు వ్యతిరేకంగా తమిళనాడులో ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఒకవైపు గ్రోక్ ఇలా బీజేపీపై ఎదురు దాడి చేస్తుంటే మరోవైపు ఇతర ఏఐ టూల్స్ కూడా దానికి అండగా ఉన్నాయి. బీజేపీయే వార్త ప్రచారం చేసిన నిజం తెలుసుకోవటానికి గ్రోక్‌తో పాటు ఇతర "ఎఐ టూల్స్, చాట్‌జీపిటి, డిప్సిక్, జెమినీల"ను నెటిజన్స్ ఆశ్రయిస్తున్నారు. బీజేపీ తనకు అనుకూల వార్తలను ప్రచారం చేసుకోవడంతో పాటు, వ్యతిరేక కథనాలను, వార్తలను తిప్పి కొట్టడానికి సంవత్సరానికి ఏకంగా 140 మిలియన్ డాలర్లను ఖర్చు చేస్తున్నదని సమాధానం ఇచ్చింది. ముఖ్యంగా 2014 నుంచి విమర్శకుల గొంతులను నొకుతున్నట్టు తెలిపింది. మత విద్వేషాలను వ్యాప్తి చేసినందుకు ఏ రాజకీయ నాయకులను అరెస్టు చేస్తారని ఓ నెటిజన్ అడగ్గా, ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ వంటి వారు మతవిద్వేషాలను ఎకువగా ప్రచారం చేస్తు న్నారని గ్రోక్ పేరొన్నది. దీంతో గ్రోక్ సమాధానాలపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. దాని ముందు ఎలా నిలబడాల నేది బీజేపీకి ప్రశ్నగా మిగిలింది.

ముఖ్యంగా ప్రధాని మోడీ, బీజేపీ నేతల మీద అడుగుతున్న ప్రశ్నలకు "గ్రోక్" ఇస్తున్న సమాధానాలు బీజేపీకి మింగుడు పడటం లేదు. మోడీ ప్రధాని అయ్యాక నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌ల గురించి విశ్లేషించాలని కోరగా.. మోడీ మీడియా ముందుకు రావడం లేదని, మాట్లాడే పనిని అమిత్ షాకు అప్పగించారంటూ సమాధానం ఇచ్చింది. అంతేకాదు మోడీ ఇచ్చే ఇంటర్వ్యూలన్నీ స్క్రిప్టెడ్ (ముందే సిద్ధం చేసుకున్న ప్రశ్న, జవాబులు)గా అనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది. దీంతో గ్రోక్ చుట్టూ రాజకీయాలు తిరగడం మొదలయ్యాయి.

వందన వీడ్కోలు

మహిళల హాకీ స్టార్ ప్రకటన




న్యూఢిల్లీ : భారత మహిళల హాకీ దిగ్గజ క్రీడాకారిణి, స్టార్ ఫార్వర్డ్ వందన కటారియ అంతర్జాతీయ హాకీ నుంచి తప్పుకుంది. 32 ఏండ్ల వందన కటారియ 15 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు మంగళవారం ముగింపు పలికింది. ఈ మేరకు తన నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. భారత్‌కు 320 మ్యాచుల్లో ప్రాతినిథ్యం వహించిన వందన 158 గోల్స్ నమోదు చేసింది. ' ఈ రోజు భారమైన హృదయంతో అంతర్జాతీయ హాకీకి వీడ్కోలు పలుకుతున్నాను. నా ఆట మందగించిందని, దూకుడు తగ్గిందని ఈ నిర్ణయం తీసుకోలేదు. కెరీర్‌లో మంచి స్థితిలో ఉన్నప్పుడే వైదొలగాలని అనుకున్నాను' వందన తెలిపింది. భారత జట్టుకు అత్యధిక మ్యాచులు ఆడిన క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పిన వందన హాకీ ఇండియా లీగ్ సహా ఇతర టోర్నమెంట్లలో ఆడనుంది.

ఎదురులేని పంజాబ్

కొత్త నాయకుడి సారథ్యంలో పంజాబ్ కింగ్స్ అదరగొడుతుంది. బ్యాట్‌తో, బంతితో అద్భుత ప్రదర్శన చేస్తూ అలవోక విజయాలు సాధిస్తోంది. లక్నో సూపర్‌జెయింట్స్‌ను తొలుత 171/7 పరుగులకే పరిమితం చేసిన పంజాబ్ కింగ్స్...ఊరించే లక్ష్యాన్ని 16.2 ఓవర్లలోనే ఊదేసింది. ఛేదనలో ప్రభుసిమ్రన్ సింగ్ (69), శ్రేయస్ అయ్యర్ (52 నాటౌట్) ధనాధన్ మోత మోగించారు.

- లక్నో సూపర్‌జెయింట్స్ ఘన విజయం
- ఛేదనలో మెరిసిన ప్రభుసిమ్రన్, శ్రేయస్
- లక్నో 171/7, పంజాబ్ కింగ్స్ 177/2



నవతెలంగాణ-లక్నో

పంజాబ్ కింగ్స్ జోరు కొనసాగుతుంది. ఐపీఎల్18లో శ్రేయస్ అయ్యర్ సేన వరుసగా రెండో మ్యాచ్‌లో విజయఢంకా మోగించింది. మంగళవారం లక్నోలో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌పై పంజాబ్ కింగ్స్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. 172 పరుగుల ఛేదనలో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (69, 34 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో మెరువగా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (52 నాటౌట్, 30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), నెహల్ వధేరా (43 నాటౌట్, 25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (8) విఫలమైనా టాప్-4 బ్యాటర్లలో ముగ్గురు దంచికొట్టారు. మరో 22 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ కింగ్స్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 171 పరుగులే చేసింది. నికోలస్ పూరన్ (44, 30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆయుశ్ బదాని (41, 33 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు. ఓపెనర్ మిచెల్ మార్ష్ (0), కెప్టెన్ రిషబ్ పంత్ (2) విఫలం అయ్యారు. ఎడెన్ మార్క్‌రామ్ (28), డెవిడ్ మిల్లర్ (19) అంచనాలను అందుకోలేదు. ఆఖర్లో అబ్దుల్ సమద్ (27, 12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) లక్నోకు మెరుగైన స్కోరు అందించాడు. పంజాబ్ పేసర్ అర్షదీప్ సింగ్ (3/43) మూడు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు.

దంచికొట్టారు :

ఊరించే ఛేదనలో పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (8) పవర్‌ప్లేలోనే వికెట్ పారేసుకున్నాడు. మరో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (69)తో జతకలిసిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (52 నాటౌట్) మ్యాచ్‌ను పంజాబ్ వశం చేశాడు. పవర్‌ప్లేలో 62/1తో నిలిచిన పంజాబ్‌ను అయ్యర్, ప్రభుసిమ్రన్ దూకుడుగా నడిపించారు. ప్రభుసిమ్రన్ మూడు సిక్సర్లు, ఆరు ఫోర్లతో 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. అయ్యర్, సింగ్ జోడీ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పి లక్నో సూపర్‌జెయింట్స్ ఆశలు ఆవిరి చేసింది. అర్ధ సెంచరీ అనంతరం ప్రభుసిమ్రన్ నిష్క్రమించినా.. నెహల్ వధేరా (43 నాటౌట్)తో కలిసి శ్రేయస్ అయ్యర్ ధనాధన్ మోత మోగించాడు. శార్దుల్ ఠాకూర్‌పై విరుచుకుపడిన నెహల్ వధేరా అతడి ఓవర్లో బౌండరీల వర్షం కురిపించాడు. మూడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో వేగంగా ఛేదనను ముగించాడు. నాలుగు సిక్సర్లు, మూడు ఫోర్లతో 30 బంతుల్లో అజేయ సెంచరీతో పాటు పంజాబ్ కింగ్స్‌ను గెలుపు గీత దాటించాడు. 16.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన పంజాబ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లక్నో బౌలర్లలో దిగ్వేశ్ రాఠి (2/30) రెండు వికెట్లు పడగొట్టాడు.

అభిమాన క్రికెటర్ల ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు సగటు అభిమానులు వేల రూపాయలు వెచ్చించి టికెట్లు కొనుగోలు చేసేందుకు పోటీపడతారు. అభిమానుల్లో క్రేజ్‌ను సొమ్ము చేసుకునేందుకు బ్లాక్ మార్కెట్‌లో టికెట్ ధరలకు రెక్కలు వస్తున్నాయి. కానీ ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసులు, రాజకీయ నాయకులు సహా క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు అనుమతులు అందించే అన్ని ప్రభుత్వ విభాగాలు ఉచిత టికెట్లతో స్టేడియంలో అడుగుపెడుతున్నారు. హైదరాబాద్ సహా ఇతర ఐపీఎల్‌కు ఆతిథ్యం ఇస్తోన్న నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

ఏ స్టేడియమైనా ఇదే వ్యథ

- ఐపీఎల్‌లో ఉచిత టికెట్ల కోసం తీవ్ర ఒత్తిడి
- పది ప్రాంఛైజీలకు తగిలిన పాస్‌ల సెగ ?



నవతెలంగాణ-హైదరాబాద్

హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) మధ్య ఐపీఎల్ టికెట్ల వివాదం దేశవ్యాప్త చర్చకు దారితీసింది. ఐపీఎల్ రూల్స్ ప్రకారం అందించే 10 శాతం ఉచిత పాస్‌లు సరిపోవటం లేదని, మరో పది శాతం టికెట్లను కొనుగోలు చేసే వెసులుబాటు కల్పించాలని హెచ్‌సీఏ చేసిన అభ్యర్థనను సన్‌రైజర్స్ తిరస్కరించటంతో.. ఇరు వర్గాల మధ్య ఈమెయిల్స్‌లో మినీ యుద్ధమే నడిచింది. ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించగా... ఐపీఎల్‌కు ఆతిథ్యం ఇస్తున్న ఇతర నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోందని సోషల్ మీడియా వేదికగా పలువురు పాత్రికేయులు, క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇది బయటపడినా... ఇతర నగరాల్లోనూ ఇంతకంటే దారుణ పరిస్థితులు నెలకొన్నాయని తెలుస్తోంది!.

గతంలో ప్రయత్నించినా..

దేశవ్యాప్తంగా ఉచిత పాస్‌ల కల్చర్‌కు మంగళం పాడేందుకు 2018లో బీసీసీఐ సరికొత్త రూల్స్ రూపొందించింది. మాజీ కాగ్ వినోద్ రాయ్ సారథ్యంలోని పాలకుల కమిటీ (సీఓఏ) ఉచిత పాస్‌లను 10 శాతానికి కుదించింది. ఐదు శాతం పాస్‌లు రాష్ట్ర క్రికెట్ సంఘం, మరో ఐదు శాతం పాస్‌లు ప్రకటనకర్తలు, ప్రసారదారులకు బీసీసీఐ కేటాయించింది. ఈ నిర్ణయంపై పలు రాష్ట్ర క్రికెట్ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. నిరసనగా వెస్టిండీస్‌తో వన్డే మ్యాచ్ ఆతిథ్యాన్ని మధ్యప్రదేశ్ క్రికెట్ సంఘం (ఎంపీసీఏ) త్యజించగా.. తమిళనాడు క్రికెట్ సంఘం (టీఎన్‌సీఏ), బెంగాల్ క్రికెట్ సంఘం (సీఏబీ)లు ఈ రూల్స్‌తో మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వలేమని ప్రకటించాయి. బీసీసీఐ పాస్‌ల కోటాను 1200 నుంచి 600కు తగ్గించుకున్నా, రాష్ట్ర క్రికెట్ సంఘాలు మాట వినలేదు. తర్వాతి కాలంలో ఈ రూల్ పుస్తకానికే పరిమితం కాగా... ఆతిథ్య క్రికెట్ సంఘం ఇష్టానుసారంగా ఉచిత పాస్‌లను జారీ చేస్తోంది. వీవీఐపీల నుంచి ఉచిత పాస్‌ల ఒత్తిడికి తట్టుకోలేక 2015 ఐపీఎల్ సమయంలో మహారాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు అజయ్ షిర్కె ఈ కల్చర్‌పై బహిరంగ విమర్శలు గుప్పించాడు. 'ప్రతి రోజు ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్పోరేట్ ఆఫీసర్స్ నుంచి ఉచిత పాస్‌ల కోసం ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఒకరు 22 పాస్‌లు అడిగితే మరొకరు 12 పాస్‌లు కావాలంటారు. ఫ్రీ పాస్‌లు అడిగేందుకు ఏమాత్రం సిగ్గుపడరు. అదేదే వాళ్ల హక్కుగా భావిస్తారు' అని షిర్కె అసహనం వ్యక్తం చేశాడు.

మాజీ క్రికెటర్ల గళం

ఉచిత పాస్‌ల కల్చర్‌పై గతంలో మాజీ క్రికెటర్లు బహిరంగంగా విమర్శలు చేశారు. పార్థీవ్ పటేల్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ' టికెట్ కొనుగోలు చేయగల స్థోమత ఉన్నప్పటికీ.. ఉచిత పాస్‌లు ఎందుకు అడుగుతారు?' అంటూ పోస్ట్ పెట్టాడు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో వీవీఐపీ హోదా ఉందని నిరూపించుకునేందుకు ఉచిత పాస్‌ల కోసం పోటీపడతారని ఆర్పీ సింగ్ వ్యాఖ్యానించగా... ఉచిత పాస్‌ల విషయంలో దేశమంతా ఇదే పరిస్థితి ఉందని మునాఫ్ పటేల్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. మాజీ క్రికెటర్ల హోదాలో రిటైర్డ్ ఆటగాళ్లకు పాస్‌లు వస్తాయి. దీంతో పాస్‌ల కోసం మాజీ క్రికెటర్లను సైతం వదలట్లేదు.

టికెట్ కొనేది సామాన్యులే!

క్రికెట్ మ్యాచ్‌ను టికెట్ కొని చూసేది సాధారణ అభిమానులే. రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు సహా పలు ప్రభుత్వ విభాగాల అధిపతులు ఉచిత టికెట్లను హక్కుగా అడుగుతున్నారు. ఐపీఎల్ మ్యాచులను విజయవంతంగా నిర్వహించే క్రమంలో ప్రభుత్వ విభాగాలతో ఘర్షణ వాతావరణం ఇష్టం లేకే ప్రాంఛైజీలు ఉచిత పాస్‌లు జారీ చేస్తున్నాయి. సామాన్యులు డబ్బులు పెట్టి టికెట్ కొనుగోలు చేస్తుండగా.. ఉన్నత స్థానాల్లోని వ్యక్తులు రూపాయి ఖర్చు లేకుండా స్టేడియంలో వీవీఐపీ కల్చర్‌ను ఆస్వాదిస్తున్నారు. ఉప్పల్ స్టేడియం సామర్థ్యం 39000. దీని ప్రకారం ఐపీఎల్‌లో ఓ మ్యాచ్‌కు గరిష్టంగా 3900 ఉచిత పాస్‌లు ఇస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌కు ఉచిత టికెట్ల డిమాండ్ 10000కు పైనే ఉంది. అందుకే, అన్ని వైపుల నుంచి ఉచిత టికెట్ల కోసం విపరీతమైన డిమాండ్, ఒత్తిడి కనిపిస్తున్నాయి. క్రికెట్ మ్యాచ్‌కు ఉచిత పాస్‌ల కల్చర్‌ను తొలగించి.. స్టేడియం పూర్తి సామర్థ్యం టికెట్లను అమ్మకానికి పెట్టాలని అభిమానులు కోరుతున్నారు.

వివాదం ముగిసింది

సన్‌రైజర్స్‌తో హెచ్‌సీఏ భేటీ
పరస్పర సహకారానికి అంగీకారం



నవతెలంగాణ-హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) వివాదానికి తెరపడింది. రెండు రోజులుగా ఈమెయిల్స్‌లో యుద్ధం చేసిన ఐపీఎల్ ప్రాంఛైజీ, రాష్ట్ర క్రికెట్ సంఘం వివాదానికి ముగింపు పలికాయి!. ఉప్పల్ స్టేడియంలో మంగళవారం హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌తో సన్‌రైజర్స్ ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ భేటీకి అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు దూరంగా ఉండగా.. కార్యదర్శి ఆర్.దేవరాజ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఐపీఎల్18లో రానున్న మ్యాచులను విజయవంతంగా నిర్వహించేందుకు సన్‌రైజర్స్, హెచ్‌సీఏ కలిసికట్టుగా పని చేయాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఈ భేటీలో నిర్ణయించారు. బీసీసీఐ, హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ నడుమ ట్రైపార్టీ ఒప్పందం ప్రకారం పని చేసేందుకు తీర్మానించారు. ఏండ్లుగా కొనసాగుతున్న పద్ధతిలో భాగంగానే హెచ్‌సీఏకు ప్రతి మ్యాచ్‌కు స్టేడియం సామర్థ్యంలో పది శాతం పాస్‌లు (3900) కేటాయించేందుకు సన్‌రైజర్స్ ప్రతినిధులు అంగీకరించారు. ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లను విజయవంతం చేసేందుకు హెచ్‌సీఏ పూర్తి స్థాయిలో సహకరిస్తుందని ఈ సందర్భంగా దేవరాజ్ హామీ ఇచ్చారు. మంగళవారం నాటి సమావేశంతో అభిప్రాయ భేదాలకు పరిష్కారం లభించిందని, తమ మధ్య ఉన్న వివాదం ముగిసిందని సన్‌రైజర్స్, హెచ్‌సీఏ సంయుక్త ప్రకటన చేసింది. ఉప్పల్ స్టేడియంలో ఈ ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ జరగనుంది.

విజిలెన్స్ విచారణ షురూ :

సన్‌రైజర్స్‌ను హెచ్‌సీఏ వేధించిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ మొదలైంది. ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలోని సిట్ బృందం మంగళవారం ఉప్పల్ స్టేడియంలో పలు రికార్డులను స్వాధీనం చేసుకుంది. హెచ్‌సీఏ అధికారిక ఈమెయిల్స్, టికెట్ల అంశంలో సన్‌రైజర్స్‌తో సంప్రదింపుల వివరాలను సిట్ బృందం సేకరించినట్టు సమాచారం.

ఇది ప్రేక్షకుల విజయం



సూర్యదేవర నాగవంశీ

'సినిమా విడుదలైన నాలుగైదు రోజుల్లోనే మా డిస్ట్రిబ్యూటర్లు అందరూ లాభాల బాట పట్టడం సంతోషంగా ఉంది. డిస్ట్రిబ్యూటర్లను దృష్టిలో ఉంచుకుని, మొదటి వారాంతం కొన్ని చోట్ల టికెట్ ధరలను పెంచాం. మొదటి వారాంతం వచ్చిన వసూళ్లతో అందరూ హ్యాపీగా ఉన్నాం. అందుకే సోమవారం నుంచి అన్ని చోట్లా సాధారణ టికెట్ ధరలతోనే సినిమాని అందుబాటులోకి తీసుకొస్తున్నాం. టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ కూడా అయిపోతున్నాయి కాబట్టి, కుటుంబ ప్రేక్షకులు మరింత మంది మా సినిమాని చూడాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని సమర్పకులు సూర్యదేవర నాగవంశీ అన్నారు.

'లక్కీ భాస్కర్', 'డాకు మహారాజ్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వచ్చిన హ్యాట్రిక్ సినిమా 'మ్యాడ్ స్క్వేర్'. బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా రూపొందిన ఈ 'మ్యాడ్ స్క్వేర్'లో నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి, భారీ వసూళ్లు సాధిస్తూ అఖండ విజయం దిశగా దూసుకుపోతోంది.

ఈ నేపథ్యంలో సమర్పకులు సూర్యదేవర నాగవంశీ మీడియాతో మాట్లాడుతూ, సీక్వెల్ హైప్‌తో ఆడటానికి ఇది పెద్ద హీరో సినిమా కాదు, భారీ బడ్జెట్ సినిమా కాదు. అయినా ప్రేక్షకులు ఈ సినిమాకి బ్రహ్మరథం పడుతున్నారు. దానికి కారణం వినోదం. మేము స్వయంగా థియేటర్లకు వెళ్లి చూశాము. నాలుగు రోజుల్లోనే దాదాపు అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ అయింది. అంతే కాదు ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.70 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇది ప్రేక్షకుల విజయం. రివ్యూ అనేది ఒకరి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. నచ్చితే నచ్చిందని రాస్తారు, లేదంటే నచ్చలేదని రాస్తారు. అందులో తప్పు లేదు. అలా నిజాయితీగా ఇచ్చే రివ్యూలను మేము స్వాగతిస్తాము. కానీ, కొందరు సినిమాని చంపేయాలనే ఉద్దేశంతో.. రివ్యూ రాసి ఊరుకోకుండా, అనవసరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. అది తప్పు. సినిమా బతికితేనే, అందరం బాగుంటాం అనే విషయాన్ని గ్రహించాలి' అని తెలిపారు.

ఆరోగ్యకరమైన హాస్యభరిత సినిమా



రూప కొడువాయూర్, ప్రియదర్శి

ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. ఈ సినిమా ఈనెల 18న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది.

నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, 'నా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభమైంది ఇంద్రగంటి మోహనకృష్ణ మూవీ నాని 'జెంటిల్‌మన్', దాని తర్వాత చక్కని ప్రేమకథతో, సుధీర్‌బాబుతో 'సమ్మోహనం'. ఈ రెండూ కూడా మంచి పేరు, సక్సెస్ తెచ్చాయి. ఇప్పుడు ఆ విజయాలను ఈ సినిమా కొనసాగిస్తుంది. జంధ్యాల గారితో 'చిన్నోడు-పెద్దోడు' సినిమా రాయించుకున్నాను.. 'ఆదిత్య 369' సినిమా రాయించుకున్నాను. జంధ్యాల గారితో ఒక కామెడీ సినిమా తీయాలని అనుకున్నాను. కానీ కుదరలేదు. మంచి కామెడీ సినిమా తీయాలన్న కోరిక ఈ సినిమాతో తీరింది. కేవలం జాతకాలను మాత్రమే నమ్మకూడదు.. మనం చేయాల్సింది మనం చేయాలి అని చెప్పే సినిమా ఇది. ఇలాంటి సినిమా చేసినందుకు నేను చాలా గర్వపడుతున్నాను' అని అన్నారు.

"శివలెంక కృష్ణప్రసాద్ కాంబినేషన్లో ఇది నాకు మూడో సినిమా. సకుటుంబ సపరివార సమేతంగా మాత్రమే కాకుండా పరకుటుంబ సమేతంగా కూడా చూడదగ్గ చక్కని హాస్యభరిత సినిమా ఇది. ప్రియదర్శితో కలసి పనిచేయడం చాలా సంతోషాన్ని కలిగిస్తోంది. తెలుగమ్మాయి రూప కొడువాయూర్ చాలా బాగా చక్కగా నటించింది. అందరూ తెలుగువారు నటించిన పరిపూర్ణమైన తెలుగు సినిమా ఇది. సమ్మర్లో విడుదల చేయడం అనేది కృష్ణప్రసాద్ తీసుకున్న సరైన నిర్ణయం. అన్ని వయసుల వారికి వినోదాన్ని అందించే ఆరోగ్యకరమైన హాస్యభరిత సినిమా ఇది' అని దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ అన్నారు. కథానాయిక రూప కొడువాయూర్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో ఒక మంచి పాత్ర ధరించే అవకాశం లభించింది. ఈ సినిమా ఘన విజయం సాధిస్తుందన్న నమ్మకం వుంది' అని తెలిపారు.

'నేను ప్రామిస్ చేసి చెబుతున్నాను. ఇది ఒక గ్రేట్ మూవీ. అందరినీ నవ్వించే సినిమా. ఈనెల 18 నుంచి తెలుగు ప్రేక్షకులకు సంపూర్ణ వినోదం అందబోతోంది. ఇంద్రగంటి దర్శకత్వంలో నటించాలన్న నా కల ఈ సినిమాతో తీరింది. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌కి ధన్యవాదాలు. ఆయన ఒక పాజిటివ్ ఫోర్స్. మా యూనిట్ అందరి జాతకాలు చాలా బాగున్నాయి. మేం చక్కని విజయాన్ని అందుకోబోతున్నాం' అని కథానాయకుడు ప్రియదర్శి చెప్పారు.

నవచిత్రం

వినూత్న పంథాలో..



చిరంజీవి నటిస్తున్న 157వ చిత్రం ఉగాది సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం చిరంజీవిని ఫుల్‌లెంత్ హ్యూమర్ రోల్‌లో ప్రజెంట్ చేయనుంది. పక్కా ఎంటర్‌టైనర్స్ తెరకెక్కించడంలో ప్రత్యేకమైన పట్టు కలిగిన దర్శకుడు మాత్రమే కాకుండా, సినిమాలను ప్రమోట్ చేయడంలోనూ డిఫరెంట్, క్రియేటివ్ ప్రమోషన్స్‌తో అనిల్ రావిపూడి అలరిస్తుంటారు. ఇటీవల 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాన్ని విభిన్నమైన రీతిలో ప్రమోట్ చేసి విజయం సాధించిన ఆయన అదే స్థాయిలో ఈ చిత్రానికి కూడా ఇన్నోవేటివ్ ప్రమోషన్లను ప్లాన్ చేస్తున్నారు.

ఈ ప్రమోషన్‌లో భాగంగా చిరంజీవి కెరీర్‌లోని ఐకానిక్ పాత్రలతో ఒక వినూత్నమైన వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో మెగా అభిమానులకు నోస్టాల్జిక్ అనుభూతిని కలిగించడంతో పాటు, ఈ మూవీ టీంని ఫన్‌ఫుల్‌గా పరిచయం చేసింది. ఈ ఇన్నోవేటివ్ ప్రమోషనల్ వీడియో సినిమాపై అంచనాలను మరింత పెంచుతూ, ఇది మరో భారీ హిట్‌గా నిలుస్తుందని ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా రిలీజ్ కానుంది.

ఈచిత్రానికి నిర్మాతలు - సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, బ్యానర్లు - షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్, సమర్పణ - శ్రీమతి అర్చన, సంగీతం - భీమ్స్ సిసిరోలియో, డీవోపీ - సమీర్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్ - ఎ ఎస్ ప్రకాష్, ఎడిటింగ్: తమ్మిరాజు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - ఎస్.కృష్ణ.

'హిట్ 3' రిలీజ్ డేట్ ఫిక్స్



నాని

హీరో నాని నటిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'హిట్ 3 : ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న చిత్రమిది. వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని, నాని యునానిమస్ ప్రొడక్షన్స్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు.

ఇప్పటికే గ్లింప్స్, టీజర్, ఫస్ట్ సింగిల్ 'ప్రేమ వెల్లువ'కు వచ్చిన అద్భుతమైన స్పందనతో ఈ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి.

ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్న ఈ సినిమా మే 1న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ 30 డేస్ కౌంట్ డౌన్ పోస్టర్ రిలీజ్ చేశారు. నాని ఇంటెన్స్ లుక్‌లో సిగరెట్ కాలుస్తూ గన్ గురి పెట్టిన ఈ పోస్టర్ అందర్నీ అలరిస్తూ, సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ చిత్రంలో నాని ఫెరోషియస్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. రీసెంట్‌గా రిలీజైన టీజర్ బోల్డ్ స్టోరీ టెల్లింగ్, నాని ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో బజ్‌ను క్రియేట్ చేసింది. క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌ని ఈ మూవీ రీడిఫైన్ చేసి ఆడియన్స్‌కు నెవర్ బిఫోర్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతోంది అని చిత్ర బృందం తెలిపింది.

నాని, శ్రీనిధి శెట్టి జంటగా నటిస్తున్న ఈచిత్రానికి రచన, దర్శకత్వం: డా. శైలేష్ కొలను, నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని, డీవోపీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె మేయర్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్), లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధదపు.

'చైనా పీస్'లో వాలిగా..



నిహాల్ కోధాటి

నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా చిత్రం 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్ పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు.

మేకర్స్ సోమవారం వాలి పాత్రలో నిహాల్ కోధాటిని పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. నిహాల్‌ని ఇంటెన్స్ లుక్‌లో ప్రజెంట్ చేసిన ఫస్ట్‌లుక్ అందర్నీ మెస్మరైజ్ చేస్తోంది. అంతేకాదు ఈ సినిమాలో ఆయన క్యారెక్టర్ పై ఆసక్తిని పెంచింది. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తారు. నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్, హర్షిత బండ్లమూరి, కమల్ కామరాజు, గులాసీ, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి రచన, దర్శకత్వం: అక్కి విశ్వనాథ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: సురేష్ రగుతు, సంగీతం: కార్తీక్ రోడ్రిగ్జ్, ఎడిటర్: మార్తాండ్ కె. వెంకటేష్.

ఆ టెంపరేచర్ దాటితే..?



సాయి అభిషేక్

ఎమోషనల్ థ్రిల్లర్ లవ్ స్టోరీ మూవీ '28^0c'తో ప్రొడ్యూసర్‌గా సాయి అభిషేక్ ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు. వీరాంజనేయ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి హీరో, హీరోయిన్లుగా నిర్మించారు. 'పొలిమేర' ఫేమ్ డా.అనిల్ విశ్వనాథ్ తన మొదటి సినిమాగా దీన్ని రూపొందించారు. ఈ సినిమా ఈ నెల 4వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో నిర్మాత సాయి అభిషేక్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- నేను, డైరెక్టర్ డా.అనిల్ విశ్వనాథ్ క్లోజ్ ఫ్రెండ్స్. మూవీస్ మీద మా ఇద్దరికీ ప్యాషన్ ఉండేది. '28^0c' అనే టెంపరేచర్ పాయింట్‌తో అనిల్ విశ్వనాథ్ చెప్పిన కథ ఇంప్రెస్ చేసింది. ప్రేక్షకులకు కూడా ఇది కొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకంతో మూవీ స్టార్ట్ చేశాం.
- మొదట ఈ మూవీకి వేరే హీరోలను అనుకున్నా. నవీన్ చంద్రకే బాగుంటుందనే నిర్ణయించాం. ఈ మూవీకి ఫస్ట్ అనుకున్న హీరోయిన్ అంజలి. కొంత ట్రెండీగా కొత్త ఫేస్ ఉంటే బాగుంటుందని షాలినీని తీసుకున్నాం. వైజాగ్‌లో షూటింగ్ స్టార్ట్ చేశాం. అక్కడి నుంచి గోవా, ఆ తర్వాత జార్జియా వెళ్లాం. ప్రొడక్షన్ విషయంలో రాజీ పడకుండా హై క్వాలిటీతో మూవీ చేశాం. సినిమా కంటెంట్ మీద మా టీమ్ అందరికీ మంచి నమ్మకం ఉంది. వంశీ నందిపాటి చొరవతో ఈ నెల 4న మా సినిమాను థియేట్రికల్‌గా రిలీజ్ చేయబోతున్నాం.
- హీరోగా నవీన్ చంద్ర మాకు బాగా కోపరేట్ చేశాడు. ఆయన క్యారెక్టర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. అలాగే హీరోయిన్ షాలినీ కూడా బాగా పర్‌ఫార్మ్ చేసింది. '28^0c' టెంపరేచర్‌లో హీరోయిన్ ఉండాల్సిన హెల్త్ కండీషన్ ఏర్పడుతుంది. ఆ టెంపరేచర్ దాటితో ఆమెకు ప్రాణాపాయం. అలాంటి పరిస్థితిని ఈ జంట ఎలా ఎదుర్కొన్నారు అనేది ఆసక్తికరంగా ఉంటుంది.
- ఒకే జోనర్‌లో ఈ మూవీ సాగదు. డిఫరెంట్ జోనర్స్‌లో వెళ్తూ ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీగా ఆకట్టుకుంటుంది. డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్ ఆద్యంతం ప్రేక్షకుల్ని థ్రిల్ చేసేలా మూవీ రూపొందించారు.



మల్లన్న ఆలయ భూముల రక్షణకు సీపీఐ(ఎం) వ్యాజ్యం

- ఆ భూమిని కొల్లగొట్టే యత్నం
- అధికారులు కోర్టుకు హాజరుకాకుండా బెదిరింపులు

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న దేవస్థాన భూములు కాపాడేందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేశారు. సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మండల కార్యదర్శి తాడూరి రవీందర్‌తో కలిసి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి మాట్లాడారు. సర్వే నెంబర్ 201, 208, 230లో ఐదెకరాల 19 గుంటల భూమి మహాదేవుని మల్లయ్య, మహాదేవుని సాంబయ్య నుంచి 1983లో డాక్యుమెంట్ నెం. 397/1983 ద్వారా, అలాగే సర్వే నెంబర్ 218, 219లోని ఐదెకరాల 20గుంటల భూమిని మహాదేవుని నాగమల్లయ్యతో పాటు మరో ఆరుగురు నుంచి 1992లో డాక్యుమెంట్ నెం.23/1992 ద్వారా ఆలయ నిధులతో ఆనాటి ఆలయ అధికారులు కొనుగోలు చేశారన్నారు. ఇన్ని ఆధారాలు ఉన్న భూమిని.. మహాదేవుని శ్రీనివాస్ అనే వ్యక్తి కబ్జా చేశాడని తెలిపారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఈ భూములను స్వాధీన పరుచుకుని ఆలయ నిధులతో ప్రహరీ గోడ నిర్మించినట్టు చెప్పారు. అప్పటినుంచి ఈ భూములు కోర్టు పరిధిలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహదేవుని శ్రీనివాస్.. ఆలయ భూములను కొట్టేయాలని తిరిగి ప్రయత్నాలు చేస్తున్నారని, అందులో భాగంగానే గత ఆలయ ఈవో బాలాజీపై ఒత్తిడి తెచ్చి ఆలయం తరపున న్యాయపోరాటం చేయకుండా, భూములు కోల్పోయే విధంగా కోర్టు కేసుకు హాజరు కాకుండా, వాదనలు వినిపించకుండా చేశాడని తెలిపారు. ఇది ఇలాగే కొనసాగితే ఆలయ భూముల్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. అందుకే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేసి న్యాయపోరాటం చేస్తున్నట్టు తెలిపారు. ఈ భూములు కోల్పోతే సందర్శకులకు తిప్పలు తప్పవని.. ఇప్పటికే పార్కింగ్ సౌకర్యం లేక ప్రయివేటు భూముల్లో వాహనాలు నిలుస్తున్నాయన్నారు. ఈ ఆలయ భూములను రక్షించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, స్థానిక ప్రజానీకం కలసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, మండల నాయకులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, బక్కెల్లి బాలకిషన్, తాడూరి భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సిల్ట్ తొలగింపు పనులు

- కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ పనులు వేగవంతం
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేకాధికారి శివ శంకర్ లోతేటి వెల్లడి



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలకు ఆటంకంగా ఉన్న సిల్ట్, ఇనుప వస్తువులను కట్ చేసి వేగంగా బయటకు పంపిస్తున్నట్టు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టీలు, ఇనుము పదార్థాలను నిర్విరామంగా టన్నెల్ బయటకు తరలిస్తున్నట్టు వివరించారు. టీబీఎం చివరి భాగాలను కత్తిరించి మట్టి తవ్వకాలు చేపట్టినట్టు, సహాయక పనులకు అడ్డంకిగా ఉన్న టీబీఎం భాగాలను బయటకు తరలిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర సహాయక బృందాల సమన్వయంతో సహాయక చర్యలను వేగవంతం చేయడంతోపాటు కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ పనులు పూర్తి స్థాయిలో కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవ సహాయం, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, సింగరేణి అధికారి మాధవరావు, ఎన్డిఆర్ఎఫ్ అధికారులు మన్మోహన్ యాదవ్, సత్యనారాయణ, ఎస్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి జయప్రకాష్, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేత చంద్ర, రవీంద్రనాథ్, ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, కేరళ కడావర్ డాగ్స్ ప్రతినిధి, ప్రభాత్, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ నాయకులను విడుదల చేయాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అక్రమంగా అరెస్టు చేసిన డీవైఎఫ్ఐ నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములని కార్పొరేట్ సంస్థలకు వేలం వేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పది రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని గుర్తు చేశారు. భూముల వేలాన్ని ఆపాలని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్న క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా డీవైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు 130 మందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారని తెలిపారు. వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ వద్ద ధర్నా నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు హష్మీ బాబును అరెస్టు చేయటం దుర్మార్గమని పేర్కొన్నారు. అరెస్టులలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్‌పై పిడిగుద్దులు గుద్ది గాయాల పాలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో నియంతృత్వంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

ముందస్తు అరెస్టులు దుర్మార్గం

- హక్కులు హరిస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వం
- అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలి :ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యార్థులను ముందస్తుగా అరెస్టు చేయటం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ విమర్శించింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌ఎల్ మూర్తి, టి నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేయాలని తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడుతున్నారనీ, ఈ క్రమంలో రాష్ట్ర శాసనసభలో సీఎం తప్పుడు సమాచారం ఇచ్చారని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు భూములను అమ్మిన రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను అమ్మేందుకు బుల్డోజర్లను, జేసీబీలను దింపి చెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. వాటిని అడ్డుకున్న విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఎర్రం నవీన్‌ను అక్రమంగా అరెస్టు చేసి అర్ధరాత్రి వరకు ఎక్కడ ఉన్నాడో చెప్పకుండా, ఫోన్ లాక్కోని హింసించి రిమాండ్ చేయటం దారుణమని విమర్శించారు. విద్యార్థులపై నిర్బంధాన్ని ప్రయోగించటం, పోలీసు బలగాలతో యూనివర్సిటీని నిర్బంధించటం వంటి సంఘటనలకు నిరసనగా శాంతియుత కార్యక్రమాలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తే అర్ధరాత్రి నుంచి పోలీసులు జిల్లాల్లో ఎస్ఎఫ్ఐ నాయకులను 298 మందిని ముందస్తు అరెస్టు చేయటం దుర్మార్గపు చర్యని పేర్కొన్నారు. తమ పాలనలో నిర్బంధాలు ఉండవని చెప్పి, అధికారంలోకొచ్చిన వెంటనే ప్రగతి భవన్ కంచెలు తొలగించి ఇప్పుడు ఏకంగా ఇండ్లలోకి వెళ్లి మరీ అరెస్టు చేయటమేంటని ప్రశ్నిం చారు. అక్రమ అరెస్టులను ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యార్థులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత

యూనివర్సిటీ భూముల్లో ప్రభుత్వం అడుగుపెట్టొద్దు

- విద్యార్థులకు మద్దతుగా సీపీఐ(ఎం) నిరసన
- నాయకుల అడ్డగింత.. అరెస్టులు.. పలు పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- నిర్బంధాలతో ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే పోరాటం ఉధృతం : రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్
- వామపక్ష నాయకుల అరెస్టులను నిరసిస్తూ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, టీచర్లు, నాన్ టీచర్ల నిరసన



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని, విద్యార్థుల అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను కార్పొరేట్ శక్తులకు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ విద్యార్థులకు మద్దతుగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర కమిటీతో పాటు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కమిటీలు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు పెద్ద సంఖ్యలో యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట నిరసన చేపట్టారు. సీపీఐ(ఎం) బృందం నిరసనను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల ప్రయత్నాలను ప్రతిఘటిస్తూ సీపీఐ(ఎం) నాయకులు విద్యార్థులను కలుసుకోవడానికి యూనివర్సిటీ వెలుపలికి చొచ్చుకుని పోయే ప్రయత్నం చేశారు. పోలీసు యంత్రాంగం తమ బలగాలను దింపి సీపీఐ(ఎం) నాయకులను అక్కడి నుంచి తరలించేందుకు యత్నించింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో నాయకులను లాక్కొని వెళ్లి పోలీసు వ్యాన్లలో ఎక్కించారు. వారు ప్రతిఘటించే క్రమంలో పోలీసులు చేయి చేసుకున్నారు. మహిళా నాయకులను నేలపై ఈడ్చుకెళ్లారు. అరెస్టు చేసిన వారిని గచ్చిబౌలి, నార్సింగి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టయిన వారిలో.. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జె.వెంకటేష్, పి.జయలక్ష్మి ఆర్.అరుణజ్యోతి, బి.ప్రసాద్, పి.ఆశయ్య, నాయకులు ఉడత రవీందర్, అనగంటి వెంకటేష్, కోటా రమేష్, శోభన్‌నాయక్, కాడిగళ్ళ భాస్కర్, శోభన్, జి.విఠల్, మీనా, శ్రావణ్‌కుమార్, కవిత, శశికళ, ప్రకాష్‌కారత్, కృష్ణ, జగదీష్, రుద్రకుమార్, స్టాలిన్, శంకర్ తదితరులు ఉన్నారు.



"యూనివర్సిటీ భూములు భవిష్యత్‌తరాలకు ఉపయోగపడేలా ఉండాలని, ఈ భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించి యూనివర్సిటీ మూలాలను దెబ్బ తీయొద్దని .. శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు తమపై ఎందుకు దూరుసుగా వ్యవహరిస్తున్నారని సీపీఐ(ఎం) నాయకులు ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆరుగ్యారంటీలతో పాటు.. అసెంబ్లీ సాక్షిగా చెప్పిన ఏడో గ్యారంటీ అయిన ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా చేస్తున్న పోరాటాన్ని పోలీసులను ఉపయోగించి ఎందుకు నిర్బంధిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలోకి వెళ్లకుండా పోలీసులు భయానక వాతావరణాన్ని సృష్టించడం సరికాదన్నారు. 144 సెక్షన్ పెట్టి ఎలాంటి నిరసనలు తెలియజేయకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. యూనివర్సిటీ భూములను, అడవులను.. బుల్డోజర్లను పంపి చదును చేస్తుంటే అక్కడ పక్షులు, జంతువులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందన్నారు. పర్యావరణానికి నష్టం కలిగించే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం యూనివర్సిటీకి చెందిన 400ఎకరాల భూమి వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అక్కడ 144 సెక్షన్, విద్యార్థులపై నమోదు చేసిన అక్రమ కేసులను రద్దు చేయాలన్నారు. ఇలాంటి నిర్బంధాల ద్వారా ఈ ఉద్యమాన్ని అణచివేస్తామనుకుంటే భవిష్యత్‌లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే, టీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో పాటు పలు విద్యార్థి సంఘాలు నిరసనలు తెలిపాయి.

వామపక్ష నాయకుల అరెస్టులను నిరసిస్తూ ఐక్య కార్యాచరణ పోరాట కమిటీ ధర్నా

విద్యార్థుల పోరాటానికి మద్దతుగా వచ్చిన సీపీఐ(ఎం) నాయకుల అరెస్టును నిరసిస్తూ హెచ్‌సీయూ ఐక్య కార్యాచరణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. తమకు మద్దతుగా వచ్చిన వామపక్ష నాయకులను అరెస్టు చేయడం సరికాదని, వెంటనే వారిని పోలీసు స్టేషన్ల నుంచి విడిచిపెట్టాలని, వారిపై కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణల చెరలో అడవులు

(మొదటిపేజీ తరువాయి)

చూపింది. గతేడాది ఏప్రిల్‌లో.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అటవీ ప్రాంతాల ఆక్రమణ వివరాలను నిర్దిష్ట ఫార్మాట్‌లో సంకలనం చేయాలని కేంద్ర మంత్రిత్వ శాఖను ఎన్జీటీ ఆదేశించింది.

గత వారం ఎన్జీటీకి సమర్పించిన నివేదికలో... మంత్రిత్వ శాఖ మార్చి 2024 నాటికి, 25 రాష్ట్రాలు , యూటీలలో మొత్తం 13,05,668.1 హెక్టార్ల (లేదా 13,056 చదరపు కి.మీ) అటవీ ప్రాంతం ఆక్రమణకు గురైందని, ఇప్పటివరకు అందిన వివరాలంటూ పేర్కొంది.

అండమాన్ అండ్ నికోబార్ దీవులు, అసోం, అరుణాచల్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, చండీగఢ్, ఛత్తీస్‌గఢ్, దాదర్ అండ్ నగర్, డామన్ అండ్ డయ్యూ, కేరళ, లక్షద్వీప్, మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, పంజాబ్, తమిళనాడు, త్రిపుర, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, సిక్కిం మధ్యప్రదేశ్, మిజోరాం , మణిపూర్ రాష్ట్రాలు, యూటీలు ఉన్నాయి.

ఇంకా నివేదికలు ఇవ్వలే

అటవీ ఆక్రమణపై వివరాలతో ఇంకా పలు రాష్ట్రాలు యూటీలు అందజేయాల్సి ఉన్నది. ఇందులో బీహార్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ , రాజస్థాన్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, నాగాలాండ్, ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ , లడఖ్ ఉన్నాయి. అటవీ ప్రాంతం లేదా రికార్డ్ చేయబడిన అటవీ ప్రాంతం (ఆర్ఎఫ్ఏ)లో చెట్లు విస్తరించకపోయినా ప్రభుత్వం అధికారికంగా అటవీగా నియమించ బడిన భూమి ఉంటుంది.

ఆర్ఎఫ్ఏ ప్రకారం మూడు కేటగిరీలుగా విభజన పూర్తి రక్షణ కలిగిన రిజర్వ్ అడవుల్లో వేట, మేత వంటి కార్యకలాపాలు సాధారణంగా నిషేధించబడ్డాయి

ప్రత్యేకంగా పరిమితం చేయకపోతే కొన్ని కార్యకలాపాలు అనుమతించ బడే రక్షిత అడవులు, వర్గీకరించని అడవులు, వీటిని రిజర్వ్ లేదా రక్షితంగా వర్గీకరించబడలేదు.మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం, అన్ని రాష్ట్రాలు, యూటీలలో మధ్యప్రదేశ్ అత్యధిక అటవీ ఆక్రమణకు గురైంది. మార్చి 2024 నాటికి 5,460.9 చదరపు కిలోమీటర్లు ప్రభావితమయ్యాయి.అసోంలో 3,620.9 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం ఆక్రమణకు గురైంది. కర్నాటకలో మొత్తం 863.08 చదరపు కిలోమీటర్ల అటవీ భూమి ఆక్రమణకు గురైంది. ఆ తర్వాత మహారాష్ట్రలో 575.54 చదరపు కిలోమీటర్లు, అరుణాచల్ ప్రదేశ్‌లో 534.9 చదరపు కిలోమీటర్లు, ఒడిశాలో 405.07 చదరపు కిలోమీటర్లు, ఉత్తరప్రదేశ్‌లో 264.97 చదరపు కిలోమీటర్లు, మిజోరాంలో 247.72 చదరపు కిలోమీటర్లు, జార్ఖండ్‌లో 200.40 చదరపు కిలోమీటర్లు, ఛత్తీస్‌గఢ్‌లో 168.91 చదరపు కిలోమీటర్ల వరకు అన్యాక్రాంతమయ్యాయి. తమిళనాడులో 157.68 చదరపు కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 133.18 చదరపు కిలోమీటర్లు, గుజరాత్‌లో 130.08 చదరపు కిలోమీటర్లు, పంజాబ్‌లో 75.67 చదరపు కిలోమీటర్లు, ఉత్తరాఖండ్‌లో 49.92 చదరపు కిలోమీటర్లు , కేరళలో 49.75 చదరపు కిలోమీటర్లు, త్రిపురలో 42.42 చదరపు కిలోమీటర్లు, అండమాన్ , నికోబార్ దీవులలో 37.42 చదరపు కిలోమీటర్లు , మణిపూర్‌లో 32.7 చదరపు కిలోమీటర్లు ఆక్రమణకు గురైన అటవీ భూమి ఉంది.

ఇప్పటివరకు 409.77 చదరపు కిలోమీటర్ల అటవీ భూమిలో ఆక్రమణలను తొలగించినట్టు మంత్రిత్వ శాఖ నివేదిక పేర్కొంది. అయితే, మార్చి 2024 నాటికి ఈ ప్రాంతం ఆక్రమణకు గురైన మొత్తం అటవీ భూమి నుంచి మినహాయించబడిందా లేదా అనేది అస్పష్టంగా ఉంది.

ఎన్నిసార్లు ఆదేశించినా..

గతేడాది మే 1, మే 17, మే 28 తేదీల్లో పంపిన లేఖల ద్వారా రాష్ట్రాలు డేటాను సమర్పించాలని కోరినట్టు మంత్రిత్వ శాఖ ఎన్జీటీకి తెలియజేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా ఫోన్‌లో అనేక సార్లు గుర్తు చేయించారు. నవంబర్ 11న వారితో సమావేశం నిర్వహించారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 22, మార్చి 26 తేదీలలో మంత్రిత్వ శాఖ మరిన్ని రిమైండర్ లేఖలను పంపింది. మిగిలిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను పట్టిక రూపంలో సమాచారాన్ని అందించమని కోరింది. కానీ వాటికి సంబంధించి ఇంతవరకూ సమాధానం పంపలేదని అధికార వర్గాలు ధ్రువీకరించాయి.

మోడీ సర్కార్ వచ్చాక..

మోడీ సర్కార్ వచ్చాక పచ్చని అడవులు కాస్త కార్పొరేట్ల కాసుల కక్కుర్తికి హరించుకుపోతున్నాయి. అడవుల్లో ఉన్న గిరిజనాన్ని భయాందోళన లకు గురిచేసేలా మావోయిస్టులను ఎదురుకాల్పుల పేరిట చేస్తున్న హింసోన్మాదంపై పౌరసమాజం మండిపడుతూనే ఉన్నది. మరోవైపు అడవుల్లోని నిక్షేపాలను వెలికితీసేలా తమకు అనుకూలురనుకున్న పారిశ్రామిక వేత్తలకు వెసులుబాటు కలిగే జీవోలను కేంద్రంలోని బీజేపీ సర్కార్ జారీ చేస్తున్నది. మధ్యప్రదేశ్‌లో ఉన్న బీజేపీ సర్కార్ వేల ఎకరాలు కబ్జాదారుల కోరల్లోకి వెళ్తున్నా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పల్లెత్తుమాట అనటం లేదనటానికి తాజా నివేదికే ఉదాహరణ.

ఆ స్థలం ముమ్మాటికీ ప్రభుత్వానిదే

కోర్టులో వివాదం ఉన్నన్ని రోజులూ పట్టించుకోని హెచ్‌సీయూ అధికారులు

- ఇప్పుడు యూనివర్సిటీదంటూ విద్యార్థులను రెచ్చగొడతారా?
- అసలు వర్సిటీకి స్థలం ఇచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం
- గత ప్రభుత్వమే ప్రయివేటు యూనివర్సిటీలకు స్థలాలు ఇచ్చింది : రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీని ఆనుకుని ఉన్న 400 ఎకరాల స్థలం ముమ్మాటికీ ప్రభుత్వానిదే. ఆ స్థలం వివాదం కోర్టులో ఉన్నన్ని రోజులు ఏనాడూ హెచ్‌సీయూ అధికారులు పట్టించుకోలేదు. అసలు ఆ స్థలం యూనివర్సిటీదేనన్న భావనలోనే లేరు. ఇప్పుడు విద్యార్థులను రెచ్చగొడుతూ బీఆర్ఎస్, బీజేపీ పబ్బంగడుపుకునే కుట్ర చేస్తున్నాయి' అని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. హెచ్‌సీయూ స్థల వివాదంపై రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో మంత్రి స్పందించారు. 2004లో హెచ్‌సీయూకి స్థలాన్ని కేటాయించిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, ప్రభుత్వరంగ సంస్థలకు ఎన్నో వేల ఎకరాలు ఇచ్చిన ఘనత తమ సర్కారుదేనని అన్నారు. అయితే, 2014లోనే హెచ్‌సీయూ పరిధిలోని స్థలాలను పంచనామా చేసి 400 ఎకరాలు యూనివర్సిటీకి సంబంధం లేదని చట్టపరంగా తేల్చారని, ఈ వివాదం కోర్టుకెక్కిందని తెలిపారు. అప్పుడే గోపనపల్లిలో 367 ఎకరాలను ప్రత్యామ్నాయ స్థలంగా వర్సిటీకి తీసుకున్నారన్నారు. చట్టపరంగా ప్రభుత్వానికి చెందిన 400 ఎకరాలనే తాము తీసుకుంటున్నామని తెలిపారు. దీన్ని వివాదం చేసేందుకు విద్యార్థులను రెచ్చగొడుతూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కుట్ర చేస్తున్నారన్నారు. అందులోనూ దేశంలోని ప్రభుత్వ సంస్థలను తెగనమ్మిన బీజేపీ ఇక్కడ మొసలికన్నీరు కారుస్తోందన్నారు. తాను కూడా విద్యార్థి నాయకుని దశ నుంచే వచ్చానని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించి రూపాయి కూడా నష్టం కలిగించబోమని అన్నారు. గత ప్రభుత్వమే ప్రయివేటు యూనివర్సిటీలకు స్థలాలు ఇచ్చిందని, ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలకు రక్షణగా ఉంటామని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

రేషన్‌లో సన్నబియ్యం

- హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో పంపిణీ
- ఉదయం నుంచే లబ్ధిదారుల బారులు
- ప్రారంభించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- ఇది నిరుపేదల ఆత్మగౌరవ పథకం : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నవతెలంగాణ - నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి/విలేకరులు

రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ మొదలైంది. ఉగాది పండుగ రోజు సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించగా, ఎన్నికల కోడ్ ఉండటంతో హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో మంగళవారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు బియ్యం పంపిణీ చేశారు. ఉదయం 8 గంటల నుంచే రేషన్ షాపుల వద్ద లబ్ధిదారులు బారులు తీరారు. సన్న బియ్యం రావడంతో మీడియా కూడా హాజరై కవరేజీ చేసింది. లబ్ధిదారులు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేశారు. ఏప్రిల్ 29 వరకు హైదరాబాద్‌లో ఎన్నికల కోడ్ ఉంటుంది. మే నెల నుంచి హైదరాబాద్‌లో సన్న బియ్యం పంపిణీ జరుగుతుంది. సన్న బియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకమని, చరిత్రలో నిలిచిపోతుందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం, జి.ఎడవల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. పేదలు కూడా సన్నం బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం పదేండ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం 20 లక్షల మంది పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చుతుందని చెప్పారు. 3 కోట్ల పది లక్షల మందికి సన్నబియ్యాన్ని ఇవ్వనున్నామని తెలిపారు. రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామన్నారు. కనగల్ మండలంలో 20 ఏండ్ల కింద లక్ష రూపాయలతో తన ఆధ్వర్యంలో 500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, ఇప్పుడు మళ్లీ రూ.ఐదు లక్షలతో ఇల్లు కట్టిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, ఇన్‌చార్జ్ డిఎస్‌ఓ హరీష్, డిఆర్డిఓ శేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, డీసీవో పత్యానాయక్, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్, అనూప్ రెడ్డి పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం..

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని బుడగ జంగాల కాలనీలో తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని 19వ వార్డులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని టీజీఐసీసీ చైర్మెన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి తహసీల్దార్ సరస్వతితో కలిసి ప్రారంభించారు.

హైడ్రా నిద్ర పోతుందా ...?

అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి : ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుదాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత కొద్ది రోజులుగా సెంట్రల్ యూనివర్సిటీ కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలు కబ్జాకు గురి అవుతుంటే రాష్ట్రంలో చెరువులు కాపాడుతానని ప్రతిజ్ఞ బూనిన హైడ్రా రంగనాథ్ ఏం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుదాకర్ ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కోట్లాది రూపాయల విలువైన ఈ 400 ఎకరాలలో అడవితోపాటు 3 చెరువులు పీకాక్ లేక్, బఫెల్లో లేక్, క్రేన్ లేక్ లు వున్నాయనీ, అంటే ఆ నాలుగు వందల ఎకరాలు బఫర్ జోన్‌లోకి వస్తాయని చెప్పారు. అంగుళం స్థలం కూడా బఫర్ జోన్‌లో ఉంటే వదలం అని చెప్పే రంగనాథ్ ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే హెచ్‌సీయూ విద్యార్థి సంఘాల నాయకులతోపాటు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయమై చర్చించి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు. హెచ్‌సీయూ భూములను ఆక్రమిస్తామనీ, నిర్మాణం చేస్తామని మొండి పట్టు పడితే రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

ప్రభుత్వ భూములు అమ్మాలనుకోవడం దుర్మార్గం

కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి : పాయల్ శంకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ భూములను అమ్మడానికి ప్రభుత్వాలెందుకు? అని ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు వాటినే అమ్మాలనుకోవడం దుర్మార్గం, మూర్ఖత్వమే అవుతుందని బీజేపీ ఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ విమర్శించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థి, పర్యావరణ సంఘాలు, రాజకీయ పార్టీలన్నీ హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమిని అమ్మొద్దని డిమాండ్ చేస్తున్నాయని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చినంత మాత్రాన భూముల విక్రయానికి సర్టిఫికెట్ ఇచ్చినట్టు కాదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాల విలువైన భూములను అమ్మి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారంలో నెట్టే ప్రయత్నం చేసిందనీ, నేడు కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మారుస్తామంటూనే మరోవైపు పర్యావరణానికి హాని కలిగించే నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీచార్జిని ఖండించారు. హెచ్‌సీయూకి వెళ్లాలని ప్రయత్నిస్తే తమను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి పరిశోధన కేంద్రాలు స్థాపిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అనేక ప్రాజెక్టులకు భూములు కేటాయించలేకపోతున్నదని విమర్శించారు. రాష్ట్రంలోని భూములను ఇలా అమ్మేస్తే భవిష్యత్ అవసరాలకు ఎక్కడి నుంచి కేటాయిస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా పొలిటికల్ డైవర్షన్ చేస్తూ భూములను అమ్మాలని చూస్తోందని విమర్శించారు. హెచ్‌సీయూ భూముల అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ ఎస్.ప్రకాష్ రెడ్డి, ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు

కాంగ్రెస్ అధిష్టానానికి జానారెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు చోటు కల్పించాలని కాంగ్రెస్ సీనియర్ నేత కె.జానారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌కు లేఖ రాశారు. ఈ నిర్ణయంతో ప్రజలకు ప్రయోజనమే కాకుండా, కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివద్ధికి దోహద పడుతుందని ఆయన లేఖలో పేర్కొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థి ప్రతినిధులతో ప్రభుత్వం చర్చించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కంచె గచ్చిబౌలిలో 400 ఎకరాల భూములకు సంబంధించి ఆందోళన వ్యక్తం చేస్తున్న హెచ్‌సీయూ విద్యార్థుల ప్రతినిధి బృందంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూ భూములని విద్యార్థులు అంటుండగా, అవి రాష్ట్ర ప్రభుత్వానివేనని ప్రభుత్వం అంటున్నదని తెలిపారు. ఆ 400 ఎకరాలకు బదులుగా, వర్సిటీకి అంతే మొత్తంలో భూములు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం రికార్డులు చూపిస్తున్నదని గుర్తు చేశారు. దీనిపై సందేహాలను నివృత్తి చేసేందుకు విద్యార్థుల ప్రతినిధి బృందంతో చర్చించి, వారి అభిప్రాయాలను స్వీకరించాలని సూచించారు. అదే సమయంలో వర్సిటీ విద్యార్థులపై పోలీసుల బలప్రయోగాన్ని ఖండిస్తున్నామన్నారు. అరెస్టయిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారిపై కేసులు పెడితే ఉపసంహరించుకోవాలని కోరారు. భూముల అమ్మకం విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఆందోళనలను తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవడం మంచిదనీ, ప్రభుత్వం ముందుకొచ్చి మాట్లాడితే మంచి సంకేతాలు ఇచ్చినట్టవుతుందని తెలిపారు. ఇలాంటి సున్నితమైన అంశాల విషయంలో పోలీసులు అతిగా ప్రవర్తించవద్దని హితవు పలికారు. దాని వల్ల సమస్య జటిలమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు సహజంగానే ఆందోళన ఉంటుందనీ, దాన్ని అర్థం చేసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సమస్త తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
బుధవారం | ఏప్రిల్ 02, 2025 | www.navatelangana.com

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



నవతెలంగాణ-హయత్‌నగర్

పేదలకు నాణ్యమైన వైద్యం అందించడం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సీఎం సహాయ నిధి ఎంతో అండగా ఉంటుందని హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నగోని రవీందర్ గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని హుడాసాయి నగర్ కాలనీకి చెందిన కనకమేడల నాగేశ్వరావుకు సీఎం సహాయ నిధి నుండి రూ.45000వేల చెక్కు మంజూరైంది. ఈ మేరకు మంగళవారం ఆ చెక్కును లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డి డివిజన్ అధ్యక్షుడు మకుటం సదాశివ, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్లు నరసింహ, కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సైదాబాద్ పీస్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో మంగళవారం డీసీపీ కాంతిలాల్ పాటిల్ సుభాష్‌ను ఘనంగా సన్మానించారు. దావత్-ఏ-ఈద్‌లో పీస్ కమిటీ సభ్యులతో మర్యాదపూర్వకంగా డీసీపీని కలిశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ తాడూరి స్వామి, సైదాబాద్ ఏసీపీ డి. వెంకన్న నాయక్, పీస్ కమిటీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఆన్షద్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చంపాపేట్

కొండపాక పంపింగ్ స్టేషన్‌ను
పరిశీలించిన ఎండీ అశోక్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్టులో భాగమైన కొండపాక పంపింగ్ స్టేషన్‌ను జలమండలి ఎండి అశోక్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని నగరానికి నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ముర్మూర్ వద్ద ఇన్ లెట్ నుంచి నగరానికి సరఫరా ట్రాన్స్మిషన్ తదితర వివరాలకు సంబంధించిన ఆన్లైన్ మాని టరింగ్ సిస్టమ్(స్కాడా)ను వంద శాతం వినియోగం కోసం ప్రణాళికలు రూపొం దించి సమర్పించాలని ఆదేశించించారు. అలాగే ఎల్లంపల్లి నుంచి నగరానికి సరఫరా చేసే ప్రతి చుక్కా లెక్కించడానికి ఫ్లో మీటర్ ఏర్పాటు చేసి ఆ వివరాలు ప్రధాన కార్యాలయంలో పర్యవేక్షించేందుకు మీటరింగ్ వ్యవస్థ కూడా ఆటోమేషన్ చేయమని అధికారులకు సూచించారు. అలాగే ఏదైనా అత్యవసర సమయంలో పంపులు రిపేర్లు గానీ.. కాలిపోయిన సందర్భంగా నీటి సరఫరా ఆటంకం కాకుండా స్టాండ్ బై మోటార్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే పంపింగ్ స్టేషన్ పరిసరాలలో గార్డెన్, సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్మిషన్ జీఎం రాజశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మట్టిలో మెరిసిన మాణిక్యం కృతిక



మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-మీర్‌పేట్

మట్టిలో మెరిసిన మాణిక్యం కృతిక అని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన సరూర్‌నగర్ మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య- బీరప్పల కుమార్తె సిద్దాల కృత్తిక గ్రూప్-1 పరీక్షలో రాష్ట్ర ఐదవ ర్యాంకు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంగళవారం కృతిక ఇంటికి వచ్చి ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలుపుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి చదివిన వారికి ఎప్పటికైనా విజయం తప్పకుండా లభిస్తుందన్నారు. దానికి ప్రత్యేక నిదర్శనం కృతిక సాధించిన విజయం అని చెప్పారు. కృతిక భవిష్యత్‌లో మరెన్నో పెద్దపెద్ద బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవలందించాలని కోరారు. నేటి యువతీ యువకులు ఒక్క పరీక్ష ఫేయిల్ అవ్వగానే నిరుత్సాహం చెందకుండా పట్టుదలతో శ్రమిస్తే విజయం నీ బానిస అవుతుందనీ, కృతికను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సెంట్రల్
యూనివర్సిటీ స్థలాలు కాపాడాలి



- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగే నిరసనలను జయప్రదం చేయండి
- సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-చంపాపేట్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్థలాలను కాపాడాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమిని ప్రభుత్వం అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం యూనివర్సిటీ గేటు ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ నాయకులు పి. ఆశయ్య, జె.వెంకటేష్, భూపాల్ రెడ్డి, రమ, అరుణ జ్యోతి, శోభన్ మాట్లాడుతూ సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీన ఐఎస్ సదన్ చౌరస్తా, సంతోష్ నగర్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కమిటీ నిర్ణయించిందని తెలిపారు. యూనివర్సిటీ వాతావరణాన్ని నాశనం చేయాలని చూస్తే విద్యార్థులను, యూనివర్సిటీ కార్మికులను ఏకం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో పాల్గొన్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అన్యాయం అని అన్నారు. ఇలాంటి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలకు నిరసనగా ఈ నెల 2న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, ధర్నాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

చైతన్యపురిలో సన్న బియ్యం పంపిణీ..



నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చైతన్యపురి డివిజన్‌లోని వివిధ రేషన్ దుకాణాల్లో మంగళవారం డివిజన్ అధ్యక్షుడు బండ సురేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు, సీనియర్ కాంగ్రెస్ నేతలు మహేందర్ యాదవ్, నాగార్జున రెడ్డి, రాంబాబు, శివకుమార్, మహేష్ గౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం..
భూముల అమ్మకాన్ని వెంటనే ఆపాలి

సీపీఐ(ఎం) నాయకుల డిమాండ్



నవతెలంగాణ - మీర్‌పేట్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం మీర్‌పేట్ పోలీసులు అక్రమంగా ఉదయాన్నే ఇంటి నుండి బలవంతంగా సీపీఐ(ఎం) నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ ముందస్తు అరెస్టులను బాలాపూర్ మండలం సీపీఐ(ఎం)నాయకులు దాసరి బాబు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పోరాటాలు, నాయకుల మీద నిర్బంధం పెరిగిందని మండిపడ్డారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ వారు అనేక మాయ మాటలు చెప్పారని, ఇప్పుడు అధికారం చేపట్టాక గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఈ ప్రభుత్వం అనుసరిస్తుందని విమర్శించారు. ముందస్తు అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, యూనివర్సిటీ భూములు వేలం ఆపేంత వరకూ కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే యూనివర్సిటీ భూముల వేలాన్ని ఇప్పటికైనా విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ ప్రభుత్వం.. సన్న బియ్యం పథకం



నవతెలంగాణ - హస్తినాపురం

ప్రతీ పేద కుటుంబం సన్నబియ్యం తినాలనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శశిధర్ రెడ్డి డివిజన్ పరిధిలోని పి.ఎన్.ఆర్ కాలనీ ఫేస్ 1 లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దొడ్డు బియ్యం తినలేక, సన్నబియ్యం కొనలేక పేద ప్రజలు పలు రకాల ఇబ్బందులు పడ్డారని, దీంతో దొడ్డు బియ్యం పక్క దారి పట్టాయని ఆరోపించారు. నాణ్యమైన సన్న బియ్యాన్ని తెల్ల రేషన్ కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున అందిస్తున్నారని, రానున్న రోజుల్లో అర్హులందరికీ రేషన్ కార్డ్‌లు అందజేసి సన్నబియాన్ని ‌అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజానీకం ఆనందంగా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. నిరుద్యోగ ఉపాధి కోసం రాజీవ్ యువ వికాస పథకానికి అర్హులైన వారు ఈ నెల 14వ తేదీ వరకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం అందించే సుమారు రూ.4 లక్షల సబ్సిడీ రుణాలను ఆయా యూనిట్ల పేరిట సద్వినియోగం చేసుకోవాలని శశిధర్ రెడ్డి తెలిపారు.



నవతెలంగాణ - హస్తినాపురం

పేద ప్రజల ఆహార భద్రత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చౌక ధర దుకాణాల్లో సన్న బియ్యం అందించాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తూ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నందనవనం రాజీవ్ శెట్టి నగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రేషన్ షాప్‌లో ఏప్రిల్ 1వ తేది నుండి తెల్లరేషన్ కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నారని ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మమతా మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్



కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతాయని, అందుకు సీఎం రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో పని పనిచేస్తున్నారని ఏఎంసీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, అనాజ్‌పూర్ గ్రామంలో మంగళవారం ప్రభుత్వం అందించే సన్నబియ్యం పంపిణీ పథకాన్ని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు అనాజ్‌పూర్‌లో రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హయత్‌నగర్

తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేయడం అభినందనీయమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డిలు అన్నారు. మంగళవారం మన్సూరాబాద్‌లోని ఎరుకల నాంచారమ్మ బస్తి వద్ద, మన్సూరాబాద్ చౌరస్తా, మధురానగర్ కాలనీ రేషన్ షాపులలోని తెల్ల రేషన్ కార్డుదారులకు



సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు సన్న బియ్యం పంపిణీ విషయంలో ఏమైనా అక్రమాలు చేసినా, ప్రజలను ఇబ్బందులు పెట్టిన మా దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విట్టల్ రెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మునగాల హరీశ్ రెడ్డి, జక్కిడి రఘు వీర్ రెడ్డి, జగదీశ్, రంగారెడ్డి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హయత్ నగర్‌లో...

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధు యాష్కీ గౌడ్ ఆదేశాలతో మంగళవారం హయత్ నగర్‌లో తెల్లరేషన్ కార్డు లబ్దిదారులకు ఒక్కొక్కరికి 6కేజీ ల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని రవీందర్ గౌడ్, గజ్జి శ్రీనివాస్ యాదవ్, పాండు నాయక్, గోవర్ధన్, వేముల శ్రీనివాస్, సంతోష్, పంతు నాయక్ పాల్గొన్నారు.

నవతెలంగాణ -చంపాపేట్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని కాంగ్రెస్ సీనియర్ లీడర్ గోపాల్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ పేదలకు ఉగాది కానుక సన్నబియ్యం పంపిణీ అని చెప్పారు. ప్రతి రేషన్ కార్డుపై ఆరు కిలోల సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. లబ్దిదారులు ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో రేషన్ దుకాణాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పథకాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ కాంగ్రెస్ మాత్రమే పేదలకు అండగా ఉండే పార్టీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, బండారి మనోహర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, నాయకులు, ఎర్ర జైహింద్, బాల్ లింగని జంగయ్య, టేకుల శశిధర్ రెడ్డి, క్యారగారి శ్రీధర్, ఇక్కే శ్రీనివాస్, టేకుల సుధాకర్ రెడ్డి, గొరిగే శ్రీశైలం, తుళ్ల నరహరి గౌడ్, నీరుడు శ్రీరాములు, వంగేటి కొండల్ రెడ్డి, మేకల సంజీవ, సుధాకర్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో..



బడంగ్‌పేట్ మున్సిపల్ అల్మాస్‌గూడ పరిధిలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సభ్యులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు బంగారు సత్యనారాయణ, బోయపల్లి వెంకట్ రెడ్డి, నవారు ప్రభాకర్ రెడ్డి, మాల్గారి శ్రీధర్ రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, నవారు రాజిరెడ్డి, రామిడి మల్లారెడ్డి, రాజు యాదవ్ బాలాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.రవికాంత్ రెడ్డి, సామ వరుణ్ రెడ్డి, వంశీ, డి.లక్ష్మయ్య గౌడ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చంపాపేట్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కర్మన్ ఘాట్, భైరమల్ గూడ, చంపాపేట్ డివిజన్ పరిధిలో మంగళవారం



సన్నబియ్యం పంపిణీ పథకాన్ని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రకాష్ గుప్త, చంపాపేట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తోకటి కిరణ్, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేగవత్ గణేష్ నాయక్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు కారుకొండ శివ, సీనియర్ నాయకులు కొక్కొండ ప్రకాష్ గుప్త, దుర్గారెడ్డి, గడ్డం వెంకటేష్, విశ్వనాథ్ గౌడ్, చింటూ, రాజా, రఘు, హనుమంత్ రెడ్డి, కిరణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

సన్న బియ్యం పంపిణీ చేసి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరోసారి పేదల కోసం పని చేస్తుందన్న భరోసాను ఇచ్చిందని



తెలంగాణ యువజన కాంగ్రెస్ నేత, సామాజిక సేవకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం మండలం ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో మంగళవారం సన్న బియ్యం పంపిణీని ఉపేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు టీపీసీసీ ప్రతినిధి సీనియర్ కాంగ్రెస్ నేత దేప భాస్కర్ రెడ్డి సూచనలతో సన్న బియ్యం పంపిణీ పథకం నియోజకవర్గంలో ప్రారంభం అయిందన్నారు. ఈ పథకం కింద సుమారు మూడు కోట్ల మంది రేషన్ దుకాణాల్లో సన్న బియ్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు పది లక్షల మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మెన్ కుంచారపు సురేంద్ర కుమార్, తలాటి రమేష్ నేత, గోదా కళ్యాణ్ యాదవ్, పెద్దవూర సైదులు, లింగుస్వామి గౌడ్, ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ పగడాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజక వర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న షాహిన్ నగర్ కాలనీలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ యూసఫ్ పటేల్ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు రేషన్ షాపులో పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యంను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

నవతెలంగాణ-నాగోల్



ఓ యువకుడు అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివ నాగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ డివిజన్ పరిధిలోని అజయ్ నగర్ కాలనీకి చెందిన చిలకల శేఖర్ అనే యువకుడు ఈ నెల 28న ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదని, అదే రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో అతని ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పినట్లు కుటుంబ సభ్యులు వివరించినట్లు పోలీసులు తెలిపారు. ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్న తమ కుమారుడు ఇంటి నుండి బయలుదేరి తిరిగి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలతో పాటు బంధుమిత్రుల వద్ద విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ యువకుడి తల్లి చిలకల లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో
నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష

నవతెలంగాణ-హయత్‌నగర్



పక్క ఇంట్లో ఉంటున్న ఓ మైనర్‌ను ఆమె తల్లీదండ్రులు ఇంట్లో లేని సమయంలో గదిలో బంధించి, ఆ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో చైతన్యపురి, ద్వారకాపురానికి చెందిన కాసర్ల మహేష్ అలియాస్ బన్నీకి ఇరవై ఏళ్ల జైలు శిక్ష పడింది. వివరాల్లోకి వెళ్తే.. నిందితుడి స్వస్థలం కరివిరాల కొత్తగూడెం (గ్రామం), తుంగతుర్తి (మండలం) సూర్యాపేట జిల్లా. 2023లో చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అత్యాచారం, పోక్సో చట్టం ప్రకారం ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి మంగళవారం పూర్తి ఆధారాలను పరిశీలించి నిందితుడిని దోషిగా నిర్ధారించారు. ఈ కేసులో నిందితుడికి ఇరవై ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించారు. అదే విధంగా బాధితురాలికి రూ.5,00,000 పరిహారం చెల్లించాలని అదనపు పీపీ వాదనలు వినిపించారు.

అన్ని మతాలను గౌరవించడం సాంప్రదాయం

- ఇతర మతాలపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదు
- రాపాక సన్నీ కుమార్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ అన్ని మతాలను గౌరవించడం మన సాంప్రదాయమని, ఇతర మతాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరియైనది కాదని సామాజిక వేత్త, అక్షిత ఫౌండేషన్ చైర్మెన్ రాపాక సన్నీ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ మన దేశం మత సామరస్యానికి, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకని, ప్రతి మతానికి స్వంత విశ్వాసాలను పాటించే హక్కు ఉందని, ఇతరుల మతాలను తక్కువగా చూడడం, అవమానించడం అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు, సమూహాలు సోషల్ మీడియా పలు వేదికలపై ఇతర మతాలను కించపరిచేలా వ్యాఖ్యానించడం, తప్పుడు ప్రచారం చేయడం వంటివి జరుగుతున్నాయని, ఇది చాలా ప్రమాదకరమైనదని, ఇతర మతాలను గౌరవించడం మన సామాజిక బాధ్యత మాత్రమే కాదని చట్టపరంగా కూడా అవసరమన్నారు. మన మతానికి ఉన్న గౌరవం ఇతర మతాలకు కూడా మనం ఇవ్వాలని, మనం ఒక దేశంగా అభివృద్ధి చెందాలంటే ఐక్యత అవసరమని, అందుకే మత పరమైన ద్వేషాన్ని ప్రోత్సహించేలా వ్యవహరించకుండా శాంతిని పరస్పర గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉందన్నారు.

హెచ్‌సీయూ భూముల వేలం వేయొద్దు

- లేకపోతే మరో ఉద్యమం తప్పదు : విద్యార్థి జేఏసీ నేత వర్కాల శివకిషోర్ గౌడ్



నవతెలంగాణ-బోడుప్పల్

హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో ఉద్యమం మొదలవుతుందని విద్యార్థి జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ వర్కాల శివ కిషోర్ గౌడ్ హెచ్చరించారు. ఈ మేరకు బోడుప్పల్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా దేశంలోనే అత్యున్నతమైన విశ్వవిద్యాలయంగా పేరొందిన సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేటర్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా పాలన చేతకాని రేవంత్ రెడ్డి సర్కారు భూములు అమ్మితే వచ్చే సొమ్ముతో పాలన సాగిస్తామనడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ భూముల వేలంపై వెనక్కి తగ్గాలని కోరారు.

రేషన్ దుకాణాల సందర్శన



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీసీఎస్‌ఓ ఎల్.సుగుణాబాయి, ఏసీఎస్‌ఓ టి.సంధ్యతో కలిపి ఉప్పల్, నాగోల్‌లోని రేషన్ దుఖానాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సన్నబియ్యం పంపిణీ గురించి అవగాహన కల్పించారు. సన్నబియ్యం సరఫరా గురించి కార్డుదారులతో సంభాషించారు. అనంతరం రామాంతపూర్ ఎంఎల్ఎస్ పాయింట్‌ను కూడా సందర్శించి నిర్ణీత సమయంలో స్టేజ్ -2 కదలికను వేగవంతం చేయాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిని ఆదేశించారు.

శ్మశానవాటిక రక్షణకు ఎమ్మెల్యే పోరాటం



- రాష్ట్ర నాయకుల దృష్టికి సమస్య
- ఎమ్మెల్యే మర్రికి కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు

నవతెలంగాణ-అల్వాల్

మచ్చ బొల్లారం శ్మశాన వాటికలో అక్రమ డంపింగ్ యార్డు తొలగింపునకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేసిన పోరాటంతో సమస్య రాష్ట్రస్థాయి నాయకుల దృష్టికి వెళ్లిందని స్థానికులు తెలిపారు. అక్రమార్కులు శ్మశాన వాటికను కబ్జా చేసి ప్లాస్టిక్ దందా నిర్వహిస్తుండటాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే చెత్తలోనే కూర్చుని ధర్నా నిర్వహించిన సంగతి తెలిసిందే. కాగా ఎమ్మెల్యే ధర్నాతో మచ్చ బొల్లారం డంపింగ్ యార్డు సమస్య రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లిందని స్థానికులు మంగళవారం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల సహకారం ఉంటేనే ఎలాంటి సమస్య అయినా పరిష్కారమవుతుందన్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలో అనేక సమస్యలున్నాయని, ప్రభుత్వ భూములను కాపాడే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. తన పోరాటంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో వాహనాల వేలం

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో సీజ్ చేసిన ఆరు వాహనాలను ఈనెల 3వ తేదీన సాయంత్రం 4గంటలకు జిల్లా ఎక్సైజ్ అధికారి, మేడ్చల్ ఎక్సైజ్ సీఐ నవనీతల ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్టు ఎక్సైజ్ సీఐ నవనీత మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాల కొరకు మేడ్చల్ ఎక్సైజ్ సీఐ నవనీత మొబైల్ నంబర్: 8712658740, ఎస్సై రాఘవేశ్వరరావు ఫోన్: 9182819684, ఎస్సై వెంకట్ రెడ్డిఫోన్: 7093755115 లను సంప్రదించాలని కోరారు.

హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరిన బీసీ సంఘం నాయకులు



నవతెలంగాణ - పోచారం

బీసీల హక్కుల సాధనకు బీసీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంఘం నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్, కుందారపు గణేష్ చారి, కన్వీనర్ బాలగౌని బాలరాజ్ గౌడ్ ఆదేశాలతో మంగళవారం పోచారం మున్సిపల్ పరిధిలోని బీసీలు రైలులో ఢిల్లీకి బయలుదేరారు. టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి బాలగౌని వెంకటేష్ గౌడ్, బీసీ సంఘం నాయకులు ఐలు వెంకన్న నేతృత్వంలో చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా బాలగౌని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ బీసీలు అన్ని రంగాలలో నష్టపోతున్నారని అన్నారు. రాజకీయ రంగంతో పాటు అన్ని రంగాలలో బీసీలకు న్యాయం జరగాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాల్సిందేనన్నారు. లేకపోతే బీసీల ఆగ్రహానికి గురైతారని హెచ్చరించారు. బీజేపీ బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తే బీజేపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. ఢిల్లీకి బయలుదేరిన వారిలో పోచారం మున్సిపాలిటీకి చెందిన బీసీ నాయకులు ఉప్పమూరి వెంకటేష్, వంగాల లక్ష్మి శ్రీధర్, బి. రాజేందర్, యోగేష్, బి. రేణుక, అర్జున్, కవిత, స్వాతి, వీరేందర్, తదితరులున్నారు.

రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వినియోగించుకోవాలి : కమిషనర్ నాగిరెడ్డి



నవతెలంగాణ- మేడ్చల్

రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ బట్టు నాగిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ కమ్యూనిటీ వర్గాల అభివృద్ధికి రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత డాక్యుమెంట్లను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఈ నెల 14వ తేదీలోపు అందజేయాలని సూచించారు. ఇంకా దరఖాస్తు చేసుకోని వారు..1.ఆధార్ కార్డు, 2. రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం, 3.కుల ధృవీకరణ పత్రం, (తెలంగాణ ఏర్పాటు తర్వాత జారీ చేయబడింది) 4.డ్రైవింగ్ లైసెన్స్, 5.పట్టాదార్ పాసుబుక్, 6.సదరం సర్టిఫికెట్, 7.పాస్ పోర్ట్ సైజు ఫోటో, 8. వర్నబుల్ (గ్రూప్ సర్టిఫికెట్, (మండల స్థాయి కమిటీ ద్వార ధృవీకరించబడింది) ఈ పత్రాలతో మున్సిపల్ కార్యాలయంలోని సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ నాగిరెడ్డి కోరారు.

సంపద పెంచి పేదలకు పంచడమే ప్రభుత్వ లక్ష్యం



- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం
- ప్రతిపక్షాల కుట్రలు నమ్మొద్దు
- సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్

సంపదను పెంచి పేదలకు పంచడమే సర్కారు లక్ష్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వీరారెడ్డి నగర్ లోని రేషన్ షాపు వద్ద ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఇలాంటి సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన సాగిస్తూ పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కొద్దిగా ఆలస్యమైనా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేలా ప్రభుత్వం చొరవ చూపుతుందన్నారు. ఈ పథకాన్ని పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతిపక్షాల కుట్రలు నమ్మొద్దు

ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని రాజకీయ ప్రాభల్యం కోసమే ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తున్నాయని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పేరిటా జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని ఒక్కొక్కటిగా సర్దుబాటు చేసుకుంటూ వస్తున్నారని అన్నారు. గత పాలనలో అవినీతి తప్ప అభివృద్ధే లేదని ఎద్దేవా చేశారు. కేవలం మీడియాలో పబ్లిసిటీ కోసమే బీఆర్ఎస్, బీజేపీలు ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పోగుల నరసింహ రెడ్డి, కొత్త కిషోర్ గౌడ్, పొన్నం తరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చేసిన కార్పొరేటర్ శ్రవణ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని శివపురి కాలనీలోని రేషన్ షాప్‌లో మంగళవారం రేషన్ కార్డులు ఉన్న పలువురు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ దేశంలో ఏ ఒక్కరూ పస్తులు ఉండకూడదని కరోనా సమయంలో సైతం 80 కోట్ల మందికి ఉచితంగా బియ్యం ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు సైతం సన్న బియ్యనికి కేంద్రం రూ.10 వేల కోట్ల సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, రాజు, మురళి, నాని, చారీ, సంతోష్, సింహం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిది చారిత్రాత్మక నిర్ణయం



నవతెలంగాణ -శామీర్ పేట

పేదవారి కోసం సీఎం రేవంత్ రెడ్డి సన్నబియ్యం పథకం ప్రవేశపెట్టడం దేశంలోనే చారిత్రాత్మకమని కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపాలిటీ, శామీర్ పేట, మూడు చింతలపల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లోని రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేశారు. కాగా శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, లాల్‌గడి మలక్‌పేట గ్రామాల్లో నక్క ప్రభాకర్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. మూడు చింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తూంకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు భీమిలి జైపాల్ రెడ్డి, శామీర్ పేట మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, మూడుచింతలపల్లి మాజీ ఎంపీపీ మంద శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేష్, నాయకులు బండి జగన్నాథం, మర్యాల వీరేశం గుప్తా, కటికల గోపి, మహేందర్ యాదవ్, కిషోర్ యాదవ్, జెల్లిపోతుల నరసింహులు, గడ్డం రమేష్, శ్రీనివాస్ యాదవ్, పెండెం లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, విశ్వేశ్వరయ్య గుప్తా, రవీందర్ రెడ్డి, గాద వెంకటేష్, భూమిరెడ్డి, ఐలయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో సన్నబియ్యం పంపిణీ



నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని అవుషాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావడి మాధవ రెడ్డి, మేడపైన జంగయ్య, కందకట్ల సందీప్ రెడ్డి, జిల్లాల మల్లికార్జున్ రెడ్డి, దొంకిని భాస్కర్ గౌడ్, భాను ప్రకాష్, చిన్న యాదవ్, కృష్ణ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం : పరమేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ - చర్లపల్లి

పేదలు కడుపునిండా భోజనం చేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి తెల్లకార్డు ఉన్న ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.

మల్లాపూర్‌లో ప్రారంభించిన నెమలి అనిల్ కుమార్

కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్దిదారులకు కుటుంబంలోని ప్రతీ సభ్యునికి ఆరు కిలోల చొప్పున మల్లాపూర్ డివిజన్‌లోని రేషన్ షాపుల్లో కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 89.73 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉండగా, వీటి ద్వారా 2.8 కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. 3.10 కోట్ల మందికి ఉచిత బియ్యం అందిస్తామని సీఎం తెలిపారని అన్నారు. ఈ పథకానికి ప్రభుత్వం ఏటా రూ.10,600 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీజీ.సుదర్శన్, బొంగొని ఉమేష్ గౌడ్, రాజు గౌడ్, మెరుపుల బాలరాజ్ గౌడ్, జమీలా బేగం, రాజేష్, పర్వతాలు, ప్రభాకర్ రెడ్డి, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు సాయి కిరణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్ గౌడ్, కార్యదర్శి జానీభాయ్, జాఫర్, ఎస్. వి కిట్టు, సురేష్ గౌడ్, ఎస్ సి సెల్ అధ్యక్షులు మనోహర్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు బాతరాజు రాహుల్, మహిళా అధ్యక్షురాలు సోనీ గౌడ్, శైలజ, లక్ష్మి, లావణ్య సునీత తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయే పథకం :శ్రీదేవి



సన్నబియ్యం పథకం చరిత్రలో నిలుస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన అందిస్తున్నారని, ఇందిరమ్మ రాజ్యంలో సోనియమ్మ, రాహుల్ గాంధీ ఆలోచనలతో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సువర్ణ పాలన అందిస్తున్నారని బొంతు శ్రీదేవి అన్నారు. సంపన్నులతో సమానంగా పేదలు సన్న బియ్యం తినే విధంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కాగా చర్లపల్లి డివిజన్‌లోని సాయినగర్ కాలనీ, చిన్న చెర్లపల్లి, పెద్ద చెర్లపల్లి, ఐజీ కాలనీ రేషన్ షాపులలో బియ్యం పంపిణీ ప్రారంభించారు.

పేదలు కడుపునిండా భోజనం : సింగిరెడ్డి వెంకటరెడ్డి

పేదలు కడుపునిండా భోజనం చేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి తెల్లకార్డు ఉన్న ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాం రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, ఏ ఎం సీ డైరెక్టర్ బాల్ రెడ్డి, బొడిగె ప్రభు గౌడ్, శ్రీకాంత్ యాదవ్, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ పరిశీలన



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్‌లోని 133వ డివిజన్‌లోని రేషన్ షాపుల్లో తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం పేదలకు నాణ్యమైన బియ్యం అందించాలనే ఉద్దేశ్యంతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ పంపిణీ సక్రమంగా జరుగుతోందా.. లేదా అని పరిశీలించేందుకే రేషన్ షాపులను సందర్శించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ సభ్యులు సురేందర్ రెడ్డి, మల్లికార్జున్, శ్రీను, దేవేందర్, సంజీవ, హరి, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలనీలో సన్న బియ్యం పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ హెచ్‌బీ కాలనీ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షు డు పోలేపాక అంజయ్య పాల్గొన్నారు. మంగళవారం హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలానగర్ మల్లేష్‌గౌడ్ చౌక ధర దుకాణంలో సన్నబియ్యం పంపిణీ చేయడానికి ప్రధాన కార్యదర్శి రాయని ఉదయ్ కిరణ్, సురేష్‌గౌడ్, శ్రీనివాస్, శ్రవణ్ కుమార్ గౌడ్, భానురి నిక్కి, సురేష్, అనిల్, ఎస్. మల్లేష్, మల్లిఖార్జున్, జమ్మి, మహిళా కార్యకర్తలు, లబ్దిదారులు హాజరయ్యారు. సంద ర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బియ్యం పంపిణీ ప్రారంభించిన అధ్యక్షులు పత్తి కుమార్

నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీని మంగళవారం మేడ్చల్ జిల్లా కాప్రా డివిజన్ ఎల్లారెడ్డి గూడలో కాంగ్రెస్ కాప్రా డివిజన్ అధ్యక్షులు నాగశేషు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పత్తికుమార్, కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ హాజరై ప్రారంభించారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పత్తికుమార్ మాట్లాడుతూ..రాష్ట్రంలో 89.73 లక్షల తెల్లరేషకార్డులు ఉన్నాయని, వీటి ద్వారా 2.8 కోట్ల మంది ప్రజలు లబ్ది పొందుతున్నారని చెప్పారు. 30 లక్షల కొత్త దరఖాస్తులతో లబ్దిదారుల సంఖ్య 3.10 కోట్లకు చేరుకుంటుందని తెలిపారు. వారందరికీ రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా సన్న బియ్యం ఇస్తామని సీఎం చెప్పారని తెలిపారు. ఈ పథకానికి ప్రభుత్వం ఏటా రూ.10,600 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజు, నాగరాజు సతీష్, శ్రీనివాస్ గౌడ్, తోటకూర శ్రీకాంత్, జగదీష్, సుమన్, షాబుద్దీన్, ఆరీఫ్, రాజు, నరేందర్ గౌడ్, విఠల్ నాయక్, పూర్ణయాదవ్, మల్లారెడ్డి, బాబూరావు, సత్యనారాయణ తదితరులున్నారు.

సన్న బియ్యం పంపిణీతో పేదలకు ఎంతో మేలు

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంత్ రెడ్డి



నవతెలంగాణ- మేడ్చల్

సన్న బియ్యం పంపిణీతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాటవెళ్లి హన్మంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని హర్షం వ్యక్తం చేశారు. గతంలో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని ప్రజలు ఉపయోగించుకోకుండా అమ్ముకున్నారని గుర్తు చేశారు. పేద ప్రజలు కడుపునిండా మూడు పూటల అన్నం తినడానికి దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిలు సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్దిదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోపరుచుకోవాలని సూచించారు. సన్న బియ్యం పంపిణీతో అక్రమంగా దొడ్డు బియ్యం దందా చేసే ముఠాలకు చెక్ పడునుందని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎవరూ చేయని ధైర్యం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తం కుమార్ రెడ్డిలు చేశారని తెలిపారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పదవీ విరమణ సర్వ సాధారణం

- మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి



నవతెలంగాణ-ఘట్కేసర్

పదవీ విరమణ సర్వ సాధారణమని, విరమణ వయసుకే కానీ వృత్తికి కాదని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఘట్కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీ నగర్ ఎస్ఎల్ఎన్ కన్వెన్షన్‌లో నిర్వహించిన డాక్టర్ పి. ప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమానికి ఘట్కేసర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏనుగు సుదర్శన్ రెడ్డి మాటాడుతూ.. ఉద్యోగ వృత్తిలో పదవీ విరమణలు ప్రతి ఒక్కరికీ సాధారణంగా వచ్చేవే అని, ఆయన అందించిన సేవలు మరువలేనివని అని అన్నారు. డాక్టర్ ప్రసాద్ ఘట్కేసర్‌లో వైద్య సేవలు అందించి అనేక మంది ప్రాణాలు కాపాడారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కప్పరగళ్ళ కరుణాకర్, చందుపట్ల శ్రీనివాస్‌రెడ్డి, గ్యార చిరంజీవి, శ్రీనివాస్ తదితరులున్నారు.



మీర్పేట్ హెచ్‌బీ కాలనీ, వెంకటేశ్వర నగర్‌లో సర్వ ప్రాణి సమాజ్ ఆధ్వర్యంలో కార్టన్ కంపెనీ బస్టాప్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మెన్ నందికంటి శ్రీధర్, ముత్యం వెంకన్న, సూర్య ప్రకాష్‌తో కలిసి బీజేపీ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ పారంభించారు.

అధికారులు కోర్టు ఉత్తర్వులను పట్టించుకోవడం లేదు

- బోర్డులు నాటి చేతులు దులుపుకున్నారు
- అనుమతులు లేని నిర్మాణాలపై అధికారుల మౌనం దేనికో..
- అధికారుల తీరును విమర్శిస్తున్న బాధితులు



నవతెలంగాణ-కీసర

తమ పూర్వీకులకు చెందిన భూమిని కబ్జా నుంచి కాపాడాలని చేసిన విజ్ఞప్తికి స్పందించి ఉన్నతాధికారులు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా స్థానిక కమిషనర్ మాత్రం కబ్జాదారులకే వత్తాసు పలుకుతూ అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బాధితులు మండిపడ్డారు. మంగళవారం కీసర మండల కేంద్రంలో బాధితులు కొన్నే అంజయ్య గౌడ్ , కొన్నే శంకర్ గౌడ్ , కొన్నే హరిదాస్ గౌడ్ లు విలేకరులతో మాట్లాడుతూ..కీసర మండలం రాంపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 381, 382, 383, 384, 387లో తమ పూర్వీకులు జమ్మల కిష్టమ్మ-నర్సయ్యలకు 31.13 ఎకరాల భూమి ఉందని తెలిపారు. వారి తదనంతరం వారి వారసులైన కొన్నే లక్ష్మీ మల్లమ్మలకు చెందుతుందన్నారు. తమ పూర్వీకుల ప్రమేయం లేకుండానే తమ దాయాదులు కొందరు తప్పుడు పత్రాలతో తమ భూమిని విక్రయించారని, ఆ విషయం తెలిసి 2003లో కోర్టును ఆశ్రయించగా న్యాయ స్థానం 2006లో తమ పూర్వీకుల భూమి తమకే చెందుతుందని చెప్తూ (OS582/2003) కేసులో తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు.

రెవెన్యూ అధికారులకు ఆదేశాలు..

కోర్టు తీర్పును అనుసరించి అప్పటి కీసర తహసీల్దారు జమ్మల కిష్టమ్మ వారసులకు మ్యూటేషన్ చేసిందని బాధితులు తెలిపారు. అసలు లే అవుటే కానీ భూమిలో ప్లాట్ల పేరుతో కొందరు (లక్ష్మీ నగర్ అసోసియేషన్) అప్పటి ఆర్డీవోను సంప్రదించి ఫిర్యాదు చేయగా దర్యాప్తు జరిపిన ఆర్డీవో నిజ నిజాలు తెలుసుకుని కిష్టమ్మ వారసులకే అనుకూలంగా తీర్పు ఇచ్చారని తెలిపారు. అదే అసోసియేషన్ వాళ్ళు 2018లో మరోసారి మేడ్చల్ జిల్లా సంయుక్త కలెక్టర్‌కు ఇదే అంశంపై ఫిర్యాదు చేయగా స్పందించిన సంయుక్త కలెక్టర్ దర్యాప్తు జరిపించి 2019లో కిష్టమ్మ వారసులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని చెప్పారు. (అర్డర్ నెంబరు D1/316/2019) అయినా స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిడిలకు తలొగ్గిన మున్సిపల్ అధికారులు అక్రమార్కులకే అనుకూలంగా వ్యవహరిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోలేదని చెప్పారు. దీంతో బాధితులు 2024లో హై కోర్టును ఆశ్రయించి తమకు జరిగిన అన్యాయాన్ని కోర్టుకు తెలిపారని తెలిపారు. దీంతో స్పందించిన న్యాయస్థానం సదరు సర్వే నెంబరులలో వివాదం పరిష్కారం అయ్యే వరకు అక్కడ రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఆ భూమిపై వివాదం ఉందని తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో నాగారం కమిషనర్ భాస్కర్ రెడ్డి సూచిక బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. ఇదిలా ఉండగా అక్కడ అన్ని ఆదేశాలు ఉన్నా అక్రమార్కులు మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రొటెక్షన్ వాల్స్, రూంలు కట్టడం లాంటి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అయినా కమిషనర్ అస్సలు పట్టించు కోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ పూర్వీకు ల భూమిని వారి వారసులైన తమకు చెందేలా చూడాలని కోరారు.



ఆధ్యాత్మిక గ్రంథాలు ఆవిష్కరణ



నవతెలంగాణ-కల్చరల్

విశ్వా వసు నామ సంవత్సర తెలుగు ఉగాది సందర్భగా నోరి నరసింహ శాస్త్రి చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణ లో శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై రెండు ఆధ్యాత్మిక గ్రంథాలు ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా సంస్కృత అకాడమీ డైరెక్టర్ పెన్న మధుసూదన్ పాల్గొని కళ్యానానంద భారతీ స్వామి విరచించిన సౌభాగ్య భాస్కర కళ్మలకు డాక్టర్ నోరి శివ సేనాని తెలుగు అనువాద వ్యాఖ్యాన గ్రంథం, వనదుర్గా మహా విద్యా పంచ శతి, గుణ నిధి దీధితిలను డాక్టర్ వార ణాసి వెంకటేశ్వర్లు వ్యాఖ్యానం చేసిన గ్రంథాలను ఆవిష్కరించి మాట్లాడారు. భారతీయ ఆధ్యాత్మిక చింతన విశ్వ మానవాళి శ్రేయస్సు కు ఉపయోగ పడే విధంగా గ్రంథాలు ఉన్నాయన్నారు. వేదిక పై గంభీరా నంద భారతీ స్వామి శివా నంద భారతీ స్వామి పాల్గొనగా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నోరి సుబ్రహ్మణ్య శాస్త్రి అధ్యక్షత వహించారు. ఎం.వెంకట రాయ శర్మ, వారణాసి వెంకటేశ్వర్లు, డాక్టర్ నోరి శివ సేనాని గ్రంథాలను పరిచయం చేశారు.

4న గాన సభ ప్రాంగణంలో కృష్ణ శిల గణపతి ప్రతిష్ట



నవతెలంగాణ కల్చరల్

4న శ్రీ త్యాగరాయ గానసభ ప్రాంగణంలో కృష్ణశిలతో రూపొందిన అభయ గణపతి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం నిర్వహిస్తున్నామని గాన సభ అధ్య క్షుడు కళా జనార్ధన మూర్తి విలేకరులకు తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పురాణపండ శ్రీనివాస్ సలహా అనుసరించి శృంగేరి పీఠం పండితుల వేద పఠనంతో ప్రతిష్ఠ జరుగుతుం దని తెలిపారు.

ట్యాంకర్‌ల డెలివరీలకు ఏర్పాట్లు చేసుకోవాలి : జలమండలి ఎండీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

టాంకర్ బుకింగ్.. డెలివరీలపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి జీఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. వరుసగా వచ్చిన సెలవులు అలాగే ఉగాది.. రంజాన్ పండగల సందర్భంగా కొంత మంది టాంకర్ డ్రైవర్లు సెలవులపై వెళ్లడంతో కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ బుకింగ్ పెండెన్సీ పెరిగినట్టు గుర్తించామని అన్నారు. వరుసగా వచ్చిన సెలవులువల్ల ట్యాంకర్ బుకింగ్ పెద్దగా పెరగకపోయినప్పటికీ డ్రైవర్ల సెలవులలో వెళ్లడంతో షేక్‌పేట్, షాపూర్‌నగర్, బుద్వేల్, ఆసిఫ్‌నగర్, ఎన్టీఆర్ నగర్, భవానీ నగర్, చిలకలగూడ, షాపూర్‌నగర్-2, మౌలా అలీ, గాజులరామారం, ఎర్రగడ్డ, గచ్చిబౌలి-2, వెంగళరావునగర్, ఎల్లారెడ్డిగూడ, వెంకటగిరి ఫిల్లింగ్ స్టేషన్ లలో వందకు పైగా ట్యాంకర్ పెండెన్సీ పెరిగిందని వివరించారు.

ఈ పెండింగ్ పెండింగ్ గా ఉన్న టాంకర్లను డెలివరీ చేయడానికి రానున్న రెండు రోజులు అదనం గంటలు పనిచేయడానికి ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండు షిఫ్టుల్లో ట్యాంకర్‌లు డెలివరీలు చేయడానికి ఏర్పాటు చేసుకోవాలని.. అందుకు అనుగుణంగా నీరు సరఫరా చేసే ఏర్పాట్లు చేయాల న్నారు. పగటి వేళల్లో గృహ అవసరాలకు.. రాత్రి వేళ కమర్షియల్ అవసరాలకు ట్యాంకర్లను డెలివరీ చేయడానికి ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ జూమ్ మీటింగ్ లో ఈడి మయాంక్ మిట్టల్ మాట్లా డుతూ.. ట్యాంకర్ డేటాను అనుసరించి ఏయే ఫిల్లింగ్ స్టేషన్‌లలో, ఏయే సమయాల్లో బుకింగ్ అవుతున్నాయో అనాలసిస్ చేసుకుంటే పెండెన్సీ తగ్గించుకోవచ్చని అన్నారు. అవసరమైన ఫిల్లింగ్ స్టేషన్‌లలో ఫిల్లింగ్ పాయింట్స్ పెంచుకోవచ్చని అందుకు ప్రపోజల్స్ సమర్పించాలని ఆదేశించారు.

నిర్బంధాన్ని ప్రయోగిస్తూ హక్కులు హరిస్తున్న కాంగ్రెస్ సర్కారు..

అక్రమంగా అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులను అక్ర మంగా అరెస్టు చేయడం దుర్మార్గమనీ, తక్షణమే వారిని విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేట్ శక్తులకు హెచ్‌సీయూ భూములను అమ్మేందుకు అక్కడ అడవులను చదును చేయాలనే పేరుతో బుల్డో జర్, జేసీబీలతో చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టిందనీ, జేసీబీలను అడ్డుకున్న విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేసిందని తెలిపారు. విద్యార్థులపై నిర్బంధాన్ని ప్రయోగిం చటం, పోలీసు బలగాలతో యూనివర్సిటీని నిర్బంధించటం వంటి సంఘటనలకు నిరసనగా శాంతియుత కార్యక్రమాలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తే పోలీసులు అర్ధరాత్రి నుంచి జిల్లాలోని ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తు అరెస్టు చేయటం దుర్మార్గపు చర్య అని ఆయన మండిపడ్డారు. తమ పాలనలో నిర్బంధాలు ఉండవని అధికారంలో వచ్చిన వెంటనే ప్రగతి భవన్ కంచెలు తొలగించి ఇప్పుడు ఏకంగా ఇండ్ల లోకి వెళ్లి మరీ అరెస్టు చేయటాన్ని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటి తీవ్రంగా ఖండి స్తుందని అశోక్ రెడ్డి తెలిపారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలనీ, ఇటువంటి చర్యలతో విద్యార్థులు చేస్తున్న ఉద్యమాలను ఆప లేరని చెప్పారు. ఈ అక్రమ అరెస్టులను ప్రజాస్వా మ్యవాదులు, మేధావులు, విద్యార్థులు ఖండిం చాలని ఆయన ఎస్ఎఫ్ఐ తరఫున కోరారు.

అర్షద్ అలీ ఖాన్‌ను పరామర్శించిన కేటీఆర్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు, రాష్ట్ర మైనార్టీ కమీషన్ మాజీ డైరెక్టర్ మహ్మద్ అర్షద్ అలీ ఖాన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిలు పరామర్శించారు. అర్షద్ అలీఖాన్ తండ్రి నవాబ్ మహ్మద్ ఖుర్షిద్ అలీఖాన్ అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం ఆయన నివాసంలో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిలు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు ఆజాం అలీ, మసుల్లాఖాన్, మొహిద్, యూసుఫ్, బాబర్, మహ్మద్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అరెస్టును ఖండిస్తున్నాం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కూకట్ పల్లి

విద్యార్థుల అరెస్టును ఖండిస్తున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హెచ్‌సీయు లో పర్యావరణానికి ఎంతో మేలు చేసే 400 ఎకరాల భూమిని, ప్రభుత్వం అమ్మ డాన్ని వ్యతిరేకిస్తూ, విద్యార్థులు చేస్తున్న పోరా టంలో వారిని అమానుషంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. అక్కడ ఎన్నో జీవరాసులు, అరుదైన తాబేళ్ళు, జింకలు, నెమళ్ళు వంటి జంతువులకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల తీవ్ర నష్టం చేకూరుతుందని, భవిష్యత్ తరాలకు పర్యావరణము అందించాలని ముఖ్య ఉద్దేశంతో, విద్యార్థులు చేస్తున్న పోరాటాన్ని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం పునరాలోచించుకోవాలని సూచించారు.

ఘనంగా సూర్యావంశీ రూబెన్ పుట్టినరోజు సంబరాలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సూర్య వంశీ రూబెన్ జన్మదిన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తన జన్మదిన వేడుకలను కాంగ్రెస్ ఎంబీసీ చైర్మెన్ జెర్రిపాటి జైపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దరువు అంజన్న, మారెళ్ళ శ్రీనివాస్ శేర్లింగంపల్లి కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ మహమ్మద్ హమీద్ షరీఫ్ లను కలిసి జన్మదిన వేడుకలు జరుపుకుని ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సూర్య వంశీ రూబిన్ మాట్లాడుతూ నాకు ఎల్లప్పుడూ ప్రజల ఆశీస్సులు, పెద్దల ఆశీస్సులు నా మిత్రుల ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు శ్రీదేవి, రాజా, మనిష్ భాయ్, నవాబ్ సాబ్, బీరప్ప, సలీం, అంజిరెడ్డి, శివ, తదితరులు పాల్గొన్నారు.

' ఐలమ్మ పోరాటం యావత్ ప్రపంచానికి స్ఫూర్తి'

నేడు కోఠి మహిళా విశ్వ విద్యాలయం దర్బార్ హాల్‌లో చాకలి ఐలమ్మ ఆరున్నర అడుగుల ఎత్తైన చిత్రపటం ఆవిష్కరణ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వీరనారి చిట్యాల ఐలమ్మ చేసిన పోరాటం యావత్ ప్రపంచానికి స్ఫూర్తినిచ్చిందని రెవల్యూషనరీ ఉమెన్ హెల్త్ ఆర్గనైజేషన్ తెలిపింది. కోఠిలోని మహిళా విశ్వ విద్యాల యానికి ప్రభుత్వం వీరనారి చాకలి ఐలమ్మ విశ్వ విద్యాల యంగా నామకరణం చేసిన నేపథ్యంలో ఆ ధీర మహిళా వీరనారి చాకలి ఐలమ్మ పోరాట జీవితాన్ని ప్రతిబింబించే విధంగా ఆమె ఆరున్నర అడుగుల ఎత్తు కలిగిన చిత్ర పటాన్ని దర్బార్ హాల్‌లో ఆవిష్కరిస్తున్నామని తెలిపింది. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్ట ర్ పి.హరికాంత్, ఉపాధ్యక్షులు కె.చరణ్, కార్యదర్శి డాక్టర్ సౌజన్య తదితరులు ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 2న నేడు ఉదయం 11 గంటలకు విశ్వ విద్యాలయం వైస్‌ఛాన్సలర్, ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, ప్రముఖ సినీ నిర్మాత, దర్శకులు బి.నర్సింగ్ రావు, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ముఖ్య అతిథులుగా పాల్గొని, వారి చేతుల మీదుగా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం అహర్నిషలు కృషి చేసిన ఆమె పోరాట స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలని వారు పిలుపు నిచ్చారు. ఈ సదవకాశాన్ని కల్పించిన రాష్ట్ర సీఎం ఎ.రేవం త్ రెడ్డి, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ సూర్యధనంజయ్ లకు వారు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



● సన్న బియ్యం పంపిణీ ప్రారంభంలో బండి రమేష్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టే ఏ పథకమైన ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడిపై ఉందని కూకట్ పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం ప్రజా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం పార్టీ కార్యక ర్తలు, ఆనందోత్సాహాల మధ్య మూసాపేట యాదవ బస్తీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఏదైనా పని అనుకుంటే అది సాధించి చూపెడతారని అందుకు నిదర్శనం ఈ సన్న బియ్యం పం పిణీ కార్యక్రమన్నారు. దేశంలో ముందుగా ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించింది కాంగ్రెస్ అని ఈ పథకం ద్వారా లక్షల మంది పేద ప్రజలకు ఆర్థికంగా ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. పేద, వెనుకబడిన యువతకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు రాజీవ్ యువశక్తి పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ పథకం ద్వారా రూ.50 వేల నుండి నాలుగు లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తారని ఇందులో 75 శాతం సబ్సిడీ ఇవ్వ డం ద్వారా యువతకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఈ పథకాన్ని ఉపయోగించు కొని అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో కూకట్‌పల్లి నియోజక వర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మార్కెటింగ్ కమిటీ మెంబర్స్, టెంపుల్ కమి టీ మెంబర్స్ ,బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహి ళా అధ్యక్షురాలు , యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయ కులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సినీ పాట రాయటం మూర్ఖులు భావించేంత సులువు కాదు

● తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానంద రావు

నవతెలంగాణ-కల్చరల్

సినీ పాట రాయటం మూర్ఖులు భావించేంత సులువు కాదని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు అన్నారు. భాష సాధికారత జన సామా న్యానికి చేరువ అయ్యే సరళత పాట లో వుండాలని ఆయన పేర్కొన్నారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళా పోషకుడు సారి పల్లి కొండలరావు సారథ్యంలో యువ కళా వాహిని నిర్వహణలో విశ్వా వసు నామ సంవత్సర ఉగాది వేడుకలు లో తెలుగు భాష పై సినీ సాహిత్య ప్రభావం అంశం పై గోష్ఠి నాటి సినీ కవుల పేరుతో నేటి కవులకు పురస్కార ప్రదానం సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య నిత్యా నందరావు దాశరథి సినారె పేరిట పురస్కారం సుద్దాల అశోక్ తేజ కు మల్లాది రామకృష్ణశాస్త్రి, దేవులపల్లి కృష్ణ శాస్త్రి పేరిట పురస్కారం డాక్టర్ వోలేటి పార్వతీశంకు సముద్రాల పింగళి నాగేంద్రరావు పేరిట డాక్టర్ వీవీ రామా రావుకు వేటూరి సిరివెన్నెల పేరిట పురస్కారం ఆకెళ్ళ శివ ప్రసాద్ కి బహుకరించి మాట్లాడారు. నాడు సినీ పాటల రచయితలు సాహిత్యం విశేష ప్రజ్ఞా పాటవాలు కల వారు అని పేర్కొన్నారు. విశ్వనాథ సత్యనారాయణ జాషువా తాపీ ధర్మారావు వంటి పండితులు సినిమా రచయితలుగా వున్నా చిర కాలం కొనసాగలేదని తెలిపారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆరుద్ర దాశరథి ఆత్రేయ శ్రీశ్రీ సినారే వంటి వారు మాత్రం సినీమా గీత రచయిత లు గా స్థిర పడ్డారని వివరించారు. గీత రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ సినీ కవులు మాత్రమే కాదు జర్నలిస్టులు వక్తలు రచయితలు ఇలా ఎందరో భాషపై ప్రభావం చూపుతున్నారని ప్రజల పై అట్టి భాషా ప్రభావం ఉందన్నారు. డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ సినిమా సాహిత్యంలో పలుకుబడులు ప్రభావం ప్రజల పై ఉంటుందని చెప్పారు. సినిమా సాహిత్య చరిత్రలో మాటల్లో దృశ్యాన్ని దర్శింప జేసే కవులు తెలుగు నెలపై ఎందరో ఉన్నారని వివరించారు. సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించిన సభలో సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ స్వాగతం పలికారు. వేదిక పై సినీ జర్నలిస్టు రామారావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయులోని 400 ఎకరాల భూముల వేలాన్ని ఆపాలి

● డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్



నవతెలంగాణ-ధూల్‌పేట్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయు) పరిధిలోని 400 ఎకరాల భూముల వేలాన్ని ఆపాలని డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ యూని వర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూముల వేలం వేయడం సరికాదన్నారు. ఈ ప్రభుత్వ నిర్ణ యాన్ని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఖండిస్తుందన్నారు. భూముల వేలాన్ని అడ్డుకున్న విద్యార్థులను పోలీసులు దౌర్జన్యంగా అరెస్టులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను అమ్మడంతో ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వ ఆలోచన సరికాదని తెలిపారు. ప్రకృతిని కాపాడాల్సిన ప్రభుత్వాలే ప్రకృతిని నాశ నం చేస్తున్నారన్నారు. దీంతో అడవులలో ప్రకృతిని, భూమిలో నివసిస్తున్న జంతు వులు రోడ్డుపైకి వచ్చేస్తోన్నాయన్నారు. పెంచాల్సిన చెట్లను బుల్డోజర్లతో చెట్లును కొట్టి పడేస్తున్నారు. భూమిని ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఒడిగడితే ప్రజల ఆస్తులకు రక్షణ ఎక్కడిదని ప్రశ్నిం చారు. హెచ్సీయూ భూముల అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన ప్రశ్నించే వామపక్షాల విద్యార్థులకు నాయకులను అక్రమంగా నిర్బం ధాలు అరెస్ట్ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆ ఆలోచనలు మానుకొని ప్రజలకు ఉపయో గపడే విధంగా ప్రభుత్వాలు ఉండాలని డిమాండ్ చేశారు.

'గద్దర్‌పై కాల్పులు జరిపిన ఘటనపై విచారణ చేపట్టాలి'

● పలువురు వక్తల డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రజా గాయకుడు గద్దర్‌పై కాల్పులు జరిపిన సంఘ టనపై వెంటనే విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గద్దర్ పై 1997లో ఏప్రిల్ 6న కాల్పులు జరిగిన నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటూ ఈ నెల 6న బాగ్ లింగంపల్లిలోని సుందర య్య విజ్ఞాన కేంద్రంలో 'ప్రశ్నించే గొంతులు-పాలకుల అణిచివేత' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు గద్దర్ ఫౌండేషన్ తెలిపింది. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ఫౌండేషన్ వ్యవస్థాపకులు, కార్యదర్శి జి.వి.సూర్యకిరణ్, ప్రతినిధులు ఆర్.వెంకట్ రెడ్డి, బెల్లయ్య నాయక్, వి.ఎల్.శంకర్, ఆస శ్రీరాములు తదితరులు కలిసి ఈ సదస్సుకు సంబంధిం చిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ సదస్సులో ప్రముఖులు వేములపాటి అజయ్ కుమార్, మీనా కందస్వామి, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, గోరేటి వెంకన్న తదితరులు పాల్గొంటారని తెలిపారు.గద్దర్ తన ఆట పాటలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, గద్దర్ తన వారసత్వాన్ని కొనసాగించడం కోసం ఆయన జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గద్దర్ ఒక వ్యక్తి కాదని, ఒక వ్యవస్థ అని ప్రజల కోసం పని చేసిన గొప్ప వ్యక్తిని, ఆయన ఆలోచన, ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.

బీజేపీ నాయకులు బీసీల వైపా..అగ్రవర్ణాల వైపా..?



● బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

బీసీల పక్షపాతి దేశ ప్రధాని నరేంద్రమోడీ బీసీ అని గొప్పగా చెప్పుకునే బీజేపీ నాయకులు మరి ఇప్పుడు తెలంగాణలో బీజేపీ నాయకులు బీసీల వైపు ఉంటారో.. అగ్రవర్ణాల వైపు ఉంటారో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, వారు ఎవరి పక్షాన నిలబడి పోరాడుతా రోనని, తెలంగాణ సమాజం అంతా గమనిస్తుందని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని నెరవేర్చినటు వంటి కాంగ్రెస్ బీసీల దశాబ్దాల కల అయిన బీసీ రిజర్వేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు యావత్ తెలంగాణ బీసీ సమాజం కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటుందన్నారు. మంగళవారం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ లో బీసీ సం ఘాల నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడా రు. దేశంలో కులగణన చేపడతామని చెప్పి మూడు సార్లు ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రమోడీ ఆ హామీని నెరవేర్చకుండా కనీసం కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయని దుస్థితిలో ఉన్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ప్రక టించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం అసెంబ్లీలో బీసీ రిజర్వే షన్లను 42 శాతానికి పెంచుతూ తీర్మానం చేయడం హర్ష ణీయమన్నారు. తెలంగాణలో ఉన్న అన్ని పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సంఘాల నాయకులు బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరగనున్న మహా ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు ఎవరిచ్చే బిక్ష కాదని, ఇది బీసీల హక్కు అని, పార్ల మెంటుపై ఒత్తిడి పెంచి 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం పొందేలా పోరాడాలని అన్ని పార్టీలు, సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, ఓబీసీ మేధావుల ఫోరం జాతీయ అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ, ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బడేసాబ్, బీసీ పొలిటికల్ జేఏసీ యువజన విభాగం అధ్యక్షులు చిం తపల్లి సతీష్, నాయకులు వి.వి.గౌడ్, అంజన్న యాదవ్, దేవర శివ, రాఘవేందర్, రామన్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలి

● అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్ అన్నారు. అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం అదే తరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వే షన్లకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. మంగళ వారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తరతరాలుగా అన్యాయానికి గురువుతున్న అణగారిన వర్గాలకు న్యాయం చేసేందుకు సీఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర శాసన సభ చేసిన తీర్మానా న్ని ఈ పార్లమెంట్ సమావేశాలల్లో ఆమోదింపజేయాల్సిన బాధ్యత రాష్ట్ర బీజేపీ నాయకులదేనని, లేకపోతే వారిని రాష్ట్రంలో ఎక్కడిక క్కడ అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్ లో బీసీ రిజర్వేషన్లు చేర్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేష న్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరారు. బీజేపీ రాష్ట్రంలో బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వగా, ముస్లిం రిజర్వేషన్ల సాకుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్వంద విధానాలు అవలంబిస్తోంద న్నారు. దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు 6 మంది ఎంపీలదేనని తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లును ఆమోదింప జేసేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని, బీజేపీ అగ్ర నాయకులను ఒప్పించే బాధ్యతను తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీసీ ఉద్యమ నాయ కుడిగా చెప్పకునే రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యలు తీసుకోవాలని తెలిపారు. లేకపోతే వారు తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన వారవు తారని, వారికి రాష్ట్రంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరిం చారు. కులగణన విషయంలో మోసం చేసినట్లు 42 శాతం బీసీ రిజర్వేషన్ విషయంలో మోసం చేస్తే సహించేది లేదన్నారు. 42 శాతం బీసీ బిల్లును పార్లమెంట్ ఆమోదించిన అనంతరమే కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణాలో అడుగు పెట్టాలని, లేనట్లయితే ప్రజలు వారిని తరిమితరిమి కొడ తారని ఆయన హెచ్చరించారు. ఎన్నికల సమయంలో బీసీ సీఎం అంటూ నినాదాలిచ్చిన బీజేపీ ఇప్పుడు మాత్రం బీసీలకు సర్పంచ్ సీట్లు దక్కకుండా చేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ఆమోదం పొందనట్లయితే తెలంగాణాలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. బీసీ బిల్లును ఆమోదించడంతో పాటు దేశవ్యాప్తంగా జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీ బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలి



● నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలోని బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయా రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెం ట్ లో ప్రవేశపెట్టి వెంటనే ఆమోదించాలని, ఆమోదించిన బిల్లులను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని నేషనల్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు.బీసీ ఆజాదీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జక్కని సంజ య్ నేత అధ్యక్షతన చేపట్టిన సత్యాగ్రహ దీక్షలో సీపీఐ ఢిల్లీ కార్యదర్శులు శంకర్ లాల్, కేహర్ సింగ్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఎంపీ రాజారాం సింగ్, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ప్రొఫె సర్ సూరజ్ మండల్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర పటేల్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాతీయ కో-ఆర్డినేటర్ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆళ్ల రామకృష్ణ మాట్లాడు తూ స్వాతంత్ర్య భారతదేశంలో బీసీలను అగ్రవర్ణ పాలకు లు అన్ని రంగాలలో అణచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల హక్కుల సాధన కోసం దేశ వ్యాప్త పోరాటాన్ని ముమ్మరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, ఆల్ ఇండి యా ఓబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు కిరణ్ కుమార్, నాయ కులు చాపర్తి కుమార్, డా.పరికిపండ్ల అశోక్, సతీష్ పటేల్, కొంగర నరహరి తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


(ఫైల్)

నవతెలంగాణ-ఘట్కేసర్

రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఘట్కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌కు చెందిన కొండల అశోక్ యాదవ్ (42) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఘట్కేసర్-భీబీనగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య అంకుశాపూర్ సమీపంపలోని 219/11 మైలురాయి వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

హెచ్‌సీయూ విద్యార్థులకు మణిశర్మ మద్దతు



నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) సమీపంలోని కంచ గచ్చిబౌలి భూముల విషయంలో వివాదం జరుగుతోంది. అసలు ప్రభుత్వం ప్రజా భూములను పరిరక్షించాల్సింది పోయి ఆక్రమణకు మద్దతు ఇవ్వడం ఏమిటని సామాజికవేత్తలు, రాజకీయవేత్తలు, విద్యావేత్తలు, విద్యార్థులు, వివిధ సంఘల నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ ప్రధాన రహదారి వద్ద కాలినడకకు వచ్చే ప్రముఖుల్లో కొందరు విద్యార్థుల ఉద్యమానికి మద్దతు ఇచ్చినట్టు బీఆర్ఎస్వీ నాయకులు ప్రకటించారు. అందులో ప్రముఖ సినీ సంగీత దర్శకులు మణిశర్మ, ఉన్నారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

- హెచ్‌సీయూ భూముల అమ్మకాన్ని నిలిపివేయాలి
- విద్యార్థులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్
- ఓయూలో విద్యార్థి సంఘాల భారీ నిరసన ర్యాలీ



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములను కార్పొరేట్ వర్గాలకు ప్రభుత్వం ధారాదత్తం చేసే అనాలోచితమైన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని. అదేవిధంగా ఓయూలో అప్రజాస్వామిక సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ.. ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ (విజృంభణ), ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘాలు మంగళవారం ఓయూలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట.లక్ష్మణ్, పీడీఎస్‌యూ(వీ) విజయ్, పీడీఎస్‌యూ నవీన్ నాయకులు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూములను కార్పొరేట్ వర్గాలకు దారాదత్తం చేసే అనాలోచితమైన నిర్ణయాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌కి ఆక్సిజన్ అందించే ఆ యూనివర్సిటీ భూములను వేలం వేయడం ద్వారా బయోడైవర్సిటీనీ దెబ్బతిస్తున్నారని తెలిపారు. రాత్రికి రాత్రి బుల్డోజర్‌లు పెట్టి భూమిని చదును చేస్తున్నారని విద్యార్థులపై పోలీస్‌లు కర్కశంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నిరసన తెలియ జేసిన విద్యార్థినులు అని చూడకుండా పోలీస్‌లు హింసించారని పేర్కొన్నారు. అమ్మాయిలను రాత్రి వరకు పోలీస్ స్టేషన్‌లో ఉంచుకొని ఇంకోసారి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనమనీ రాసి ఇవ్వాలని పోలీసులు ఒత్తిడి తీసుకు రావడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ముఖ్యమంత్రి ప్రజాస్వామ్యానికి అంబాసిడర్‌గా చెప్పుకున్న మీరు ఈ నిర్బంధాన్ని ఏమంటారని ప్రశ్నించారు. మీరు చెప్పిన ప్రజాస్వామ్యం ఎక్కడ ఉందన్నారు. శాంతియుతమైన పద్ధతుల్లో నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల పైన కేసులు పెట్టి జైలుకి తరలించిన విద్యార్థి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొదట అగ్రికల్చర్ యూనివర్సిటీ భూమి 100 ఎకరాలు హై కోర్టు పేరుతో లాక్కుందని అన్నారు. ఇప్పుడు హెచ్‌సీయూ భూముల మీద కన్ను పడిందని అన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వ భూములు అమ్మవద్దని ప్రకృతినీ కాపాడాలని గొప్పగా మాట్లాడి నేడు అధికారంలో రాగానే మరోలా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు ర్యాలీగా తార్నాక వైపు వెళుతున్న సందర్భంగా పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్, ఓయూ అధ్యక్షులు ఉదయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, ప్రశాంత్ జిల్లా కమిటీ సభ్యులు సహన, విఘ్నేష్, వేమన, సాయి కిరణ్, శ్రీరామ్ భగత్ ఉపాధ్యక్షులు అజయ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు, రాష్ట్ర కార్యదర్శి విజయ్, సీనియర్ నాయకురాలు సత్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార నరేష్, క్రాంతి, ఓయూ కార్యదర్శి సత్య, పీడీఎస్‌యూ(వీ) పవన్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ఏర్పాట్లు



- ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

సీతాఫల్‌మండీలో డా. బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్‌ల కొత్త విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని, వివిధ సంస్థలు సద్వినియోగం చేసుకొని మహనీయుల స్ఫూర్తి ప్రజలకు చేరేలా కృషి చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫల్‌మండీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సీనియర్ నాయకుడు జి. చంద్రశేఖర్ నేతృత్వంలోని కొత్త కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలుసుకున్నారు. వారిని ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ అభినందించారు. అణగారిన వర్గాల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని, తమ ప్రయత్నాలు అందరికీ చేర్చడంలో సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. చంద్రశేఖర్ నేతృత్వంలోని కొత్త కమిటీ పేదల సంక్షేమానికి కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో నేతలు గడ్డం ప్రసాద్, చలపతి, గిరి, కృష్ణ, లలిత, రాజేశ్వర్ రావు, గోవర్ధన్, విద్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నవతెలంగాణ-శామీర్‌పేట్

రోడ్డుపై సెల్ ఫోన్ పడిపోతే తీసుకుంటుండగా ఎర్టిగా వాహనం ఢీ కొని ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామానికి చెందిన పొట్ట ప్రవీణ్ (23) డెలివరీ బోయ్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మర్చి 31న రాత్రి 10:30గంటల సమయంలో హైదరాబాద్‌లో తన విధులు ముగించుకొని తన ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గ మధ్యలో శామీర్ పేట్ మండలం తుర్కపల్లి గ్రామ పరిధిలోని మహేశ్ ఫైర్ వర్క్స్ గోదాము వద్ద తన సెల్ ఫోన్ రన్నింగ్‌లో రోడ్డు మీద పడిపోవడంతో బైక్ పక్కన ఆపి ఫోన్‌ను తీసుకునే సమయములో తుర్కపల్లి వైపు నుంచి ఒక ఎర్టీగా వాహనము అతి వేగంగా అజాగ్రత్తగా సెల్ ఫోన్ తీసుకుంటున్న ప్రవీణ్ ఢీ కొట్టింది. ప్రవీణ్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయము మృతిని అన్న స్వామికి తన స్నేహితుని ద్వారా సమాచారం అందగా వెంటనే ఘటన స్థలానికి వచ్చి ఫిర్యాదు చేశారని ఈ మేరకు జీనోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రవీణ్ మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తము గాంధీ హాస్పిటల్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌లు ఎంతో ఉపయోగకరం



- మాజీ మంత్రి బాబుమోహన్

నవతెలంగాణ-బేగంపేట్

వైఎంసీఏ నుంచి ఒలంఫిక్స్ వెళ్లిన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని, అందుకే క్రీడలకు వైఎంసీఏ పుట్టినిళ్లు లాంటిదని, వారికి సమ్మర్ క్యాంప్‌లు ఎంతో ఉపమోగపడతాయని మాజీ మంత్రి, ప్రముఖ నటుడు బాబూమోహన్ అన్నారు. సికింద్రాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుంచీ మే 31వ తేదీ వరకు జరుగనున్న సమ్మర్ క్యాంప్ బ్రోచర్‌ను మంగళవారం ఆయన వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు జయకర్ డేనియల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థుల్లో క్రీడల్లో ఆసక్తిని పెంచేందుకు ఆవిర్భవించి ఎంతో మంది ఉత్తమ క్రీడాకారులను వైఎంసీఏ తయారు చేసిందని అన్నారు. తాను చదువుకునే రోజుల నుంచి వేసవి సెలవులు వస్తే చాలు ఇంట్లో అసలు ఉండేవాణ్ణికాదని ఎక్కడ గేమ్స్, స్పోర్ట్స్ ఉంటే అక్కడికి వెళ్లేవాడినని గుర్తు చేసుకున్నారు. క్రీడలతో పాటు చదువులోనూ క్లాస్ ఫస్ట్ వచ్చేవాడినని అలా అన్నింటిలో ముందుంటూ వచ్చానన్నారు. 1800 సినిమాల్లో ఎలా నటించానో తనకే తెలియదని ఇతర భాషా చిత్రాల్లో నటించిన తెలుగు వాళ్లలో మొదటి వాడినని అన్నారు. ఈ నెల 26వ తేదీ సమ్మర్ క్యాంపులు మొదలవుతాయని స్పోర్ట్స్, గేమ్స్, ఆర్ట్స్, మ్యూజిక్, లైఫ్ స్కిల్స్ లాంటి 24 అంశాల్లో శిక్షణ ఉంటుందని జయకర్ డేనియల్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిక్షణ ఉంటుందన్నారు. పిల్లల్లో ఉండే ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. పిల్లలు మొబైల్ ఫోన్స్ గేమ్స్ లాంటి వాటికి అడిక్ట్ కాకుండా ఇలాంటి క్రీడలకు ప్రాధాన్యతన ఇవ్వాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. మరిన్ని వివరాలకు 9177865215 నెంబర్‌కు కాల్ చేసి సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎంసీఏ కార్యదర్శి లెనార్డ్ ప్రతినిధులు కల్యాణ్, సాల్మన్‌రాజు, రవిబాబు పాల్గొన్నారు.

మాదిగలకు నాలుగు మంత్రి పదవులివ్వాలి



- పల్లె కిష్టయ్య

నవతెలంగాణ-బంజారాహిల్స్

మంత్రివర్గ విస్తరణలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు నాలుగు మంత్రలు పదవులు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు పల్లె కృష్ణ డిమాండ్ చేశారు. మాంగవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగల చిరకాల ఆకాంక్ష వర్గీకరణ చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో మంత్రి వర్గంలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ హయాంలో మాదిగలకు న్యాయం జరిగిందని అదే బాటలో రేవంత్ రెడ్డి కొనసాగుతారని మాదిగలు భావిస్తున్నారని అన్నారు. అంబేద్కర్ అభయ హస్తం ద్వారా మాదిగలకు చేయూత ఇవ్వాలని కోరారు. గురుకులాలలో మాదిగలకు ప్రాధాన్యత నివ్వాలని, 32 లక్షల మంది జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి మంత్రి పదవులు ఇచ్చి న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, పెంటయ్య, చంద్ర కిరణ్, లక్ష్మయ్య, భాస్కర్ మాదిగలు పాల్గొన్నారు.

మధ్యాహ్నం ఉచిత భోజనం, చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



- అందరితో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్

పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం చాల గొప్పదని, మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం సనత్‌నగర్‌లోని బికేగూడ పార్క్ వద్ద, శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న మిత భోజన పంపిణీ, చలివేంద్రంలను ఆయన ప్రారంభించారు. నేటి నుంచి సుమారు రెండు నెలల పాటు ఈ కేంద్రాలు కొనసాగుతాయని నిర్వహకులు వివరించారు. పలువురికి భోజనం వడ్డించడమే కాకుండా ఆయన కూడా భోజనం చేసి ఎంతో రుచికరంగా, నాణ్యతతో బోజనాన్ని ఉచితంగా వడ్డిస్తూ, అనేకమంది ఆకలి తీరుస్తున్న నిర్వహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 15 ఏండ్ల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రతి రోజు సుమారు 250 మందికి దాతల సహకారంతో ఇంటి బోజనాన్ని మరిపించే విధంగా ఎంతో రుచికరంగా బోజనాలు వడ్డిస్తూ, అనేకమంది ఆకలిని తీరుస్తున్నారని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పార్థ సారధిని, కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలను ప్రశంసించారు. సీనియర్ సిటిజన్స్ చేపట్టే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఇప్పటి వరకు అందిస్తూ వచ్చానని, ఇకముందు కూడా ఉంటాయని హామీ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 65 నుంచి 95 ఏండ్లు వయసు కలిగిన 170 మంది సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్‌గా ఏర్పడి, అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ, హెల్త్ క్యాంప్‌ల నిర్వహణ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. తమ వయసును సైతం లెక్కపెట్టకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్స్ తమ ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సేవా కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పాల్గొనే కౌన్సిల్ లోని పలువురు సభ్యులు కరోనా సమయంలో మరణించారని, వారు గుర్తుకొచ్చినప్పుడు తన మనసుకు ఎంతో బాధ కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్‌నగర్, అమీర్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, డా. సుష్మ, ప్రియాంక, సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు దూబే, మాజీ అధ్యక్షులు మాణిక్ రావ్ పాటిల్, సభ్యులు సహదేవ్ గౌడ్, కృష్ణ దేవ్ గౌడ్, కృష్ణా రెడ్డి, జె.ప్రసాద్, శంకర్, రామలింగం, అనంతరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కర్ణాకర్ రెడ్డి, ఖలీల్, గోపిలాల్ చౌహాన్, కూతురు నర్సింహ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నియోజకవర్గ నాయకులు



నవతెలంగాణ-బేగంపేట్

మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఉగాది, రంజాన్ పండుగలు రెండు వరుసగా రావడంతో మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్ పేట, సనత్‌నగర్, రాంగోపాల్‌పేట డివిజన్ తదితర ప్రాంతాలకు చెందిన హిందువులు, ముస్లీంలు పెద్ద సంఖ్యలో కలిసి శాలువాలు, పుష్ప గుచ్చాలతో సత్కరించి ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బన్సీలాల్ పేటకు చెందిన అబ్బాస్ అందజేసిన షీర్ కుర్మా (సేమియా)ను ఎమ్మెల్యే సేవించారు. తనను కలిసిన వారికి ఆయన ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్ పేట కార్పొరేటర్ కుర్మ హేమలత, బన్సీలాల్ పేటకు చెందిన ముస్లీం నాయకులు రజాక్, జావీద్, షరీఫ్, జహంగీర్, సనత్‌నగర్‌కు చెందిన జమీర్, వసీం, ఇబ్రహీం, రాంగోపాల్ పేట డివిజన్‌కు చెందిన బెంగాలీ సమాజ్ ప్రతినిధులు పబ్బా ప్రకాష్, అబ్బుల్, మోహి దుల్, బాపి, బన్సీలాల్ పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు లక్ష్మీపతి, బలరాం, కుమార్ యాదవ్, అరుణ్ గౌడ్, నాగభూషణం, దేశపాక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ ఉద్యమకారులకు తాము అండగా నిలుస్తామని, వారి సాధక బాధకాల పట్ల ఉద్యమ నాయకుడిగా తనకు పూర్తి అవగాహన ఉందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డా. చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశం ఉద్యమకారులకు 250 గజాల స్థలం 25 వేల పెన్షన్స్ సౌకర్యం తోపాటు సంక్షేమం బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండుతో ఏప్రిల్ 21న జరగబోయే ప్లీనరీ సమావేశ సంబంధించిన పోస్టర్ రిలీజ్ కార్యక్రమం మంగళవారం ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లారి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సితాఫల్‌మండీలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పద్మారావు గౌడ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యులు జానకి రెడ్డి, రాంబాబు ముదిరాజ్, దయానంద్ గంగాపుత్ర, జగన్ యాదవ్, ఆర్కే భూపాల్, లక్ష్మణ్, నరసింహ చారి, అమర్, సత్తన్న, నాగరాజు, శివ్ నేత, రాజేష్, లలిత, సరోజినీ పాల్గొన్నారు.

శ్రీలంక సెమినార్‌లో ప్రసంగించిన ఎం.మాధవి



నవతెలంగాణ-ఓయూ

ఓయూ జంతుశాస్త్ర విభాగం మాజీ హెచ్ఓడీ ప్రొ. ఎం. మాధవి శ్రీలంకలో మార్చి 27, 28 తేదీల్లో నిర్వహించిన 'మూడో అంతర్జాతీయ సదస్సు-అడ్వాన్స్డ్ మెటీరియల్స్ ఫర్ క్లీన్ ఎనర్జీ అండ్ హెల్త్ అప్లికేషన్స్'లో ప్రత్యేక ఉపన్యాసాన్ని ఇచ్చారు. ఈ సదస్సును యూనివర్సిటీ ఆఫ్ జాఫ్నా వెస్టర్న్ నార్వే యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్, నార్వే సంయుక్తంగా నిర్వహించాయి. ఆమె 'గ్రీన్ సింథసైజ్డ్ సిల్వర్ నానోపార్టికల్స్ మొక్కల మిశ్రమాలు-పర్యావరణానికి అనుకూలమైన లార్విసైడ్స్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా, నిర్వాహకులు ప్రొ.ఎం.మాధవికి ప్రత్యేకంగా సత్కరించారు. ఓయూ అంతర్జాతీయ వేదికలో, భారతదేశం వెలుపల ప్రతినిధ్యం వహించడం తాను ఎంతో గౌరవంగా భావిస్తున్నట్టు ప్రొ.ఎం. మాధవి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆమె యూనివర్సిటీ ఆఫ్ జాఫ్నా ఉపకులపతి, వెస్టర్న్ నార్వే యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ డైరెక్టర్ అండ్ డీన్‌లతో విలువైన చర్చలు జరిపారు. అక్కడి జంతుశాస్త్ర విభాగాన్ని సందర్శించి, అక్కడి అధ్యాపకులతో సహకార పరిశోధన అవకాశాలను అన్వేషించారు.

జై బాపు, జై భీమ్ కార్యక్రమం విజయవంతం



నవతెలంగాణ-బేగంపేట్

తెలంగాణ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో ఏఐసీసీ 'జై బాపు, జై భీమ్, జై రాజ్యాంగం' కార్యక్రమాన్ని సనత్‌నగర్ ఇన్‌చార్జి డా. కోటా నీలిమ నేతృత్వంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మార్చి 29న బన్సీలాల్‌పేట్, రామ్‌గోపాల్‌పేట్, మొండామార్కెట్ డివిజన్‌లలో, ఏప్రిల్ 1, 2025న సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్ డివిజన్‌లలో నిర్వహించారు. హాజరైన వారు సమానత్వం, న్యాయం, రాజ్యాంగ విలువలను ప్రోత్సహించే ప్రమాణాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు హేమంత్ సింగ్, అనురాగ్, హనీఫ్, చిరంజీవి, రజినీకాంత్, ఎస్ఎస్ రావు, అబ్బాస్ షరీఫ్, విజయ్ ఎలీషా, సీనియర్ నేతలు, మహిళలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ, డా. బీఆర్. అంబేద్కర్ సిద్ధాంతాలను పునరుద్ఘాటిస్తూ.. రాజ్యాంగంపై నిబద్ధతను మరింత బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.



నవతెలంగాణ-కాప్రా

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మెన్, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ మల్కా కొమురయ్యని గ్రీన్ పీస్ ఎన్విరాన్మెంట్, వాటర్ హార్వెస్టింగ్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వంగా కలిసారు.

పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-బోడుప్పల్

మైనర్ పిల్లలతో భిక్షాటన చేయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి ఎస్సై నర్సింగ్ రావు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం మేడిపల్లి పీఎస్ పరిధిలోని పీ అండ్ టీ కాలనీలో పెట్రోలింగ్ చేస్తుండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనపడడంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. అతను గుంటూరు జిల్లా వినుకొండకు చెందన తిరుపతిగా తెలిసింది. అతను 9 మంది మైనర్ పిల్లలతో రోజు రహదారులు, దుకాణాల వద్ద భిక్షాటన చేయించడం అలా వచ్చిన వాటిలో నుంచి సదరు పిల్లలకు రూ.150 చొప్పున చెల్లిస్తున్నాడని తెలిసింది. అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు. కాగా మైనర్ పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకు అప్పగించామని తెలిపారు.

మల్లేశం గౌడ్‌కు జర్మనీ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు చింతల మల్లేశం గౌడ్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి జర్మనీ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం సంతోషంగా ఉందని సినీనటుడు సుమన్ అన్నారు. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చింతల మల్లేశం గౌడ్‌ను సినీనటుడు సుమన్‌తో పాటు పలువురు నేతలు ఘనంగా సత్కరించారు. పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాల ఏర్పాటుతో పాటు దేశంలోని పలు ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తనను గుర్తించి జర్మనీ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇవ్వడం మరింత బాధ్యతను పెంచిందని మల్లేశం గౌడ్ అన్నారు.

'సాంకేతిక పురోగతితో అనేక లాభాల'

- తెలుగు రాష్ట్రాల్లో ఏఐ ఆధారిత నాన్-ఇన్వేసివ్ చికిత్సను ప్రారంభించిన కేర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ, ఏపీలోని రోగులకు న్యూరో, మూత్ర సంబంధిత, జీర్ణాశయ సంబంధిత సమస్యలకు నాన్-ఇన్వేసివ్ చికిత్స అందించేందుకు కేర్ ఆస్పత్రిలో నూతన చికిత్సా విధానాన్ని కేర్, జోగో హెల్త్ సంయుక్తంగా కలిసి కృత్రిమ మేధస్సు (ఏఐ), వినూత్న చికిత్సా విధాననికి శ్రీకారం చుట్టారు. అమెరికాలో అభివృద్ధి చేయబడిన జోగో హెల్త్ సాంకేతికత, ప్రత్యేకమైన వేరబుల్ ఎలక్ట్రో మయోగ్రాఫీ (ఈఎంజీ) సెన్సార్లు, కృత్రిమ మేధస్సు వినియోగంతో తక్షణ బయోఫీడ్‌బ్యాక్ ద్వారా నరాల పనితీరును మెరుగుపరిచేలా రూపొందించారు. హార్వర్డ్ మెడికల్ స్కూల్, మయో క్లినిక్‌తో పరిశోధనల ద్వారా పరీక్షించిన ఈ సాంకేతికత ఇప్పటికే అమెరికా, కెనడా, ఆసియాలోని ప్రముఖ ఆస్పత్రుల్లో ఉపయోగంలో ఉందనీ సంస్థల ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్, డా. నిఖిల్ మాథూర్ మాట్లాడుతూ.. సాంకేతిక ఉపయోగించి నిపుణుల సహకారంతోపాటు 'జోగో హెల్త్‌తో కలిసి పని చేయడం వల్ల రోగులకు మెరుగైన చికిత్స అందించగలుగుతున్నాం అన్నారు. ఇది నాన్-ఇన్వేసివ్, సమర్థవంతమైన అందుబాటులో ఉండే చికిత్సా విధానమాని తెలిపారు. కేర్ జోనల్ సీఓఓ బిజు నాయర్ మాట్లాడుతూ.. కేర్ ఎప్పటికప్పుడు నూతన వైద్య సాంకేతికతలను రోగులకు అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. జోగో హెల్త్ సహ వ్యవస్థాపక అధ్యక్షులు శివ నటరాజ్ మాట్లాడుతూ.. కేర్ హాస్పిటల్స్‌తో కలిసి పని చేయడం ఆనందంగా ఉందన్నారు. సాంకేతికత ద్వారా, రోగుల రికవరీ వేగంగా జరిగే అవకాశం ఉందాని సూచించారు. బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్‌లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డా. ఆకాశ్ చౌదరి (క్లినికల్ డైరెక్టర్ సీనియర్ కన్సల్టెంట్ గాస్ట్రోఎంటరాలజీ), డా. ఉమేశ్ టీ (క్లినికల్ డైరెక్టర్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజీ), డా. పి.వంశీ కృష్ణ (సీనియర్ కన్సల్టెంట్ హెచ్ఓడీ యూరోలాజీ), వారి బృందం, విభాగాధిపతులు సీనియర్ డాక్టర్లు, జోగో హెల్త్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
11
హైదరాబాద్
HMDA
బుధవారం | ఏప్రిల్ 02, 2025 | www.navatelangana.com

శ్రీరాం కాలనీలో సన్న బియ్యం పంపిణీ



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రజాపాలన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క,మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డిల ఆదేశం మేరకు జల్ పల్లి మున్సిపల్ శ్రీరామ్ కాలనీలో ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ కేంచే లక్ష్మీనారాయణ, కో ఆర్డినేటర్ షేక్ జాంగిర్, రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మస్న రవికుమార్,నాయకులు నవీన్ గౌడ్, బాబు, బాలాజీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శాంతమ్మ, ఆనంద్,మేకల ప్రేమలత, గద్దె మంజుల, ఖడ్గం శ్రీహరి, మధుసూదన్ రెడ్డి, సట్లపల్లి వెంకటేష్, బొజ్జ రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పండుగ సందర్భంగా వైశ్యా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అష్టలక్ష్మి ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసోసియేషన్ పూర్వాధ్యక్షులు దండు రజు, గౌరవ అతిథిగా అష్టలక్ష్మ ఆలయం చైర్మెన్ సురేష్ కుమార్ సోమ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షులు దేవేందర్ సముద్రాల, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, దళిత కోశాధికారి బాలకృష్ణ, జిల్లా వైశ్య యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నరేష్ గుప్తా మాడిశెట్టి, ప్రధాన కార్యదర్శి నాగార్జున, కోశాధికారి ఉదయభాస్కర్ నరాబు, ప్రాజెక్ట్ అడ్వైజర్ బొగ్గారపు శరత్, బొగ్గారపు అరవింద్ గుడిశట్టి సేరి, ప్రాజెక్టు చైర్మెన్ వినీత్, ఉప్పల విష్ణు, నార్ల సందీప్ చొప్ప ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సంతోష్ సముద్రాల వేటూరి శివకృష్ణ పంపటి ప్రశాంత్ నాగ బండి నరేష్ గట్టు వీరితోపాటు నల్ల సంతోష్ కుమార్ భాషక శ్రీనివాస్ బొగ్గరపు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కొత్తపేట

భవన నిర్మాణ కార్మికుల
సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసింది కాంగ్రెస్సే

- ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి, ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసింది కాంగ్రెస్ అని ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యదర్శి, ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట పరిధి ఆస్బెస్టస్ కమాన్ వద్ద భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నాయకులు బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. సంక్షేమ బోర్డులో ఉన్న కోట్లాది రూపాయలు దిగమింగారని ఆరోపించారు. భారతదేశంలో అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉండాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు యూపీఏ ప్రభుత్వ హయాంలో మాజీ ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ నాయకత్వంలో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్మికుల,కష్టజీవుల, శ్రమజీవుల, మైనార్టీల,దళితుల పక్షాన నిలబడేది కాంగ్రెస్ అని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జనరంజకమైన ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదవారికి న్యాయం జరుగుతుందన్నారు. 65 సంవత్సరాలు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికునికి కనీసం సంక్షేమ బోర్డు నుంచి పదివేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలతోపాటు పింఛన్ విషయాన్ని ఐ.ఎన్.టి.యు.సి. రాష్ట్ర కమిటీ అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, జాతీయ అధ్యక్షులు అంబటి కష్ణమూర్తి,కార్మిక నాయకులు చింతల నాగరాజు,జాతీయ కార్యదర్శి భూదాల అమర్ బాబు,నడిమింటి నాగరాజుల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల బందం తో కలిసి సీఎంను కలిసి వినతిపత్రం త్వరలోనే అందజేస్తామని తెలిపారు. హైదరాబాద్ జంట నగరాలలో భవన నిర్మాణ కార్మికులకు అడ్డాలు ఏర్పాటు చేసి కనీసం వసతులు కల్పించాలని కోరుతామన్నారు.ఈ కార్యక్రమంలో చెట్టినాడ్ సిమెంటు హైదరాబాద్ బ్రాంచ్ మేనేజర్ మాధవరెడ్డి, కూకట్‌పల్లి డివిజన్ అధికారి ఆర్.మదన్, సాయిలు కార్మికులు పని ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,రక్షణ వివరాలు వివరించారు.ఈ కార్యక్రమంలో జాతీయ ఓబీసీ ఉపాధ్యక్షులు ఎమ్.జనార్ధన్, సీనియర్ మైనార్టీ నాయ కులు సయ్యద్ రషీద్,భవన నిర్మాణ కార్మిక సంఘం అడ్డా అధ్యక్షులు ఎండి.యూసుఫ్, సభ్యులు ఆరోగ్యరెడ్డి, చంద్రయ్య, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి

- జేఎన్టీయూహెచ్ విద్యార్థి సంఘాల నేత ఎరవెల్లి జగన్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం యూనివర్సిటీ భూము ల అమ్మకాన్ని విరమించుకోవాలని జేఎన్టీయూ హెచ్ విద్యార్థి సంఘాల నేత, తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ ఎరవెల్లి జగన్ అన్నారు. మంగళవారం జేఎన్టీయూహెచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 400 ఎకరాల భూమి అమ్మకాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములను విద్యార్థుల అవసరాలకు, భవిష్యత్‌కు కషి చేయాలి కానీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చేస్తున్నా ప్రయత్నాన్ని విరామించుకోవాలని డిమాండ్ చేశారు. వేలం ఆపాలని పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకుల అరెస్ట్‌లను తీవ్రంగా ఖండించారు. వక్ష సంపాదను కాపాడాలని, హెచ్సీయు లో అర్థరాత్రి కూడా బుల్డజర్లతో చెట్లను కూల్చడం వల్ల అక్కడి నెమళ్ల అర్తనాదలు హృదయపూర్వకంగా ఉన్నాయన్నారు. పర్యావరణ విధ్వంసన్ని వెంటనే ఆపి, హెచ్‌సీయూ అటవీ సంపాదను, జీవవైవిద్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూములను వేలం ఆపకపోతే భారత దేశ వ్యాప్తంగా అన్ని విశ్వ విద్యాలయాలను కలుపుకొని పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పేరు మార్పిడి

నేను అనగా కొట్టరాతిల్ జయశ్రీ చంద్రన్, భర్త: కేశవన్ రామచంద్రన్, వయస్సు: 66సం॥లు, నివాసం: ఇ.నెం.29-70/1, నేరేడ్‌మెట్, డైట్ కాలేజి ఎదురుగా, న్యూ విద్యానగర్, మల్కాజిగిరి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం. ప్రస్తుతం నేను నా పాత పేరు కొట్టరాతిల్ జయశ్రీ చంద్రన్ కు బదులుగా నూతనంగా **నా పేరును కొట్టరాతిల్ జయశ్రీ గా న్యూమరాలజీ ప్రకారం మార్చుకున్నాను.**

హెచ్‌సీయూ భూములకు ప్రత్యామ్నాయంగా గాజులరామారం భూములను తీసుకోండి.

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట

హెచ్‌సీయూ 400ఎకరాల భూములను అభివధి నిమ్మితం టీజీఐఐసికి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించాడన్ని అన్ని ప్రధాన ప్రతిపక్షాలు,విద్యార్థి సం ఘాలు, మేధావులు, పర్యావరణ వేత్తలు అభ్యంతరం తెలుపుతుంటే మొండిగా పోవడం ప్రజా పాలన అనిపించుకోదని అది ప్రజల్లో వ్యతిరేకత భావం ఏర్పడుతుందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. కావున సీఎం ఆ నిర్ణయాన్ని వెనక్కితీసుకొని ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచిం చాలన్నారు. అభివద్ధి ఒక్క ప్రాంతంలోనే కేంద్రీకతం కాకుండా నగర వ్యాప్తంగా చేస్తామని సీఎం చెప్పారని కావున కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అది నేడు కబ్జాలకు గురై ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తుందని, కావున సీఎం రేవంత్ రెడ్డి గాజులరామారంలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని , అభివద్ధి పరచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా స్థానిక నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులందరూ కలిసి ఈ ప్రాంత అభివద్ధి కోసం సీఎంకు గాజులరామారంలో ఉన్న ప్రభుత్వ భూము ల పైన అవగాహన తీసుకువచ్చి ఇక్కడి ప్రభుత్వ భూములలో పెట్టుబడులు పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలా పెట్టుబడులు గాజులరామారంకు వస్తే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు అన్ని విధాలుగా లాభ పడతారన్నారు.



కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యం

- టీపీసీసీ రాష్ట్ర నాయకులు, అడ్వకేట్ బండి శ్యామ్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని టీపీసీసీ రాష్ట్ర నాయకులు,అడ్వకేట్ బండి శ్యామ్ గౌడ్ అన్నారు. పేదలకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చింతల్ డివిజన్‌లోని చింతల్ ప్రాంతంలో రేషన్ షాప్ వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు బాల్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేశారు ముఖ్యఅతిథిగా వారు హాజరై కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వినియోగదారులకు సన్న బియ్యం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు కూడా సంపన్నులతో సమానంగా సన్న బియ్యం తినాలనే సంకల్పంతో ఇంతటి గొప్ప నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమన్నారు. ఈ సందర్భంగా సీఎం.రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజల నుంచి కూడా మంచి స్పందన వస్తుందని హర్షం వ్యక్తం చేశారు.చింతల్ డివిజన్ అధ్యక్షులు పండరి,నాయకులు కమల, లక్ష్మి, గుజ్జుల శ్రీనివాసరెడ్డి, పూర్ణచంద్రరావు, నాగరాజు, వాణి, నాగబాబు, భాస్కర్, కుమార్, బాలు, ఓబులేష్, శేషగిరి, మూర్తి,శ్రీనివాస్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆన్ లైన్ డెలివరీ బాయ్స్‌కు అండగా వడ్డేపల్లి రాజేశ్వరరావు



నవతెలంగాణ - కూకట్ పల్లి

బ్లింకిట్‌లో పనిచేస్తూ మొబైల్ నుంచి ఆర్డర్ పెట్టగానే క్షణాల్లో నిత్యావసర వస్తువులను అందించే 100 మంది డెలివరీ బాయ్స్‌లలో కొందరిని రోజువారి ఇన్సెంటివ్‌ను పెంచమని కోరినందుకు అవగాహన, సమాచార లోపం వల్ల యజమాన్యానికి, బాయ్స్‌కు విభేదాలు వచ్చాయి. దాంతో సుమారు 30 మంది డెలివరీ బాయ్స్‌ను గత వారం కిందట కంపెనీలో నుంచి తొలగించి మళ్లీ పనిలోకి తీసుకోలేమని కచ్చితంగా చెప్పారు. దాంతో వారం నుంచి రోజువారి వేతనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న డెలివరీ బాయ్స్ బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆశ్రయించగా వారు ప్రత్యేక శ్రద్ధ చూపించి, ప్రముఖ కంపెనీ యాజమాన్యాన్ని పిలిపించి ఇరువురితో చర్చించి వారి మధ్య సయోధ్య కుదిరించారు. దూర ప్రాంతాల నుంచి పొట్టచేత పట్టుకుని వచ్చిన గ్రామీణ యువతకు కంపెనీలో మళ్లీ అవకాశం కల్పించి న్యాయం చేసి వారిని ఆదుకోవాలన్నారు. దాంతో కంపెనీ నుంచి తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకుంటామని సదరు యాజమాన్యం రాజేశ్వరరావుకు హామీఇచ్చారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు చాలా ప్రమాదకరమని, క్రమం తప్పకుండా పనిచేసుకుంటూ యాజమాన్యంతో మంచిగా ఉండాలని డెలివరీ బాయ్స్‌కు రాజేశ్వరరావు సూచించారు.



బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-నిజాంపేట్

హెచ్‌సీయూలో జరగనున్న ఆందోళనలో పాల్గొననున్నారని ముందస్తు సమాచారం అందడంతో బాచుపల్లి పోలీసులు నిజాంపేట్, బాచుపల్లి,ప్రగతి నగర్‌కు చెందిన పలువురు బీజేపీ నేతలను మంగళవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. విద్యాసంస్థలకు ఇచ్చిన భూములను అమ్మకానికి పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పతనం కావడం ఖాయమన్నారు.

వడ్డేపల్లి హౌస్ అరెస్ట్

కూకట్ పల్లి + హెచ్‌సీయూ భూముల వేలంపాటకు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్న విద్యార్థులకు మద్దతుగా మంగళవారం బీజేపీ ఇచ్చిన పిలుపుమేరకు ఆ పార్టీ నాయకులను, ముందస్తు గా హౌస్ అరెస్ట్ చేశార పోలీసులు. అందులో భాగంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును కూకట్‌పల్లి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.





'కార్పొరేట్' దత్తతకు గిరిజన గ్రామాలు

- మంత్రి ధనసరి సీతక్క

నవతెలంగాణ-సిటీబ్యూరో

కార్పొరేట్ సంస్థలు గిరిజన గ్రామాలను దత్తత తీసుకుంటున్నాయని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్, ఓపెన్ టెక్స్, సర్వీస్నో సంస్థలు ములుగు మండలంలోని జగ్గన్నపేట, చిన్న గుంటూరుపల్లి, పులిగుండం, కొడిశలకుంట, చంద్రుతండ, ఎల్బీనగర్, వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి గ్రామాల్లో రూ.కోటీ 50 లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. సోలార్ లైట్లు, పాఠశాలల్లో మూత్రశాలలు, వంట గదుల మరమ్మతు, బోరుబావి, ఆర్వో ప్లాంటు, వాటర్ ట్యాంకులను ప్రారంభించడంతోపాటు గేదెలు, ఆటోలు, బాలికలకు సైకిళ్లు, మహిళలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుమూల గిరిజన పల్లెల ప్రగతిలో కార్పొరేట్ సంస్థలు భాగస్వామ్యం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తోడ్పాటును అందిస్తుండటం శుభపరిణామమని తెలిపారు. ఒక్క విజ్ఞప్తికి స్పందించిన కార్పొరేట్ సంస్థలు గిరిజన గ్రామాలను దత్తత తీసుకుని మూడేండ్లపాటు సేవలందిస్తాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమేకాకుండా స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందిస్తాయని చెప్పారు. ప్రజలంతా ఐకమత్యంగా ఉంటూ గ్రామాలను అభివద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాల అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాలికాబద్ధంగా పని చేస్తోందని తెలిపారు. యువత, మహిళలకు స్వయం ఉపాధిని మెరుగుపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను అందించడమే కాక వడ్డీలేని రుణాలు రుణాలు అందిస్తున్నామన్నారు. పావలా వడ్డీని తిరిగి మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయించి వ్యాపారవేత్తలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఓపెన్ టెక్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సంగీత యలమంద్ర, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సీఈవో మయూర్ పట్నాల, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE AT: CITY CIVIL COURT, HYDERABAD

O.S.No.5964 OF 2024

BETWEEN:

M/s.BANG PAPERS Represented by its Proprietor, Mr. Narayan Das Bang ...PLAINTIFF

AND

M/s. BLUE SEAS PAPERS PRIVATE LIMITED, Represented by its Director Mr. Manish Kanchhal & another ...DEFENDANTS

To,

M/s.BLUE SEAS PAPERS PRIVATE LIMITED, Represented by its Director Mr. Manish Kanchhal, O/o Flat No 406 & 407, Maheshwari Chambers, Somajiguda, Hyderabad, Telangana, India, 500082 ...Defendant No.1

Please take notice that the above named Plaintiff has filed the above suit for SUMMARY SUIT FOR RECOVERY OF AMOUNT against the Defendants and the same is stand posted to 25-04-2025 if anybody having any objection in the above suit, appear at 10:30 a.m. before this Hon'ble Court in person or by an Advocate, failing which the Hon'ble Court will proceed with the matter as per the law.

//By order of the Hon'ble Court//

S. RAJA GOPALAN
Advocate
Legalwin Associates
215/A, Lane No.6, MLA Colony, Banjara hills , Hyderabad-35.
Cell No. 9704772200

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం XI Additional District Judge వారి కోర్టులో

I.A.No.402/2024
in
A.S.No.58/2022

పిటిషనరు/అప్పిలెంట్ వేగేశ్న వెంకట సుబ్బరాజు
మరియు
రెస్పాండెంట్లు: ఎ.పి.హౌసింగ్ బోర్డు, హైదరాబాద్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ వైస్ చైర్మన్ అండ్ హౌసింగ్ కమిషనర్, విజయవాడ వగైరా

పై నెంబరు ఐ.ఎ.నెం.402/2024 పిటిషనులో 8వ రెస్పాండెంట్ అలపాటి క్రిష్ణకుమారి, భర్త రామమోహనరావు, డోర్‌నెం.3-147/66/401, శ్రీసాయి రెసిడెన్సీ, శ్రీ శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, నిజాంపేట, రంగారెడ్డి జిల్లా తెలంగాణ రాష్ట్రం, పిన్-500090, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్ట్ అనువారికి నోటీసులు కోర్టు ద్వారాను అమలు జరగనందున సబ్‌స్టిట్యూటెడ్ సర్వీసు ద్వారా అమలు జరుపుటకు గాను ది.07-04-2025 సంవత్సరము తేదీకి వాయిదా వేసినారు. కావున 8వ రెస్పాండెంట్ సదరు వాయిదా రోజు ఉదయం గం 10-30 ని.లకు పై కోర్టులో హాజరయి అక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల 8వ రెస్పాండెంట్ పరోక్షమందు పై పిటిషను తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

కాళ్లకూరి కుసుమ హరనాథ్,
అడ్వకేట్,
తాడేపల్లిగూడెం, సెల్:9963954564

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE: R.R. DISTRICT, AT: L.B. NAGAR

I.A.No.26 OF 2023
IN
OS.No. 2468 of 2018

Between:-

G.Satyanarayana Goud & another ...Petitioners/Plaintiffs

AND

G. Ravinder & others ...Respondents/Defendants

To,

Smt.Gurjani Swarnalatha W/o. Gurjani Srnivas Aged about 34yrs Occ: Housewife R/o.H.No.8-85, Ibrahimpatnam, Ibrahimpatnam (Khalsa) Village and Mandal, R.R. District

Please take notice that the plaintiffs filed the above suit for partition and separate possession in respect of land in Survey No.87 admeasuring Ac.1.14.75 guntas situated at Injapur village, Hayathnagar Mandal, R.R. District against the defendants, wherein during the pending of the suit you obtained a Gift Deed vide doc.no. 315/2021 dated 16-10-2021 from defendant no.8(Gurramguda @ Chilkuru Jangaiah), as such a implead petition was filed and many times notices were send to you on the address given in the Gift deed and same are returned unserved, hence the Hon'ble court was pleased to order publication of notice to you through paper publication and the posted the matter on 22-04-2025, as such you may appear before the above mentioned Hon'ble court on 22-04-2025 at 10.30 a.m. either personally or through your counsel, failing which the matter will be decided as per law.

(BY ORDER OF THE HON'BLE COURT)

P.Chandrashekar
D.Shailaja
D.Mahender
Advocates
Office at : Flat No.G-1, Laxmi Residency, Barkatpura, Hyderabad. (M) 9848933667

IN THE COURT OF THE HONABLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI; AT: MALKJGIRI

SUCCESSION.OP. No.8 of 2025

Between:

1.Sakunaveeti Venkata Ramamma
2.Dr.Lakkaraju Venkata Visweswara Rao
3.Lakkaraju V.A.R. Chaitanya
4.Dr.Lakkaraju Naga Deepaa (After marriage Komaravolu Naga Deepa) ...Petitioners

And

The Postmaster and all concerned ...Respondents

To,

ALL CONCERNED.

NOTICE

Please take notice that, the above petitioners filed the above succession OP for grant of succession certificate, in the name of deceased "Lakkaraju Kalyana Rambabu" for claiming an amount of Rs. 5,23,111.82/- with accrued interest, laying in postal saving account. No. 7286026348 in the head Post office Dornakal. The case is posted to 24.04.2025, any person or persons have any claim may appear before the Honble court, at Kushaiguda either in person or through advocate on or before 24-04-2025 at 10-30 AM, failing which, the matter will be decided on merits as per law by the Honble Court.

// BY THE ORDER OF THE COURT //

P. RAGHAVENDRA RAO,
S. SATISH KUMAR,
M.SHANTHI PRIYA
ADVOCATES,
MEDCHAL -MALKAJGIRI.
COUNSELS FOR PETITIONERS

IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE:: CITY CIVIL COURT AT HYDERABAD

O.S.No.1305OF 2025

Between:

B.Swathi and another ...Plaintiffs

AND

The Tahsildar and others ...Defendants

To

All concerned. ...Defendants

Take notice that the OS No.1305 of 2025 is filed against you and the same is posted on 28-04-2025 for your appearance if any, that if you failed to appear before the Hon'ble Court on the above said date at 10:30 am in that case you will be se ex-parte and the matter will be decided as per Law.

//BY ORDER OF THE COURT//

M/sV.SIDDHARTH
Advocate
#14-6-284, ChudiBazar,Begum Bazar, Hyderabad.
Cell: 8019811782

IN THE COURT OF I ADDL.SENIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJIGIRI DISTRICT, AT: NEREDMET

O.S.No.1589 of 2016

Between:

Smt K.Laxmi & others ...Plaintiffs

And

V.Sudhaker Reddy & 2 others ...Defendants

To,

Kanduri Srikanth S/o. Late K.Shiva Narayana, Aged about 44 years, Occu: Pvt Service, R/o.H.No.1-5-741, Near Bharath Petrol Bunk, Old Alwal, Medchal Malkajigiri District. ...Defendants No.2

Whereas the above-named Plaintiffs filed a suit in O.S.No. 1589 of 2016 for Eviction and Arrears of Rents against Defendant No.1

You are hereby wanted to appear in the court in person or through advocate duly instructed on 21" day of April 2025 at 10.30.A.M, failing which, said suit will be heard and determined ex parte.

(By Order of the Court)

B. Venkateshwara Reddy
Advocate
At Villa No. 12, Golden Leaves Villas, Sahadev Singh Nagar, Near Jaipuri Colony, Nagole, Hyderabad-500 068.
Phone: 9848098052

IN THE COURT OF THE HON'BLE XII H ADDL DISTRICT JUDGE: RANGA REDDY DISTRICT: AT L.B. NAGAR

O.S. NO. 529 OF 2018

BETWEEN:

Darga @ Karre Ailamma and others ...Plaintiffs

AND

P.Raghava Reddy and others ...Defendants

To

5.Anjali Rath, D/o.Rama Krishna Rath, Aged about 69 years, Occ: Housewife, R/o. C.T. Satish Khanna Apartments, Sana F Guda, Rajbhavan Road, Hyderabad
6.Bimal Sabarwal, S/o.Gulshan Sabharwal, Aged about 43 years, Occ: Housewife, R/o. C-31, Shanti Sikhara Apartments, Somajiguda, Raj Bhavan Road, Hyderabad

Please take notice that the plai tiffs have filed the above suit for declaration and recovery of possession in respect of schedule of property against the you and other defendants therein. Notice to other defendants are already served. That you have been arrayed as defendant No.2 to 3 respectively in the above suit. Notice in the ordinary course of service could not be served on you in the above suit as such the Hon'ble Court was pleased to order for substitute service to you (defendant No.2 to 3) by an order dt.13.03.2025.

Therefore, notice is given to you i.e., defendants No.2 and 33 that the above suit is posted to 07/04/2025 for your appearance before the said court at 10.30 a.m., you can appear either by yourself or through an advocate, failing which appropriate orders will be passed against you.

(By Order of the Court)

I. RAMESH
ADVOCATE
CHAMBERS AT: "Sri Sai Nilayam", 9-1-19/48 Vinayak Nagar, Langer House
HYDERABAD-500008
Mobile: 9246546715

IN THE COURT OF THE HON'BLE VII SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT :: AT : HYDERABAD

O.S.No.116 of 2012

Between :

P.Satyanarayana ....Plaintiff

AND

Smt.M.Mallamma (died) & others ....Defendants

To

1.M.Chandrakanth Rao S/o Late M.Narsinga Rao Aged about 65 years, occ: Business,
2.M.Lokesh S/o Late M.Narsinga Rao Aged about 63 years, occ: Rtd., services,
3.M.Laxmamma W/o Late M.Narsinga Rao Aged about 69 years, occ: Business,
4.M.Mallikarjun S/o Late M.Narsinga Rao Aged about 58 years, occ: Business,
....Defendants No.6 to 9
(Defendants No.6 to 9 are R/o H.No. 12-2-422/597, Priya colony, Gudimalkapur, Hyderabad.
5.P.Pushpa W/o Late P.Srisailam Aged about 65 years, occ: House hold R/o H.NO. 3-6-688/124/503, Amrapalli Arcade, Street No.10, Himayathnagar, Hyderabad. ...Defendants

NOTICE

Whereas the above named plaintiffs have filed above suit for partition of the plaint schedule property against the Defendant Nos.1 to 5 into to equal shares during the pendency of the suit defendants No.1 and 4 died, and the plaintiff made a application to bring the LR's on records as proposed defendants no. 6 to 9 and defendants No.10 as per the I.A.No.91/2022 and I.A.NO. 545/2023 was allowed by this Hon'ble court and defendant no. 6 to 9 and 10 are added a party as defendants in the above suit the Hon'ble court send the notices above said address your intentionally and wantendly refused the same the Hon'ble court direct the plaintiff to publish the notices by way of paper publication to the defendants no. 6 to 9 and 10. The said matter was posted on 09-04-2025 for your appearance and written statement. Hence, You may be appear before this Hon'ble court on 09-04-2025 at 10.30 AM. either in person are through an advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

// By Order of the court //

RAVULA MADHUSUDHAN REDDY,
ADVOCATE,
Flat No.403, 4 th Floor, Sai Sudha Residency, Patel Colony, Champapet, Hyd-500 079.
Mobile No.93911 32430,

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం XI Additional District Judge వారి కోర్టులో

I.A.No.403/2024
in
A.S.No.58/2022

పిటిషనరు/అప్పిలెంట్:వేగేశ్న వెంకట సుబ్బరాజు
మరియు
రెస్పాండెంట్లు : ఎ.పి.హౌసింగ్ బోర్డు, హైదరాబాద్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ వైస్ చైర్మన్ అండ్ హౌసింగ్ కమిషనర్, విజయవాడ వగైరా

పై నెంబరు ఐ.ఎ.నెం. 403/2024 పిటిషనులో 8వ రెస్పాండెంట్ అలపాటి క్రిష్ణకుమారి, భర్త రామమోహనరావు, డోర్ నెం.3-147/66/401, శ్రీసాయి రెసిడెన్సీ, శ్రీ శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, నిజాంపేట, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం పిన్-500090, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్ట్ అనువారికి నోటీసులు కోర్టు ద్వారాను అమలు జరగనందున సబ్‌స్టిట్యూటెడ్ సర్వీసు ద్వారా అమలు జరుపుటకు గాను ది.07-04-2025 సంవత్సరము తేదీకి వాయిదా వేసినారు. కావున 8వ రెస్పాండెంట్ సదరు వాయిదా రోజు ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టులో హాజరయి అక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల 8వ రెస్పాండెంట్ పరోక్షమందు పై పిటిషను తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

కాళ్లకూరి కుసుమ హరనాథ్,
అడ్వకేట్,
తాడేపల్లిగూడెం, సెల్:9963954564

In the court of Hon'ble V Addl Junior civil judge Cum V Addl. Judicial magistrate of first class R.R. District :: AT: L.B. Nagar

O.S. NO. 189 OF 2025

Between:

Dondlapally Ramchander Rao ....Plaintiff

And

The Tahsildar/MRO of Saroornagar mandal and another ...Defendants

Public Notice

To

All Concerned

Notice is hereby given to the public at large that the above-named plaintiff has filed the O.S. No. 189 of 2025 against the defendants for Declaring him as legal heir of the deceased/D.Ranganayakamma on the file of V Addl. Junior civil judge court, R.R. District, at L.B. Nagar, the above said O.S.No. 189 of 2025 posted to 15-04-2025 for hearing if anybody have/has any objections to declare him/plaintiff as legal heir of the deceased be appear either in person or through an advocate on 15-04-2025 at 10.30 A.M. before the V Addl. Junior civil judge court at L.B. Nagar, failing which the matter will be decided in accordance with law.

"By Order of the Hon'ble Court"

Sd/-

M/s V.Subramanyam Sastry
P. Malathi
Advocates
Hyderabad , 9849232067
Counsel for the plaintiff,

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం XI Additional District Judge వారి కోర్టులో

I.A.No.404/2024
in
A.S.No. 58/2022

పిటిషనరు/అప్పిలెంట్: వేగేశ్న వెంకట సుబ్బరాజు
మరియు
రెస్పాండెంట్లు:ఎ.పి.హౌసింగ్ బోర్డు, హైదరాబాద్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ వైస్ చైర్మన్ అండ్ హౌసింగ్ కమిషనర్, విజయవాడ వగైరా

పై నెంబరు ఐ.ఎ.నెం.404/2024 పిటిషనులో 8వ రెస్పాండెంట్ అలపాటి క్రిష్ణకుమారి భర్త రామమోహనరావు, డోర్.నెం.3-147/66/401, శ్రీసాయి రెసిడెన్స్ & శ్రీనివాస హౌసింగ్ సొసైటీ, నిజాంపేట, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం, పిన్-500090, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్ట్ అనువారికి నోటీసులు కోర్టు ద్వారాను అమలు జరగనందున సబ్‌స్టిట్యూటెడ్ సర్వీసు ద్వారా అమలు జరుపుటకు గాను ది.07-04-2025 సంవత్సరము తేదీకి వాయిదా వేసినారు. కావున 8వ రెస్పాండెంట్ సదరు నాయిదా రోజు ఉదయం గం.10-30 నిలకు పై కోర్టులో హాజరయి ఆక్షేపణలు తెలుపుకోవలెను లేని యెడల 8వ రెస్పాండెంట్ పరోక్షమందు. పై పిటిషను తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

కాళ్లకూరి కుసుమ హరనాథ్,
అడ్వకేట్,
తాడేపల్లిగూడెం, సెల్:9963954564

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
బుధవారం | ఏప్రిల్ 02, 2025 | www.navatelangana.com

నేడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి

- రేపు దొడ్డి కొమురయ్య జయంతి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి, గురువారం ఉదయం 11 గంటలకు దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి.ఝాన్సీరాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, గౌడ, కురుమ కుల సంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీ రామ నవమి వేడుకలకు మాజీ మేయర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేట గ్రామంలోని రామాలయంలో ఈనెల 6న నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు హాజరవ్వాల్సిందిగా కోరుతూ ఆలయ అర్చకులు స్థానికులు మంగళవారం నిజాంపేట నగర మాజీ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు. స్థానిక 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ టు కాలనీవాసులు కూడా పెద్ద సంఖ్యలో మాజీ మేయర్ ను కలిసి తమ బస్తీలో ఏర్పాటు చేయనున్న శ్రీరామ నవమివేడుకలకు రావలసిందిగా అభ్యర్థించారు.

సన్న బియ్యం పంపిణీ షురూ..



నవతెలంగాణ - కూకట్ పల్లి.

ప్రజలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ మంగళవారం రేషన్ షాపుల వద్ద ప్రారంభమైంది. తెల్ల రేషన్ కార్డ్ దారులకు పంపిణీ చేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్ కాలనీ, కూకట్ పల్లి డివిజన్ ల పరిధిలోని రేషన్ షాప్ వద్ద ఉదయం నుంచే వినియోగదారులు క్యూ కట్టారు. షాపు యజమానులు,రేషన్ షాప్‌లను మామిడి తోరణాలు, పూల మాలలతో సుందరంగా అలంకరించారు, ఉదయాన్నే సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు దుకాణ దారులు మాట్లాడుతూ ఇన్నాళ్లు కస్టమర్లు దొడ్డు బియ్యం ఇవ్వడం వలన తినలేకపోయేవారని, వాటిని కొంత మంది బయట అమ్ముకునే వాళ్లని ,కానీ ప్రస్తుతం సన్న బియ్యం ప్రారంభించడం వల్ల కస్టమర్లు చాలా సంతోషంగా తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు బియ్యం తినడానికి బాగుంటాయని సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు.

సన్న బియ్యం బాగున్నాయి...



ప్రభుత్వం ఎన్నాళ్ల నుండో సన్న బియ్యం అందజేస్తామని చెబుతోంది కానీ అది ఇన్ని రోజులకు నెరవేరిందని,సన్న బియ్యం ఇవ్వడం సంతోషంగా ఉందని, బియ్యం కూడా బాగున్నాయని, ఇప్పుడు అవి వండుకుని తినడానికి చక్కగా ఉపయోగపడతాయని వినియోగదా రులు భాగ్య లక్ష్మీ సంతోషం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ సన్న బియ్యంలో అక్కడక్కడ కొంత నూక బియ్యం కనబడుతున్నదని, ఈ నెల మొదటి నెల కాబట్టి కొన్ని రావొచ్చు, ఇక ముందు నూక బియ్యం లేకుండా ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రేషన్ షాపుల్లో, సన్న బియ్యం ఇవ్వడం తమ అందరికీ సంతోషంగా ఉందని, ఇది నిరంతరం క్రమం తప్పకుండా అందిస్తే బాగుంటుందని తెలిపారు.

ప్రభుత్వ విద్యాసంస్థల భవిష్యత్తును ఫణంగా పెట్టొద్దు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్
- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-నిజాంపేట్

రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నదని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్ విమర్శించారు. మంగళవారం తోటి ఎస్.ఎఫ్.ఐ విద్యార్థులతో కలిసి ఆయన ప్రగతి నగర్ మంకీ స్టాచ్యూ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్.సి.యుకు చెందిన 400 ఎకరాల భూమిని విక్రయానికి పెడుతూ కార్పొరేట్ సంస్థలకు అమ్మ చూపడం దారుణమన్నారు. ఈ నిర్ణయం కారణంగా భవిష్యత్తులో పేద విద్యార్థులు హెచ్.సి.యులో విద్యాభ్యాసం చేసే పరిస్థితులు కనుమరుగు కానున్నాయని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టడమే కాకుండా, అక్కడ ప్రస్తుతం ఉన్న అటవీ ప్రాంతంలోని అనేక జీవజాతుల మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ పోతే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎస్.ఎఫ్.ఐ రాజీలేని పోరాటం సాగిస్తుందని, తద్వారా విద్యార్థుల ప్రయోజనాలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. తక్షణమే హెచ్.సి.యు స్థలం విక్రయ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్.ఎఫ్.ఐ ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు శివ, సాయిరాం, సిద్ధార్థ, చందు, మధు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్



పారిశ్రామిక హమాలి యూనియన్ సీఐటీయూ ,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీడిమెట్ల హమాలీ అడ్డా దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జీడిమెట్ల ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ , సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ... పారిశ్రామిక ప్రాంతంలో హమాలీ పనులు చేస్తూ జీవనం గడుపుతూ జీడిమెట్ల నర్సాపూర్ ప్రధాన రహదారిపై గత పది సంవత్సరాల నుంచి చలివేంద్రం ఏర్పాటు చేసి పాదచారుల దాహాన్ని తీరుస్తు.. సామాజిక సేవలో భాగస్వామ్యమవుతున్న హమాలి కార్మికులందరికీ పేరు పేరునా అభినందనలు తెలియజేశారు. రానున్న కాలంలో మరిన్ని సామాజిక, సేవ, కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాటసారులు దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు స్వామి, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ దేవదానం, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అంజయ్య, శ్రీనివాస్, హమాలీ సంఘం నాయకులు కే శీను, నరసింహారెడ్డి , కరుణాకర్, మహేష్ , మల్లారెడ్డి, శేఖర్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు .

బస్తీ దవాఖానా వద్ద పారిశుధ్యానికి సుస్తీ



- కూకట్‌పల్లి డివిజన్ హనుమాన్ నగర్‌లో ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే..
- పేరుకుపోయిన చెత్తతో కంపు కొడుతున్న పరిసరాలు
- చెత్త వేసే చోట సీసీ కెమెరాలు అలెర్ట్ మైక్ లు ఏర్పాటు చేయాలి : స్థానికులు





నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్ పల్లి డివిజన్ హనుమాన్ నగర్‌లో బస్తీ దవాఖాన వద్ద పారిశుధ్య పనులకు సుస్తీ చేసిందా అనే విధంగా ఉంది పరిస్థితి. అందరి ఆరోగ్యాలు కాపాడవలసిన బస్తీ దవాఖాన పరిసరాల్లో, హనుమాన్ నగర్ మెయిన్ రోడ్డు లోని సర్కిల్ ,థీమ్ పార్క్ ప్రహరీ గోడ వద్ద కుప్పలు కుప్పలుగా చెత్త పేరుకుపోవడంతో చెత్త నుంచి వెలువడే కంపుతో స్థానికులు, అటుగా ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతూ ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. చెత్త తరలించే ఆటోలు ఇంటింటికీ వచ్చి, చెత్త తీసుకెళ్లినప్పటికీ బస్తీలో మాత్రం ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తుండటం పరిపాటిగా మారిపోయింది, ఇందుకు కారణం చెత్తను రోడ్ల పై వేయడమే. అలాగే ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడం కూడా ఒక కారణమని తెలుస్తోంది. చెత్త వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే చెత్త రోడ్ల పై పేరుకుపోకుండా ఉండే అవకాశం ఉంటుందని కొందరి స్థానికుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చెత్త పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



జీహెచ్ఎంసీ సిబ్బంది చెత్త తొలగించిన గంట వ్యవధిలోనే కుప్పలు, కుప్పలుగా చెత్త పేరుకుపోతున్నది. దాంతో అక్కడిన ఉంచి వచ్చే కంపు వాసన భరించలేకుండా ఉన్నాం. ప్రతి రోజూ దోమల బెడదతో స్థానికంగా ఇబ్బందులు పడటమే కాకుండా ,అనారోగ్యాలకు గురవ్వాల్సిన పరిస్థితి దాపురించింది. బస్తీ దవాఖాన ముందే అపరిశుభ్రంగా ఉండటం, చెత్త పేరుకుపోవడం దారుణం. వడ్డే పల్లి ఎంక్లేవ్ వద్ద సీసీ కెమెరా విత్ మైక్ పరికరం ఏర్పా టు చేసినప్పటి నుండి అక్కడ చెత్త వేయడం పూర్తిగా తగ్గింది. అలాగే ఇక్కడి చెత్త పాయింట్ల వద్ద సైతం సీసీ కెమెరా, మైక్ లు ఏర్పాటు చేస్తే చెత్త వేసే వారు భయపడి చెత్త వేయకుండా ఉంటారు.

- స్థానికుడు మహేష్

దాతల సహకారంతో సీసీ కెమెరాలు, మైక్‌లు ఏర్పాటు చేస్తాం

ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా నివారించేందుకు, వాయి స్ రికార్డర్ సీసీ కెమెరాల ఏర్పాటు సత్ఫలితాన్నిస్తుంది. ముందుగా వడ్డేపల్లి ఎంక్లేవ్ నాలా వద్ద దాతల సహకా రంతో ఏర్పాటు చేసిన కెమెరా మంచి ఫలితాన్ని ఇచ్చింది. అలాగే ఆల్విన్ కాలని రోడ్డులోని ప్రేమ్ సరోవర్ వద్ద సైతం దాతల సహకారంతో ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాము. కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల చెత్త వేసే వారికి పెనాల్టీ వేయడం సులువవుతుంది. చెత్త వేసిన వారు తప్పనిసరి ఫైన్ కట్టి తీరాల్సి వస్తుంది. అలాగే దాతలు ముందుకు వస్తే ఇతర చెత్త పాయింట్ల వద్ద సైతం వాయిస్ రికార్డర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రోడ్ల పై పూర్తిగా చెత్త వేయకుండా నిర్మూలించగలం

- సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ డీఈఈ శ్రీనివాసరావు

సీపీఐ(ఎం) నాయకులపై పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తున్నాం

- పార్టీ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

హెచ్‌సీయూ విద్యార్థుల మీద, ఎస్ఎఫ్ఐ విద్యార్థి యూనియన్ నాయకుల మీద, సీపీఐ(ఎం) నాయకులపై పోలీసుల నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పార్టీ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మంగళ వారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హెచ్‌సీయూ భూముల రక్షణకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో హెచ్‌సీయూ గేటు ముందు నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగా పార్టీ నాయకత్వాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయడాన్ని అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు వ్యతిరేకించాలని కోరారు. గత కొన్ని రోజులుగా పోలీసులు సీపీఐ(ఎం) కార్యకర్తలను, నాయకులను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని అన్నారు. సీపీఐ (ఎం) కార్యకర్తలని టార్గెట్ గా చేసుకొని అక్రమ అరెస్టులు చేయడంలో అర్థం లేదన్నారు. పార్టీ పిలుపులు లేకున్నా అరెస్టులు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. రాష్ట్రంలోకాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పోరాటాల మీద, నాయకుల మీద నిర్బంధం పెరిగిందని ఆయన విమర్శించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ వారు అనేక మాయ మాటలు చెప్పారని, ఇప్పుడు అధికారం చేపట్టాక గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అనుసరిస్తున్నారని చెప్పారు. 400 ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీ భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం ఇప్పటికైనా విరమిం చుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మీద కేసులు ఉపసంహరించుకోవాలని, తక్షణమే అరెస్టు చేసిన విద్యార్థులను, రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) నాయకులను, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 2న పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండల పరిధిలో రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.



సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ పరిధిలోని ఉమాదేవినగర్ ప్రాంతంలో గల శ్రీ శివకేశవ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 6న ఆదివారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం బీఆర్ఎస్ నియోజకవర్గ యువ నాయకులు కొలుకుల జైహింద్ తోపాటు, బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే.శేఖర్ యాదవ్,చైతన్య విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మెన్ శివరాత్రి యాదగిరి,నవోదయ పాఠశాల చైర్మెన్ కాసర్ల గిరి,జగద్గిరిగుట్ట సిఐ.కేతూరి నరసింహ,ఎస్ఐ శంకర్,ఉషోదయ కాలనీ అధ్యక్షులు పేరారెడ్డి, బీజేపీయువ నాయకులు సిరుసాని మహేందర్ లను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలను కమిటీ సభ్యులు పి. సమ్మయ్య యాదవ్,పి.రాములు గౌడ్,మోక్ష శంకర్, కే.శ్రీ రామరాజు, సంతోష్,కూర రాజు,క్రాంతి కుమార్,రమేష్ యాదవ్‌లు అందజేశారు.

సన్న బియ్యం పంపిణీ అరుదైన ఘట్టం

- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి
- పలు ప్రాంతాల్లో రేషన్ షాపుల వద్ద సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన నాయకులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

సంపన్నులు తినే సన్న బియ్యం ప్రతి పేదవాడికి అందించాలని లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రలో అరుదైనఘట్టమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. సన్న బియ్యం పంపిణీ పథకాన్ని మంగళవారం గాజులరామారం డివిజన్ పరిధిలోని చిత్తరమ్మదేవినగర్,సుందరయ్య కాలనీ తోపాటు పలు ప్రాంతాల్లోని రేషన్ షాపుల వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేయడంలో దొందు దొందేనని విమర్శించారు.కాంగ్రెస్ ప్రజాపాలనలో భాగంగా ప్రతి పేదవాడి కండ్లల్లో సంతోషాన్ని చూడాలనే లక్ష్యంతో తీసుకున్న నిర్ణయం పట్ల సీఎం రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పలు రేషన్ షాప్ ల వద్ద సన్న బియ్యం చూసి వినియోగదారులు ఎంతో హర్షం వ్యక్తం చేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త పైన ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లాల్ మొహమ్మద్,మహేష్ గౌడ్, రెహానా బేగం,వెంకట్రాం రెడ్డి,కొండల్,కిషోర్ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పథకం అమలు పేదలకు వరం : టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కేపీహెచ్‌బీ : సన్న బియ్యం పథకం అమలు పేదలకు వరమని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. కాంగ్రెస్ అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్ ఆధ్వర్యంలో అల్లాపూర్ లోని పలు రేషన్ షాప్ లో తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పథకం కింద లబ్దిదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు కూడా సంపన్నులతో సమానంగా సన్న బియ్యం తినే విధంగా సన్న బియ్యంను అందించాలనే గొప్ప ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతోనే సన్న బియ్యం పథకం అమలైందన్నారు. బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కష్ణ రాజ్ పుత్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు భారతమ్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగారావు, సుంకన్న, మస్తాన్ రెడ్డి, జమీర్ సాహెబ్, అబ్దుల్లా, రవి ముదిరాజ్, గిరిధర్, సురేందర్, నందు సతీష్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





గరీబీ హఠావో బాటలో కాంగ్రెస్ నడుస్తోంది : కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీ గరీబీ హఠావో అనే బాటలో నడుస్తోందని కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి సూచన మేరకు కేపీహెచ్ బీ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శేరి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రోటీ కపడ ఔర్ మకాన్ అనే నినాదం మీద కాంగ్రెస్ ఎప్పుడూ పేదల పట్ల వెన్నుదన్నుగా ఉంటుందని కొనియాడారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండారగల్ల సంజీవ రావు, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, ఫణీంద్ర కుమార్, బి బ్లాక్ అధ్యక్షురాలు సంధ్య, రేష్మ, యమునా, దేవ సహాయం రవి, కొమ్ము బాబు, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, రామకష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళ నాయకురాలు యూత్ కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ముందు చూపున్న ఏకైక సీఎం రేవంత్ రెడ్డి : ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం.యుగంధర్ రెడ్డి

బాలానగర్ : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజల మన్ననలు పొందుతూ అభివద్ధి దిశగా ముందుకు సాగుతున్నదని పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గం ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయినగర్ లోని ఒక రేషన్ షాపులో ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి సన్న బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు. పేదలు మార్కెట్లో సన్న బియ్యాన్ని కొనలేని పరిస్థితిని గమనించిన ప్రభుత్వం మహత్తరమైన ఆలోచన చేసి పేదలు కూడా సన్న బియ్యం ఎందుకు తినకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముందు చూపు ఆలోచన రావడంతో అద్భుతమైన కార్యక్రమమన్నారు. పేదల కోసం ముందు చూపు కలిగిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అభివర్ణించారు. అంతకుముందు ఆయనక ు రేషన్ షాపు యజమాని వెంకటస్వామి ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ కమిటీ వైస్ చైర్మన్, బాలానగర్ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్, కాంగ్రెస్ పార్టీ దళిత నేత జెల్లా శివ,చింటు, మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు సన్న బియ్యం ఇస్తున్న ఘనత కాంగ్రెస్‌దే : కొలను హనుమంత రెడ్డి

నిజాంపేట్ : తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బాచుపల్లి పరిధిలోని సాయి నగర్‌లో చౌక దుకాణం వద్ద తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా తెల్లరేషన్ కార్డుదారులకు ఇంతవరకు సన్న బియ్యం పంపిణీ చేయలేదన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సంక్షేమ కార్యక్రమాలను ఇవ్వడంలో సఫలీకతమైందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి స్థానికులతో కలిసి ఆయన పాలాభిషేకం చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ రఫీయా బేగం,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలను జీవన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ (లడ్డు), మల్లికార్జున్,మెడ శ్రీను, శ్రీనివాస్, రహీం,సంజీవ,మిట్టు,పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.





నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ కాంగ్రెస్ ఘనత

- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ - కూకట్ పల్లి

నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేయడం కాంగ్రెస్ ఘనత అని కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్, మొగులమ్మ కాలనీలో ఉన్న చౌక ధరల దుకాణాలలో అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డులున్న లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఆరు కేజీల చొప్పున సన్నబియ్యం ప్రభుత్వం అందిస్తుందన్నారు. రేషన్ కార్డ్‌లో ఎంతమంది ఉంటే అంతమందికి ఆరు కేజీల చొప్పున సన్న బియ్యం తీసుకోవచ్చని తెలియజేశారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుడ్ల శ్రీనివాస్, భాస్కర్, యాదగిరి, బాలస్వామి, మహేష్, ఫారూఖ్, ఖలీమ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సన్న బియ్యం పంపిణీలో పాల్గొన్న జిట్టా సునీల్ కుమార్ యాదవ్

నవతెలంగాణ - కూకట్ పల్లి

పలు రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పథకాన్ని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు జవహర్ బాల్ మంచ్, స్టేట్ కోఆర్డినేటర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జిట్టా సుశీల్ కుమార్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు రాహుల్ సింగ్ చౌహాన్ , అల్లావుద్దీన్ ,జాహిర్ యువజన కాంగ్రెస్ నాయకులు విశాల్,నంద కిషోర్,రాజు ,కార్తీక్,ప్రేమ్,సంతోష్,అనిల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ మానవి
బుధవారం 2 ఏప్రిల్ 2025
హైదరాబాద్
www.navatelangana.com

పురుగు పట్టకుండా...

కందిపప్పు, శనగపప్పు సహా మరికొన్ని పప్పు ధాన్యాలను ఇళ్లలో ఎక్కువగా వినియోగి స్తుం టారు. ప్రతీ రోజు వంటల్లో వాడుతుంటారు. అందుకే చాలా మంది ఎక్కువ మొత్తంలో కొనుక్కొని తెచ్చుకుం టుంటారు. వాటికి పురుగు పట్టకుండాఉంటాలంటే..

వేపాకులు

పప్పుధాన్యాలకు పురుగు పట్టకుండా వేపాకు బాగా ఉపయోగపడుతుంది. కొన్ని వేపాకులను ఆరబెట్టి తేమ పోయాక.. పప్పు ఉన్న డబ్బాలో వేయాలి. వేపాకులో పరుగులను నిరోధించే గుణం సహజంగా ఉంటుంది.

లవంగాలు

లవంగాలు కూడా పప్పులకు పురుగులు పట్టకుండా నిరోధించగలవు. లవంగాల్లోని ఘాటైన గుణం ఇందుకు సహకరిస్తుంది. పప్పుధాన్యాలు ఉన్న డబ్బాలో సుమారు 10 వరకు లవంగాలు వేయాలి. పురుగుల నిరోధించడంతో పాటు పప్పులను తాజాగా కూడా ఉంచేందుకు లవంగాలు తోడ్పడతాయి.

వెల్లుల్లి

పప్పుధాన్యాలు ఉంచుకున్న డబ్బాలో పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బలను వేయాలి. ఓ మోస్తరు డబ్బాలో సుమారు 5 రెబ్బలను వేసుకోవాలి. వేసిన వెల్లుల్లి ఎండిపోతే వాటి స్థానంలో వేరేవి వేసుకోవాలి.

ఎండుమిర్చి

పప్పుధాన్యాలకు పురుగుల బెడదను ఎండుమిర్చి కూడా తగ్గించగలదు. నిల్వ చేసుకున్న పప్పుల్లో ఎండుమిర్చిని అలాగే వేస్తే పరుగులు పట్టే రిస్క్ తగ్గిపోతుంది.

క్రమశిక్షణ, పట్టుదల, కుటుంబ ప్రోత్సాహం, లక్ష్యసాధన పట్ల అంకిత భావం ఉంటే ఏదైనా సాధించగలం అని నిరూపించారు. ఎలాంటి కోచింగ్ లేకుండానే గ్రూప్-1లో మొదటి ర్యాంక్ సాధించి తన లాంటి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. మెడిసిన్ పూర్తి చేసినా సమాజ సేవ చేయాలనే ఆశయంతో సివిల్స్‌పై దృష్టి పెట్టారు. ఆమే డాక్టర్ లక్ష్మీ దీపిక.



రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్

హైదరాబాద్‌లోని ఏఎస్ రావు నగర్‌లో నివాసం ఉంటున్నారు లక్ష్మీదీపిక. ఆమె తండ్రి కృష్ణ కొమ్మిరెడ్డి సీనియర్ ఆడిట్ ఆఫీసర్‌గా పని చేసి రిటైరయ్యారు. తల్లి పద్మావతి గృహిణి. తల్లిదండ్రులకు ఈమె ఏకైక సంతానం. టెన్త్ వరకూ సఫిల్‌గూడలోని డీఏవీ స్కూల్లో చదివిన ఆమె 2013లో మెడిసిన్ 119వ ర్యాంక్ సాధించి ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఆ తర్వాత గ్రూప్స్‌పై దృష్టి పెట్టారు. టీజీపీఎస్సీ గ్రూప్ 1 పోస్టులకు సంబంధించిన రాత పరీక్ష మెయిన్స్ ఫలితాల్లో ఆమె రాష్ట్ర టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. మొత్తం 900 మార్కులకు గానూ 550 మార్కులు సాధించి ఫస్ట్ ర్యాంక్ సాధించారు.

విజయానికి కారణాలు

టైమ్ మేనేజ్‌మెంట్, సమగ్ర ప్రిపరేషన్ ప్లాన్, ఎన్‌సీఇఆర్‌టీ పుస్తకాలకు ప్రాధాన్యం వంటి పలు అంశాలు కీలకపాత్ర వహించాయి. లక్ష్మీదీపిక ప్రమాణిక పుస్తకాలు, ఇంటర్నెట్ వనరులకు సమర్థవంతంగా వినియోగించుకున్నారు. ముఖ్యమైన అంశాలను నోట్స్ తయారు చేసుకుంటూ వేసుకున్న టైం టేబుల్‌ను చక్కగా పాటిస్తూ ఏకంగా మొదటి ర్యాంక్‌నే సాధించారు. అయితే ఆమె సివిల్స్‌కు ప్రిపేర్ కావడం గ్రూప్-1కు కలిసొచ్చింది. గ్రూప్-1 కోసం ఆమె ప్రత్యేకంగా ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. పరీక్షల సమయంలో రోజులో ఎనిమిది నుండి తొమ్మిది గంటలు చదువుకోసం కేటాయించారు. సొంతగానే ప్రిపేరయ్యారు. 80శాతం సిలబస్ కామన్‌గా ఉండడంతో సులభమైంది. 20శాతం తెలంగాణ అంశాలను జాగ్రత్తగా ప్రిపేరయ్యానని ఆమె పంచుకున్నారు.

పరీక్షల మీదే దృష్టి

2020లో ఆమె మొదటిసారి యూపీఎస్సీ రాశారు. ప్రిలిమ్స్‌లో గట్టెక్కినా ఐదు మార్కుల్లో మెయిన్స్ క్లియర్ కాలేదు. 2021లో ఇంటర్వ్యూ వరకూ వెళ్లారు. అందులో విఫలమయ్యారు. 2023లో బయో ఫెర్టిలైజర్స్ తయారు చేసే అంకుర సంస్థలో కొద్ది నెలలు పని చేశారు. అది కూడా మానేసి 2024 జనవరి నుంచి పరీక్షల మీదే దృష్టి పెట్టారు. యూపీఎస్సీకి సిద్ధమవుతూనే టీజీపీఎస్సీ పరీక్షలూ రాస్తుండేవారు. గతేడాది సెప్టెంబర్‌లో యూపీఎస్సీ మెయిన్స్, అక్టోబర్‌లో టీజీపీఎస్సీ మెయిన్స్ రాశారు. ఈ ఏడాది మార్చి 16న యూపీఎస్సీ ఇంటర్వ్యూకి హాజరయ్యారు. ఆ ఫలితాల కోసం వేచి చూస్తున్నారు. అంతలో ఇవి వచ్చాయి. లక్ష్మీదీపకకు రాష్ట్ర స్థాయిలో ఫస్ట్‌ర్యాంకు వచ్చింది కాబట్టి డెప్యూటీ కలెక్టర్ పోస్టు వచ్చే అవకాశం ఉంది. ■



సమాజ సేవే ఆశయంగా

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. ఎంచుకున్న లక్ష్యం నెరవేరే వరకు శోధన చేయాలి. అప్పడే సక్సెస్ అవుతాం. ఐఏఎస్ లక్ష్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేశారు. సొంతంగా ప్రిపేర్ అయ్యారు. అయితే మూడు సార్లు సివిల్స్ రాసి తృటిలో విఫలమయ్యారు. అధైర్యపడకుండా తొలి ప్రయత్నంలోనే గ్రూప్-1లో విజయం సాధించారు. ఇందుకోసం కోచింగ్ లేకుండా సొంతంగా కేవలం మూడు నెలలు మాత్రమే ప్రిపేరయ్యారు. గ్రూప్-1 ఆమెకు సెమీ ఫైనల్స్ మాత్రమే. ఆమె లక్ష్యం సివిల్స్. ఐఏఎస్ సాధించి సమాజసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని పట్టుదలతో ఉన్నారు. ఆమే గ్రూప్-1లో రాష్ట్ర స్థాయిలో 55వ ర్యాంక్, ఎస్సీ కమ్యూనిటీలో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించిన కన్నం హరిణి.



హరిణి సొంతూరు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం అనంతపల్లి. 15 ఏండ్ల కిందట కరీంనగర్‌లోని విద్యానగర్‌లో స్థిరపడ్డారు. తల్లి ప్రపూర్ణ జ్యోతి, తండ్రి రమేశ్ ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. అక్క అఖిల ఎంబీబీఎస్ పూర్తి చేసింది. చెల్లెలు వర్షిణి ఎంబీబీఎస్ రెండో ఏడాదిలో ఉంది. తమ్ముడు బాలాజీ మెడిసిన్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాడు.



చిన్నతనం నుండి టాపర్

హరిణి ఎస్సెస్సీలో 9.8 జీపీఏ, ఇంటర్ ఎంపీసీలో 978 మార్కులు సాధించారు. వరంగల్‌లోని నీట్‌లో ఈఈఈ పూర్తి చేశారు. బీటెక్ తర్వాత హైదరాబాద్‌లో బ్యాంక్ ఆఫ్ అమెరికాలో రెండేండ్లు సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా చేశారు. తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. మూడు సార్లు ప్రిలిమినరీలో 0.18 శాతంతో మిస్సయ్యారు. మళ్లీ ప్రిపేర్ అవుతున్న క్రమంలో తెలంగాణ ప్రభుత్వం తొలిసారి గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చింది. కేవలం మూడు నెలల పాటు శ్రమించి తొలి ప్రయత్నంలోనే సక్సెస్ అయ్యారు.

ఐఏఎస్ కావాలనేది నా కల

ఈమె విజయం వెనుక కుటుంబ సభ్యుల పాత్ర కీలకం. సివిల్స్‌లో ఫెయిల్ అయిన ప్రతీసారి తల్లిదండ్రులు వెన్ను తట్టి ప్రోత్సహించేవారు. 2021 కరోనా కాలంలో ఎక్కడా కోచింగ్ సెంటర్లు లేవు. అప్పటి ఆన్‌లైన్ వేదికను ఉపయోగించుకొని సివిల్స్ ప్రిపరేషన్ కొనసాగించారు. అదే ప్రిపరేషన్ గ్రూప్-1 విజయంలో ఆమెకు కీలకంగా మారింది. అయితే ఐఏఎస్ కావాలనేది ఆమె కల. గ్రూప్-1 ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేర్ కావాలని అనుకుంటున్నారు. సమాజ సేవ చేయాలనేది ఆమె ఆశయం. ఐఏఎస్‌లు ధాత్రిరెడ్డి, దురిశెట్టి అనుదీప్ ఆమెకు రోల్‌మోడల్. ■

విద్యుద్ఘాతంతో కార్మికుడి మృతి

నవతెలంగాణ-మనోహరాబాద్

విద్యుద్ఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిన కార్మికుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కొండాపూర్ పారిశ్రామిక వాడలోని శ్రియన్ పాలిమర్స్ పరిశ్రమలో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రఘునాథ్ (23) శ్రియన్ పాలిమర్స్ పరిశ్రమలో కార్మికునిగా పని చేస్తున్నాడు. రోజూలాగే మంగళవారం మిషన్ వద్ద రఘునాథ్ విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. వెంటనే పరిశ్రమ యాజమాన్యం కార్మికుడిని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స

పొందుతూ పరిస్థితి విషమించి రఘునాథ్ మృతిచెందాడు. దాంతో పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు సేఫ్టీ ప్రికాషన్స్‌ను అందించడం లేదని, యాజమాన్య నిర్లక్ష్యం మూలంగానే కార్మికుడు మృతి చెందాడని కార్మికునికి న్యాయం చేయాలంటూ తోటి కార్మికులు పరిశ్రమ ఎదుట నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన విరమింపచేశారు. ఈ మేరకు మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సీఐటీయూ మెదక్ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి



కొండాపూర్ పారిశ్రామిక వాడలోని శ్రియన్ పాలిమర్స్ పరిశ్రమలో కార్మికుని మృతికి యాజమాన్యమే బాధ్యత వహించాలని, ఆయన కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఐటీయూ మెదక్ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. పరిశ్రమలో సేఫ్టీ ప్రికాషన్స్‌ను కార్మికులకు అందించని యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, కార్మికుని మృతదేహాన్ని ఆయన సొంత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌కు తరలించేందుకు పరిశ్రమ యజమాన్యమే ఖర్చులు భరించాలని డిమాండ్ చేశారు.

విదేశీ యువతిపై లైంగికదాడి

(మొదటిపేజీ తరువాయి)

స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం మహేశ్వరం జోన్ ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జర్మన్ దేశానికి చెందిన 22 ఏండ్ల యువతి, ఆమె స్నేహితుడు మిలన్ ఇద్దరూ కలిసి మార్చిలో హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో నివాసం ఉంటున్న వారి స్నేహితుడు శరత్ వద్దకు వచ్చారు. అందరూ కలిసి నగరంలోని పర్యాటక ప్రదేశాల్లో పర్యటించారు. అయితే, వరంగల్ జిల్లాలోని అతని బంధువులకు ఆరోగ్యం బాగాలేదని తెలిసి శరత్ సోమవారం అక్కడకు వెళ్లాడు. దాంతో యువతి, మిలన్ ఇద్దరూ కలిసి కొన్ని ప్రాంతాలను చూసి రావడానికి మీర్‌పేట్ పరిధిలో ఉన్న మంద మల్లమ్మ చౌరస్తా వద్దకు సోమవారం సాయంత్రం వెళ్లారు. అదే సమయంలో యాకత్‌పురాకు చెందిన అస్లాం అనే యువకుడు ఐదుగురు స్నేహితుల(మైనర్లు)తో కలిసి కారులో అక్కడకు వచ్చాడు. విదేశీ యువతిని చూసి హాయ్ అంటూ అస్లాం పలకరించగా.. వారు కూడా హాయ్ అన్నారు. అనంతరం అస్లాం ఆ యువతి, మిలన్ వివరాలు అడిగి తెలుసుకున్నాడు. పర్యాటక ప్రదేశాలకు తీసుకెళ్తానని వారిని కారులో ఎక్కించుకుని యాకత్‌పురా, చార్మినార్ తదితర ప్రాంతాల్లో తిప్పాడు. చివరకు పహడిషరీఫ్ ప్రాంతం.. మామిడిపల్లిలోని గుట్టల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ తన స్నేహితులను, మిలన్‌ను దింపి.. మీరు ఇక్కడ ఫొటోలు తీసుకుంటూ ఉండండి అని చెప్పి యువతిని తీసుకుని అస్లాం కారులో ముందుకు వెళ్లాడు. అనంతరం కారులోనే యువతిపై లైంగికదాడికి ఒడిగట్టాడు. తర్వాత యువతిని, ఆమె స్నేహితున్ని పహడిషరీఫ్ ప్రధాన రహదారిపై వదిలి వెళ్లిపోయాడు. బాధిత యువతి తన స్నేహితుడితో కలిసి అక్కడి నుంచి ఆటోలో మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా, ఘటన పహడిషరీఫ్ పరిధిలోకి వస్తుందని తిప్పి పంపించారు. దాంతో వారు పహడిషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు ఏసీపీ తెలిపారు.

ప్రతీకారానికి సమయమిదే

(మొదటిపేజీ తరువాయి)

వస్తువులపై ఎంతమాత్రం ఆధారపడాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. అయితే ఏయే దేశాలపై ఏ మేరకు సుంకాలు విధిస్తారో ఇంకా తెలియడం లేదు.

అమెరికాపై అత్యధిక సుంకాలు వసూలు చేస్తున్న దేశాల జాబితాను కరోలిన్ మీడియాకు చూపించారు. "దురదృష్టవశాత్తూ కొన్ని దేశాలు చాలా కాలంగా మమ్మల్ని టారిఫ్‌ల రూపంలో పీల్చేస్తున్నాయి. అవన్నీ అన్యాయమైన వాణిజ్య విధానాలు. అమెరికా డెయిరీ ఉత్పత్తులపై ఐరోపా సమాఖ్య 50శాతం సుంకాలు వసూలు చేస్తోంది. మా బియ్యంపై జపాన్ 700శాతం, యూఎస్ వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100 శాతం, మా బటర్, చీజ్‌పై కెనడా 300 శాతం టారిఫ్ వసూలు చేస్తున్నాయి. వీటి వల్ల మా ఉత్పత్తులను ఆయా మార్కెట్లకు పంపించడం అసాధ్యంగా కన్పిస్తోంది. అమెరికన్ల వ్యాపారాలు దెబ్బతింటున్నాయి. అందుకే ఆయా దేశాలపై ప్రతీకార సుంకాలు విధించేందుకు ఇదే సమయం అని భావిస్తున్నాం" అని ఆమె వివరించారు.

వాణిజ్య సంబంధాల విషయంలో అమెరికా అధ్యక్షుడు చరిత్రాత్మక మార్పును తీసుకురాబోతున్నారని కరోలిన్ అన్నారు. అమెరికా ప్రజల క్షేమం కోరి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నారని, బుధవారం (ఏప్రిల్ 2) నుంచి అమల్లోకి రాబోతున్నాయని తెలిపారు. అంతకుముందు అధ్యక్షుడు ట్రంప్ కూడా దీనిపై స్పందించిన సంగతి తెలిసిందే. "పరస్పర ప్రతీకార సుంకాల విషయంలో మేం శాశ్వత నిర్ణయం తీసుకోబోతున్నాం. అది మా దేశానికి భారీ గేమ్ ఛేంజర్ లాంటిది" అని అన్నారు.

అంతేకుండా.. తమ ప్రతీకార సుంకాలు ప్రపంచంలోని అన్ని దేశాలపైనా ఉంటాయని ట్రంప్ స్పష్టం చేశారు. 'చాలా ఏండ్లుగా మేం ప్రపంచ దేశాలతో ఉదారంగా వ్యవహరించాం. కానీ చరిత్రలో ఏ దేశాన్నీ దోచుకోని విధంగా అవి అమెరికాను దోచుకున్నాయి. వాణిజ్య పాలసీల విషయంలో కొన్నిసార్లు అమెరికా మిత్ర దేశాలు.. శత్రువుల కంటే దారుణంగా ప్రవర్తించాయి. దశాబ్దాలుగా వారు మనపై విధించిన, వివిధ పేర్లతో దోచుకున్న దానికంటే ప్రస్తుతం అగ్రరాజ్యం ఇతర దేశాలపై విధిస్తున్న సుంకాలు చాలా తక్కువ" అని అధ్యక్షుడు తెలిపారు.

మినహాయింపులుండవ్..

భారత్ సహా కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ప్రతీకార సుంకాలకు సిద్ధమైంది అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తుది నిర్ణయాన్ని ప్రకటించాక... ఇందులో ఎలాంటి మినహాయింపులు లేవని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. తాజాగా దీనిపై వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ మాట్లాడారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ 100శాతం సుంకాలు వసూలు చేస్తోందని అన్నారు. ఇతర దేశాలు విధించే అధిక సుంకాల వల్ల అమెరికా ఉత్పత్తులను ఎగుమతి చేయడం అసాధ్యంగా మారుతోందని అన్నారు. అందుకే వాటిపై ప్రతీకార సుంకాలకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు.

మార్కెట్లలో టారిఫ్‌ల కల్లోలం

ముంబయి : దలాల్ స్ట్రీట్‌లో అమెరికా ప్రతీకార సుంకాల భయాలు అల్లకల్లోలం సృష్టించాయి. ఈ దెబ్బతో ఆర్థిక సంవత్సరం 2025-26 తొలిరోజు మంగళవారం ఒక్క పూటలోనే రూ.3.44 లక్షల కోట్ల మదుపర్ల సంపద హరించుకుపోయింది. ట్రంప్ నిర్ణయాలు ముఖ్యంగా ఐటీ కంపెనీల ఆదాయాలపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయనే అంచనాలు ఆ రంగం షేర్లను కుప్పకూలేలా చేశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన బీఎస్ఈ సెన్సెక్స్ తుదకు 1,390 పాయింట్లు లేదా 1.80 శాతం పతనమై 76,024కు పడిపోయింది. సెన్సెక్స్ 76,882.58 పాయింట్ల నష్టం వద్ద ప్రారంభం కాగా.. ఓ దశలో 75,912 కనిష్టాన్ని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ-50 సూచీ 353.65 పాయింట్లు లేదా 1.5 శాతం కోల్పోయి 23,166కు దిగజారింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.3.44 లక్షల కోట్లు ఆవిరి.. రూ.409 లక్షల కోట్లకు పడిపోయింది. మరోవైపు చమురు ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీవల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి చేరింది. భారత్ చమురు దిగుమతి ప్రధాన దేశంగా ఉండటంతో ధరల పెరుగుదల మార్కెట్లపై విశ్వాసాన్ని దెబ్బతీశాయి.

ప్రతికూలాంశాలు..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతికార సుంకాలపై ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు ముందు జాగ్రత్తగా అమ్మకాలకు దిగారు. అమెరికాలో ఐటీకి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చుననే అంచనాలతో ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. దేశీయ ఐటీ కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. చాలా నెలల తర్వాత ఇటీవల సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా 8 సెషన్లలో దాదాపు 5 శాతానికి పైగా పెరగడంతో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. మార్కెట్లు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్న వేళ రిటైల్ మదుపర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆ రెండు తప్ప..

సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాలను చవిచూశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. వీఐలో కేంద్రం తన వాటాను 22.6 శాతం నుంచి 49 శాతానికి పెంచుకునేందుకు అంగీకరించడంతో ఆ టెలికాం కంపెనీ షేర్లు 20 శాతం మేర లాభపడ్డాయి. ఎన్ఎస్ఈలో 20.15 శాతం ఎగిసి రూ.8.17 వద్ద ముగిసింది.

గుజరాత్ బాణాసంచా గిడ్డంగిలో
భారీ అగ్ని ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

సంస్థకు చెందిన బాణసంచా తయారీ యూనిట్‌లో పలువురు కార్మికులు పని చేస్తుండగా ఉదయం 9.30 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత ఆరు గంటల వరకూ అగ్నికీలలు ఎగిసిపడుతూనే ఉన్నాయి. వాటిని అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది చాలా శ్రమ పడాల్సి వచ్చింది.

గిడ్డంగిలో బాణసంచా తయారీ సామగ్రిని పెద్ద ఎత్తున నిల్వ చేశారు. దీంతో మంటలను అదుపు చేయడం కష్టమవుతోంది. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ నాలుగు లక్షల రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి యాభై వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మందుల ధరలు ప్రియం

(మొదటిపేజీ తరువాయి)

ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) వెల్లడించింది. 2023తో పోల్చితే 2024లో నమోదైన టోకు ద్రవ్యోల్బణం సూచీ ఆధారంగా ఔషధ ధరలను గరిష్ఠంగా 1.74 శాతం పెంచినట్టు ఎన్‌పీపీఏ వెల్లడించింది. ద్రవ్యోల్బణం పెరుగుదలకు అనుగుణంగా ఫార్మా కంపెనీలు ఔషధ తయారీదారులు ప్రతి ఏడాది గరిష్ట రిటైల్ ధరలను పెంచుకునే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ఆ సంస్థలు కేంద్రం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని ఎన్‌పీపీఏ వర్గాలు తెలిపాయి.

కొత్త ధరలు..

సవరించిన ధరలను ఎన్‌పీపీఏ తన వెబ్‌సైట్‌లో ఉంచింది. యాంటీబయాటిక్ అజిత్రోమైసిన్ 250 ఎంజీ ఒక్కో టాబ్లెట్ ధర రూ.11.87, 500ఎంజీ ధర రూ.23.97కు పెరిగింది. అమోక్సిసిలిన్, క్లావులానిక్ యాసిడ్ కలిగిన యాంటీబయాటిక్ డ్రై సిరప్ ధర ఒక్కో ఎంఎల్ గరిష్ఠ ధరను రూ.2.09గా నిర్ణయం. పెయిన్ కిల్లర్ డైక్లోఫెనాక్ టాబ్లెట్ గరిష్ఠ ధర రూ.2.09కు, ఇబుప్రోఫెన్ 200ఎంజీ ఒక టాబ్లెట్ ధర రూ.0.72 కాగా.. 400ఎంజీ టాబ్లెట్ ధర రూ.1.22కు పెరిగింది. డయాబెటిస్‌కు వాడే డపాగ్లిఫ్లోజిన్ ఫ్లస్ మెట్‌ఫార్మిన్ హైడ్రోక్లోరైడ్ ఫ్లస్ గ్లిమెపిరైడ్ ఒక టాబ్లెట్ రూ.12.74కు చేర్చింది. జ్వరం, చెవి, కంటి, ముక్కు, అనస్తీషియా, గుండె, విటమిన్, డయాబెటిస్‌తో పాటు గుండె జబ్బులకు సంబంధించిన కొన్ని ఔషధాల ధరలను పెంచింది.

నేడు లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు

(మొదటిపేజీ తరువాయి)

విమర్శిస్తూ కాంగ్రెస్‌తో సహా ఇతర ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పార్టీల సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. దీంతో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య గంభీరమైన చర్చ జరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ మాట్లాడుతూ తమ గొంతులను విస్మరిస్తున్నారని, చర్చకు ప్రతిపక్ష పార్టీలు ఎక్కువ సమయం కావాలని కోరుతున్నాయని అన్నారు. మణిపూర్ పరిస్థితి, ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డుపై వివాదం వంటి మరిన్ని అంశాలను సభలో ప్రస్తావించాలని కోరుతున్నామని తెలిపారు. అయితే తాము లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకోవటం లేదని విమర్శించారు. ప్రభుత్వం తన ఎజెండాను తుంగలో తొక్కుతుండటం వల్లే ప్రతిపక్షాలు బీఏసీ సమావేశం నుంచి వాకౌట్ చేశాయని తెలిపారు. ప్రతిపక్షాలకు అక్కడ చోటు లేదని పేర్కొన్నారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని చర్చ సమయంలో తన అభిప్రాయాన్ని వెల్లడిస్తానని అన్నారు. ఈ బిల్లు ముస్లింల మత స్వేచ్ఛను అరికట్టే లక్ష్యంతో ఉందని, టీడీపీ. జేడీయూ వంటి బీజేపీ మిత్రపక్షాలకు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ బిల్లును బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రశ్నోత్తరాలు ముగిసిన తరువాత ప్రతిపాదిస్తామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కొన్ని పార్టీలు చర్చ నుంచి పారిపోవడానికి సాకులు చూపుతున్నాయని విమర్శించారు. "మేము వక్ఫ్ బిల్లుపై చర్చను కోరుకుంటున్నాం. కానీ ప్రతిపక్షం భయాందోళనలకు పాల్పడుతోంది. చట్టాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోంది. ప్రతిపక్షం వాకౌట్ చేయడం చర్చను నివారించడానికి ఒక సాకు. క్రైస్తవ సమాజం కూడా బిల్లుకు మద్దతు ఇస్తోంది" అని రిజిజు అన్నారు.

ఇండియా బ్లాక్ పార్టీల భేటీ

బుధవారం లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు రాబోతున్న నేపథ్యంలో ఇండియా బ్లాక్ పార్టీలు సమావేశం అయ్యాయి. మంగళవారం సాయంత్రం పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్, డీఎంకే, ఎన్‌సీపీ, సీపీఐ(ఎం), సీపీఐ ఎస్పీ, ఆర్‌జేడీ, ఎండీఎంకే, వీసీకే, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్, ఆర్ఎస్పీ, సీపీఐఎంఎల్ తదితర ఇండియా బ్లాక్ పార్టీల నేతలు సమావేశం అయ్యారు. వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. అనంతరం ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుపై ఇండియా బ్లాక్ చర్చలో పాల్గొంటుందని అన్నారు. "మేము చర్చలలో పాల్గొంటాం. మేము ప్రభుత్వం ఏం చెబుతుందో వింటూనే, మా సత్యాన్ని బలంగా వినిపిస్తాం. రాజ్యాంగం ప్రకారం పనిచేసే వారితో మేము నిలబడతాం. ఇండియా బ్లాక్ సమావేశంలో మంచి చర్చ జరిగింది. మేము కలిసి చర్చించుకుంటాం" అని అన్నారు.

బీజేపీ, కాంగ్రెస్, టీడీపీతో సహా ఇతర పార్టీలు విప్ జారీ

వక్ఫ్ సవరణ బిల్లు లోక్‌సభలో చర్చకు వస్తున్న నేపథ్యంలో అన్ని పార్టీలు తమ వ్యూహాలను, ఎత్తుగడలను నిర్ణయించుకుంటున్నాయి. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్, టీడీపీతో సహా వివిధ పార్టీలు తమ సభ్యులకు విప్ జారీ చేశాయి. పార్లమెంట్‌లో హాజరుకావాలని విప్‌లో పేర్కొన్నారు. 542 మంది లోక్‌సభ ఎంపీల్లో ఎన్‌డీఏకి 293 మంది ఎంపీలు ఉన్నారు. బీజేపీ, టీడీపీ, జేడీయూ ఎల్‌జేపీ, జనసేన వంటి పార్టీలు ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాయి.



మహాసభ ప్రాంగణంలో పోరాటయోధులకు అమరవీరుల జ్యోతులను అందజేసిన అనంతరం మాట్లాడుతున్న బృందాకరత్



అమరుల త్యాగాలకు గుర్తుగా జ్యోతులను అందజేస్తున్న దృశ్యం

'మనీ-మను' వాదాలపై పోరాటం

అమరులస్ఫూర్తితో ఆశయాలు సాధిస్తాం
సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

సీతారాంఏచూరి నగర్ (మదురై) నుంచి
నవతెలంగాణ ప్రతినిధి

పేద ప్రజలను లూటీ చేసి వేల కోట్లు పోగేసుకునే కార్పొరేట్ విధానాలపైనా, దేశ ప్రజలను కుల, మత ప్రాతిపదికన చీల్చే మనువాదంపైనా సంఘటిత పోరాటాలు చేయాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్ అన్నారు. తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజానీకం నిర్వహించిన అమరవీరుల జ్యోతులు సీపీఐ(ఎం) 24వ మహాసభ జరుగుతున్న మదురైలోని సీతారాం ఏచూరి నగర్(మదురై కన్వెన్షన్ సెంటర్)కు చేరుకున్నాయి. అమరవీరులకు జేజేలు పలుకుతూ, వారి ఆశయాలను సాధించి తీరుతామంటూ దారి పొడవునా ప్రజానీకం చేసిన ప్రతినల మధ్య అత్యంత స్ఫూర్తిదాయకంగా ఈ జ్యోతులు మహాసభ ప్రాంగణానికి చేరుకున్నాయి. తమిళనాడులోని ఐదు ప్రాంతాల నుంచి ప్రారంభమైన ఈ జ్యోతులకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. మంగళవారం సాయంత్రం మహాసభ ప్రాంగణంలోనూ అదే స్ఫూర్తి కనిపించింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులతో పాటు, స్థానిక ప్రజలు ఈ జ్యోతులకు స్వాగతం పలికారు. 'అమరులకు జేజేలు... ఆశయాలను సాధిస్తాం, వివక్షను అంతం చేస్తాం, మతోన్మాదాన్ని ఎదుర్కొంటాం' అన్న నినాదాలు మారుమ్రోగాయి. వివిధరంగాలకు చెందిన పోరాట యోధులకు హోరాెత్తిన నినాదాల మధ్య జ్యోతులను అందజేశారు. అనంతరం బృందాకరత్ మాట్లాడుతూ దేశాన్ని పాలిస్తున్న పాలకులు ప్రజలను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారని అన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇటీవల మరణించిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పిన మాటలను గుర్తుచేశారు. 'సీపీఐ(ఎం) రెండు పాదాలతో ముందుకు నడుస్తుంది. ఒకటి కార్మికులను, ప్రజలను దోచుకుని వారి రక్తమాంసాలతో వ్యాపారం చేసి లాభాలు పోగేసుకునే పెట్టుబడి దారి విధానం... ఈ దోపిడీకి వ్యతిరేకంగా మనం నిరంతరం పోరాటం చేస్తాం. ప్రజలను కులం పేరుతో, మతం పేరుతో చీల్చే మనువాదంపై చేసే పోరాటంతో మరో అడుగు ముందుకు వేస్తామని మన ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పదేపదే చెప్పేవారు. ఆ మాటలను జ్ఞాపకం చేసుకోవాలి' అని ఆమె అన్నారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న 24వ మహాసభ స్ఫూర్తిదాయకమైన ఈ మాటల వెలుగులోని జాతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చిస్తుందని చెప్పారు. కార్పొరేట్, మనువాద, మతోన్మాద విధానాలను సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రత్యామ్నాయాన్ని అందిస్తామని అన్నారు. స్వాతంత్ర్య సమరంలోనూ, ఆ తరువాత పేద ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరుల ఆశయాలను సాధించి తీరుతామని చెప్పారు. అంతకుముందు భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సీనియర్ జర్నలిస్టు ఎన్.రామ్ మాట్లాడుతూ అత్యంత కీలకమైన సందర్భంలో 24వ మహాసభ జరుగుతోందని అన్నారు. కార్పొరేట్ దోపిడీతో పాటు విషం చిమ్ముతున్న మతోన్మాదం దేశ ప్రజానీకానికి శత్రువులుగా మారాయని అన్నారు. అయితే, అధికారబలంతోనూ, తప్పుడు ప్రచారాలతోనూ ఆ శక్తులను ప్రజలను మభ్యపరుస్తున్నాయని అన్నారు. అయితే, ఈ పరిస్థితి ఎల్లకాలం ఉండదని, దేశంలో లౌకిక. ప్రజాతంత్ర శక్తులు ముందుకొచ్చే రోజులు త్వరలోనే వస్తాయని అన్నారు. అయితే, ఆ పరిస్థితి రావాలంటే వామపక్షాలు బలపడాలని, ముఖ్యంగా సీపీఐ(ఎం) బలం భారీగా పెరగాలని ఆయన ఆకాంక్షించారు. సీపీఐ(ఎం) విడుదల చేసిన రాజకీయ ముసాయిదా తీర్మానంపై దేశ వ్యాప్తంగా ఇప్పటికే విస్తృతంగా చర్చ జరుగుతోందని, మహాసభలో మరింతగా మేథోమధనం జరిగి దేశానికి నూతన దిశను చూపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి షణ్ముగం, స్థానిక ఎంపీ వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.





ఎరుపెక్కిన మదురై

అమరజ్యోతులివే....

కిళ్వేన్మణ అమరవీరుల త్యాగానికి, వారి పోరాటానికి గుర్తుగా ఈ జ్యోతిని తీసుకువస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నం జిల్లాలోని ఒక గ్రామం ఇది. 1968 డిసెంబర్ 25న సమ్మె చేస్తున్న దళిత గ్రామ కార్మికుల కార్మిక కుటుంబాలకు చెందిన 44 మందిని స్థానిక భూస్వాములు దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన తీవ్ర ప్రభావం చూపింది. ప్రజలు పెద్ద ఎత్తున కదిలారు. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పులను ప్రారంభించడం అనివార్యంగా మారింది. ఈ ప్రాంతంలో పేద ప్రజలకు భూ పంపిణీ చేయడానికి ఈ పోరాటం దారి తీసింది. సీపీఐ(ఎం) వారికి అండగా నిలిచింది. ఆ పోరాటం రోజు రోజుకు తీవ్రమై పొరుగు గ్రామాలకు విస్తరించడం ప్రారంభమైంది. ఇది సహించలేని స్థానిక పెత్తందారులు రెచ్చిపోయారు. కిరాయి మూకలతో అనూహ్యంగా దాడికి దిగారు. దీనిని ప్రతిఘటించడానికి దళిత కార్మికులు, మహిళలు చేసిన పోరాటం ఏ మాత్రం ఫలితమివ్వలేదు. పారిపోయిన వారిని వెంటాడి నరికారు. హింసాకాండకు భయపడి గుడిసెలో దాక్కున్న వారిపై పెట్రోలు పోసి తగలబెట్టారు. ఈ సంఘటనలో అభం,శుభం తెలియని పసిమొగ్గలు కూడా బూడిదకుప్పగా మిగిలారు. అయితే, వీరి త్యాగం వృథా కాలేదు. ఆ తరువాత కూలీలు పెరిగాయి. భూ పంపిణీ జరిగింది. ఈ మహత్తర పోరాటానికి, త్యాగాలకు గుర్తుగా కిళ్వేన్మణి గ్రామం నుంచి తీసుకువచ్చిన అమరవీరుల జ్యోతిని మహాసభ ప్రాంగణం వద్ద నేతలకు అందజేశారు.

విద్యార్థి అమరులు...

విద్యార్థి వీరులు, ఆశయాల ధీరులు, కులవివక్షపై ఎక్కుపెట్టిన బాణాలు, అవినీతి అంతం చూసే వరకు విశ్రమించని యోధులు, ఈ లక్షణాలే సోమసుందరం, సోమలింగంపై శత్రు మూకల కన్ను పడటానికి కారణం. ప్రస్తుతం సీపీఐ(ఎం) మహాసభ జరుగుతున్న మదురై పటటణానికి సమీపంలోని ఒక చిన్న గ్రామంలో దళిత కుటుంబంలో ఒకే సంవత్సరం వీరు పుట్టారు. బాల్యం నుండి చదువులో ముందు ఉండటంతో పాటు, వివక్షను గట్టిగా ప్రశ్నించేవారు. సహజంగానే ఇది అగ్రకులాల వారికి నచ్చేదికాదు, మదురైలోని తియ్యగర్జార్ ఇంజినీరింగ్ కళాశాలలో చేరిన తరువాత కూడా వారిది పోరాటబాటే. దానికి తగ్గట్టే కళాశాల అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్‌ఎఫ్‌ఐ తరపున భారీ మెజార్టీ గెలిచారు. ఇది ఏమాత్రం సహించలేని మనువాద, అగ్రకుల విద్యార్థులు కళాశాల బయట వారిని వెంటాడి మార్చి 31 1981న వారిని వేటకొడవళ్లకు బలిచేశారు. వారి ఆశయాల కొనసాగింపును ప్రతిన చేసిన విద్యార్థి ఉద్యమం వారి పేర్లతో ఒక జ్యోతిని ప్రజా పోరాటాల వేదిక వద్దకు తీసుకు వస్తోంది.

సేలం అమరుల స్ఫూర్తితో

సేలం జైలులో 1950 ఫిబ్రవరి 11న జరిగిన అమానుష సంఘటన ఇది. భూ స్వాములకు, వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కమ్యూనిస్టులను, కిసాన్‌సభ కార్యకర్తలను, వ్యవసాయ కార్మిక సంఘం నేతలను పోలీసులు అరెస్ట్ చేసి సేలం జైలులో కుక్కిన రోజులవి. తమిళనాడుతో పాటు, మలబారు, ఆంధ్ర ప్రాంతాలలోని నాయకులను ఇక్కడ నిర్బంధించారు. ఆ సమయంలోనే కమ్యూనిస్టు పార్టీని నిషేధించారు. దీంతో రాజకీయ ఖైదీలను ముఖ్యంగా కమ్యూనిస్టులపై జైలు సిబ్బంది అమానుషంగా ప్రవర్తించేవారు. నేరాలు చేసిన సాధారణఖైదీలతో కలిపి ఉంచడంతో పాటు, వారి తరహా డ్రస్సే ధరించాలని, వారికి అమలు చేసే నిబంధనలనే అమలు చేస్తామని జైలు అధికారులు చెప్పారు. సహజంగానే దీనిని కమ్యూనిస్టులు తిరస్కరించారు. ఇది కాస్తా ఆందోళనగా మారింది. ఫిబ్రవరి11న డిప్యూటీ జైలర్ నేతృత్వంలో పోలీసులు విరుచుకు పడ్డారు. ఒక్కసారిగా కాల్పులు జరిపారు. దీంతో 22 మంది కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయారు. 17 మంది అక్కడికక్కడే మరణించగా మిగిలిన వారు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రాణాలు విడిచారు. మరణించిన వారిలో 19 మంది కేరళకు చెందిన వారు, ఇద్దరు తమిళనాడు, ఒక్కరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు. వారి స్ఫూర్తితో సేలం నుంచి జ్యోతిని మహాసభ ప్రాంగణానికి తీసుకువచ్చారు

అభినవ భగత్‌సింగ్‌లు

అవును వారు అభినవ భగత్‌సింగ్‌లే... ప్రాణాలు పోతున్నా, ఉరితాడుకు వేలాడుతున్న ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినదించారు. కార్మిక వర్గ విప్లవాన్నే తుది శ్వాసలోనూ శ్వాసించారు. టెక్స్‌టైల్ రాజధానిగా పేరుగాంచిన కోయంబత్తూరులో ఈసంఘటన జరిగింది. మిల్లు కార్మికుల హక్కుల కోసం నిలబడినందుకు, ఒక మహిళా కార్మికురాలిపై జరిగిన అఘాయిత్యాన్ని ప్రశ్నించినందుకు రామయ్యన్, రంగనాన్, వెంకటాచలం, చిన్నయ్యర్ అనే కార్మికులను పోలీసులు నిర్బంధించారు. వారిపై రకరకాల నేరాలు మోపారు. హింసాకాండకు పాల్పడ్డారని, మహిళపై అఘాయిత్యానికి కూడా వారే పాల్పడ్డారని ఆరోపించారు. దీనిని ఆ మహిళ ఖండించింది. కోయంబత్తూరులోని మిల్లు వర్కర్లు అందరూ ఆగ్రహోదగ్రులయ్యా రు. నిరవధిక సమ్మెకు దిగారు. కేసు విచారించిన ప్రివ్యూ కౌన్సిల్ ఆ నలుగురికి ఉరిశిక్ష విధించింది. అయితే, ఆ నలుగురిలో నేరం చేసిన ఒక్కరి పేరు చెబితే మిగిలిన వారికి క్షమాభిక్ష పెడతామని ప్రకటించింది, దీనిని వారు తిరస్కరించారు. కార్మికవర్గ ఐక్యత నినాదాలు చేస్తూ ఉరికంభంపై ఒకే సారి ప్రాణాలు వదిలారు. కార్మికవర్గ పార్టీకి వీరికి నివాళులర్పించడం తప్పని సరి కర్తవ్యం కదా! అందుకే కోయంబత్తూరు నుండి ప్రత్యేకంగా అమరజ్యోతిని ఒక బృందం తీసుకువచ్చింది.

అమరుల ఆశయాలను కొనసాగిస్తామని ప్రతినబూనారు.

తాగునీటి కోసం...

పేద ప్రజలకు తాగునీటి కోసం పోరాటం చేసి, ఆ పోరాటంలో భాగంగానే అమరులైన సీపీఐ(ఎం) కౌన్సిలర్ కామ్రేడ్ లీలావతితో పాటు మదురై నగరంలో ప్రజల కోసం ప్రాణాలు విడిచిన ఎందరో అమరుల స్థూపాల నుంచి జ్యోతిని మహాసభ ప్రాంగణం వద్దకు తీసుకువస్తున్నారు. లీలావతి 1996అక్టోబర్‌లో మదురై నగరంలో సీపీఐ(ఎం) తరపున వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైనారు. అప్పటి నుంచి ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చడం కోసం ఆమె అనేక పోరాటాలు చేశారు. అయితే, దీనిని తాగునీటి మాఫియా తీవ్రంగా అడ్డుకుంది. ఆమెపై అనేక దాడులు చేసింది. చివరకు ఆమె తాగునీటి పథకానికి ఆమోదం పొందడంతో నిధులను కూడా సాధించింది. అయితే, ఆ పథకం ప్రారంభోత్సవానికి మూడు రోజుల ముందు ఆమెను మాఫియా హత్య చేసింది. దీంతో నగరంలో తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అంతిమయాత్రలో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు. ఆమె జ్ఞాపకార్థం తీసుకువస్తున్న అమరవీరుల జ్యోతికి కూడా అదే విధమైన స్పందన కనిపించింది.



ప్రాంగణానికి సీతారాం ఏచూరి పేరు

(మొదటిపేజీ తరువాయి)

అందజేస్తారు. ఆ తరువాత మహాసభల ప్రారంభ సూచికగా సీనియర్ నేత బిమన్ బసు అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఆ వెంటనే ఉదయం 10 గంటలకు పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ అధ్యక్షతన ప్రారంభసభ ఆరంభమవుతుంది. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు కె.బాలకృష్ణన్ స్వాగతోపన్యాసం చేస్తారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ ప్రారంభోపన్యాసం చేస్తారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు సీపీఐ ఎం.ఎల్ (లిబరేషన్) ప్రదాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆరెస్పీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జీ.దేవరాజన్ సౌహార్ద సందేశాలను ఇస్తారు. మదురై ఎంపీ వెంకటేశన్ ధన్యవాదాల తీర్మానంతో ప్రారంభ సభ ముగియనుంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అగ్రనాయకత్వం
మహాసభకు చేరుకుంటున్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు
కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు
ఎగ్జిబిషన్‌లో సందర్శకులు

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



సామూహిక లైంగికదాడి నిందితులకు కఠిన శిక్షలు

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ

హైదరాబాద్ మల్టీ జోనల్ ఐజీ వి.సత్యనారాయణ

ఊరుకొండపేట ఆంజనేయస్వామి పరిసరాల్లో పరిశీలన

నవతెలంగాణ - ఊరుకొండ

నాగర్‌కర్నూలు జిల్లా ఊరుకొండ మండలం ఊరుకొండపేట ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో మహిళపై సామూహిక లైంగికదాడి కేసులో నిందితులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ మల్టీ జోనల్ ఐజీ వి.సత్యనారాయణ తెలిపారు. ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఘటనా స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఘటన చాలా అమానుషమన్నారు. ఊరుకొండపేట గ్రామానికి చెందిన మహేష్‌గౌడ్, హరీష్‌గౌడ్, మారుపాకుల అంజిగౌడ్, మట్ట అంజిగౌడ్, మణికంఠ గౌడ్, సాదిక్ బాబా, ఎల్లికట్ల కార్తీక్ గౌడ్ కలిసి గుడికి వచ్చిన మహిళపై సామూహిక లైంగిక దాడి చేశారని తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినట్టు విచారణలో తేలిందన్నారు.

దుండగులు చాలా తెలివిగా వ్యవహరించి.. బాలికలను, ప్రేమ జంటలుగా వచ్చిన మైనర్లను టార్గెట్ చేసి డబ్బులు వసూలు చేసినట్టు విచారణలో బయటపడిందని తెలిపారు. ఈ ఘటనపై బాధిత మహిళ బంధువు ఫిర్యాదు చేసిన వెంటనే జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్, కల్వకుర్తి డీఎస్పీ, సీఐ నాగార్జున, ఊరుకొండ ఎస్ఐ కృష్ణదేవ దర్యాప్తు ప్రారంభించినట్టు చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా, టెక్నికల్ శాస్త్రీయ పరిజ్ఞానం ద్వారా నిందితులను గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఈ ఘటనపై డీజీపీ డాక్టర్ జితేందర్ ఆదేశాల మేరకు ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, త్వరగా దర్యాప్తు పూర్తి చేసి తగిన ఆధారాలను కోర్టు ముందుంచి కఠిన శిక్ష పడేలా చూస్తామని చెప్పారు. ఆలయం సమీపంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దేవాదాయ శాఖ అధికారులు సీసీ కెమెరాలు, చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. ఊరుకొండ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సంఖ్య పెంపు విషయంలో జిల్లా ఎస్పీతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్, డీఎస్పీ, సీఐ నాగార్జున, ఎస్ఐలు కృష్ణదేవ, మాధవరెడ్డి, పోలీస్ సిబ్బంది, దేవాలయ సిబ్బంది, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి కోసం మహిళల ధర్నా

- సంగారెడ్డి జిల్లా కంది గ్రామపంచాయతీ ఎదుట నిరసన

నవతెలంగాణ-కంది

సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామ ప్రజలు ఆందోళన చేపట్టారు. పదిహేను రోజులుగా నీళ్ల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ 8వ వార్డుకు చెందిన మహిళలు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ధర్నా చేపట్టినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల అధికారులు, తహసీల్దార్ విజయలక్ష్మి, నాయబ్ తహసీల్దార్ మల్లయ్య.. వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. కానీ నీళ్ల వస్తేనే ధర్నా విరమిస్తామని మహిళలు తెగేసి చెప్పారు. ఈ నిరసనపై టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తినట్టు తహసీల్దార్ చెప్పారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని తహసీ ల్దార్‌కు నిర్మల సూచించారు. దాంతో అధికారులు అప్పటికప్పుడు కొత్త బోరు పంపు మోటర్‌ను తీసుకొచ్చి బిగించడంతో వారు ఆందోళనను విరమించారు.

చైనా, భారత్ బంధానికి 75ఏండ్లు

కలిసి పనిచేసేందుకు సిద్ధమన్న జిన్‌పింగ్ | పరస్పర విశ్వాసంతో ముందుకు సాగాలన్న ద్రౌపది ముర్ము



బీజింగ్ : చైనా, భారత్‌ల మధ్య దౌత్య బంధానికి 75ఏండ్లు పూర్తయ్యాయి. ఈ వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం అభినందన సందేశాలు పరస్పరం పంపుకున్నారు. చైనా, భారత్‌లు రెండూ ప్రాచీన నాగరికతలు కలిగిన దేశాలని, ప్రధాన వర్ధమాన దేశాలని, గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్య దేశాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఈ రెండు దేశాలు వాటి ఆధునీకరణ ప్రయత్నాల్లో కీలకమైన దశలో వున్నాయని వ్యాఖ్యానించారు. పరస్పర లక్ష్య సాధనల్లో భాగస్వాములుగా వుండేందుకు, డ్రాగన్-ఏనుగు బంధాన్ని సాకారం చేయడానికి చైనా, భారత్‌లకు ఇది సరైన ఎంపిక అని ఇరు దేశాల మధ్య సంబంధాల అభివృద్ధితో స్పష్టమవుతోందని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. ఇరు దేశాలు, ప్రజల ప్రాధమిక ప్రయోజనాలను పూర్తిగా నెరవేర్చడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో ద్వైపాక్షిక సంబంధాలను చూడాలని, నిర్వహించాలని ఆయన ఇరు పక్షాలను కోరారు. శాంతియుత సహజీవనం, పరస్పర విశ్వాసం, పరస్పర ప్రయోజనాలు, ఉమ్మడి అభివృద్ధితో కూడిన పంథాను అనుసరించాల్సి వుందన్నారు. ఇరుగు పొరుగున గల ప్రధాన దేశాలు పరస్పరం సహరించుకుంటూ బహుళ ధృవ ప్రపంచాన్ని, అంతర్జాతీయ సంబంధాల్లో మరింత ప్రజాస్వామ్యాన్ని పెంపొందించాలని కోరారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా వున్నానని చెప్పారు. పరస్పరం వ్యూహాత్మక విశ్వాసాన్ని పెంపొం దించు కునేందుకు, పరస్పర మార్పిడులను బలోపేతం చేసుకునేందుకు, వివిధ రంగాల్లో సహకారానికి, అంతర్జాతీయ వ్యవహారాల్లో కమ్యూనికేషన్‌ను, సమన్వయాన్ని మరింత విస్తరించుకునేందుకు కృషి చేయాలని పిలుపిచ్చారు. చైనా-భారత్ సరిహద్దు ప్రాంతాల్లో శాంతి భద్రతలను ఉమ్మడిగా పరిరక్షించాలన్నారు. ద్రౌపది ముర్ము మాట్లాడుతూ, ప్రపంచ జనాభాల్లో మూడో వంతు జనాభా భారత్, చైనాల్లోనే వున్నారని అన్నారు. సుస్థిరమైన, విశ్వసనీయమైన, స్నేహంతో కూడిన ద్వైపాక్షిక సంబంధాలు ఇరు దేశాలకే కాకుండా యావత్ ప్రపంచానికి లబ్ది చేకూరుస్తాయని చెప్పారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత స్థిరంగా ముందుకు తీసుకెళ్ళడానికి కలిసి కృషి చేయాలని అందుకు ఈ 75ఏళ్ళ వార్షికోత్సవాన్ని ఒక అవకాశంగా తీసుకోవాలని కోరారు. చైనా, ప్రధాని లీ కియాంగ్, భారత ప్రధాని నరేంద్ర మోడీలు కూడా పరస్పరం అభినందన సందేశాలు పంపు కున్నారు. మానవ చరిత్ర గమనానికి ఒక రూపునివ్వ డంలో ఇరు దేశాలు కీలక పాత్ర పోషిం చాయని మోడీ పేర్కొన్నారు. ఇప్పుడు శాంతి, అభివృద్ధిలను కూడా పెంపొం దించే బృహత్తర బాధ్య తలను భుజానకెత్తు కోవాల్సి ఉంద న్నారు. ఇరు దేశాల ప్రజలకు మరింత ఉపయోగ పడేలా ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్ళాలని లీ కియాంగ్ కోరారు.

ఆయుధం పట్టండి

మద్దతుదారులకు హమాస్ సీనియర్ అధికారి పిలుపు



కైరో : గాజా ప్రాంత ప్రజలను నిర్వాసితులను చేయడానికి జరుగు తున్న ప్రణాళికలపై పోరాడేందుకు ఆయుధాలు చేపట్టాల్సిందిగా హమాస్ సీనియర్ అధికారి ఒకరు ప్రపంచ వ్యాప్తంగా గల మద్దతుదారులందరినీ కోరారు. దక్షిణ గాజా నుండి మొత్తంగా ఖాళీ చేయాల్సిందిగా ఇజ్రాయిల్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో హమాస్ అధికారి వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈజిప్ట్, జోర్డాన్ వంటి దేశాలకు గాజా ప్రజలను పంపేయాలన్న ఆలోచన మొదటగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేశారు. ఇక అప్పటి నుండి ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో సహా ఆ దేశ రాజకీయ నేతలందరూ దాన్ని పట్టుకునే వేలాడుతున్నారు. ట్రంప్ ప్రతిపాదనను అమలు చేస్తామని ఆదివారం కూడా నెతన్యాహు పునరుద్ఘాటించారు. ఆహారం అందకుండాచేస్తూ కరువు బారిన పడేలా చేయడమే కాకుండా మారణహోమానికి పాల్పడుతున్న ఈ నీచపుటెత్తుగడలను ఇక భరించరాదని, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడున్నా సరే ఆయుధాలు పట్టుకుని కార్యాచరణకు దిగాలని హమాస్ అధికారి సామి అబూ జూరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "పేలుడు పదార్ధం, బుల్లెట్, కత్తి లేదా రాయి ఏదైనా సరే మీ వద్ద దాచుకోకండి, ప్రతి ఒక్కరూ మౌనం వీడండి." అని పిలుపిచ్చారు.

రోడ్లపై బారులు తీరిన వాహనాలు

చేతికి అందుబాటులో వున్న వాహనాల్లో అవసరమైన సామాన్లను వేసుకుని పిల్లా పాపలతో పాలస్తీనియన్లు రోడ్డున పడ్డారు. కొంతమంది కార్లలో వెళుతుంటే మరికొంతమంది బండ్లపై వెళుతున్నారు. ఇంకొందరు కాలినడకనే మూటా ముల్లె సద్దుకుని వెళుతున్నారు. ఇక్కడ నుండి తరలివెళ్ళిపోవడానికి కేవలం రెండు గంటల సమయమే వుందని, సైనికులు రాకుండానే ఇక్కడ నుండి వెళ్ళిపోవాల్సి వుందని, అందుకే అన్నీ వదిలిపెట్టి వచ్చామని రఫా నగరవాసి నజన్ వ్యాఖ్యానించారు. 9నెలల పసిబిడ్డతో ఆమె రోడ్డెక్కారు.

మూతబడిన బేకరీలు

గాజాలోని బేకరీలన్నీ మంగళవారం మూతబడ్డాయి. మైదా, గోధుమ పిండి లేకపోవడం, డీజిల్ కొరత కారణంగా ఈ పరిస్థితి ఎదురైందని బేకరీ యజమానుల సమాఖ్య అధ్యక్షుడు అబ్దుల్ నాసర్ చెప్పారు. గతేడాది మార్చిలో నెలకొన్న పరిస్థితులే ఇప్పుడూ వున్నాయని అన్నారు. మరోవైపు బీరుట్ నగరంపై రెండోసారి ఇజ్రాయిల్ ఆర్మీ బాంబు దాడులు జరిపింది. కాగా దాడులు షురూ అయ్యాక 50,399 మంది చనిపోయారు. కాల్పుల విరమణ అనంతరం కూడా 1,042 మంది అమాయకులను ఇజ్రాయిల్ బలగాలు చంపేశాయి.

బాంబు తయారీ యూనిట్‌లో పేలుడు ఆరుగురు మృతి

సౌత్ 24 పరగణాలు (పశ్చిమ బెంగాల్) : పశ్చిమ బెంగాల్‌లో సౌత్ 24 పరగణాస్ జిల్లాలోని పథర్‌ప్రతిమ గ్రామంలో ముడి బాంబు తయారీ యూనిట్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని బీజేపీ నేత సువేందు అధికారి మంగళవారం తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. గత నెల 4వ తేదీన పథర్‌ప్రతిమలో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు అని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. మమతా బెనర్జీ ప్రభుత్వంపై ఆయన తీవ్రంగా విమర్శించారు.-ాగా, ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. రెస్క్యూ సిబ్బంది మృతదేహాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు.

కంచ గచ్చిబౌలి భూములపై తక్షణమే నివేదిక పంపండి

అటవీ శాఖ అధికారులకు కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ ఆదేశం

రిపోర్ట్ వచ్చాక తగిన చర్యలు తీసుకుంటామని హామీ : కిషన్ రెడ్డి

ఆధ్వర్యంలో అటవీ, పర్యావరణ మంత్రిని కలిసిన తెలంగాణ ఎంపీలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ కంచె గచ్చిబౌలి (హెచ్‌సీయూ) భూములపై తక్షణమే నివేదికను పంపాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ సంబంధిత శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జి.నగేశ్, రఘునందన్ రావు తదితరులు కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల పర్యావరణ, హెరిటేజ్ భూములని తెలిపారు. హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ సమతుల్యతకు కంచ గచ్చిబౌలి భూములు ఎంతో ప్రయోజనకరమని ఈ సందర్భంగా వారు కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. అనేక రకాల ఔషధ మొక్కలు, వివిధ పక్షి జాతులతో ఆ ప్రాంతమంతా అలరారుతోందన్నారు. ఇంతటి విలువైన భూములను రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్‌గా మార్చి వేల కోట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. హెచ్ సీయూ విద్యార్థులతోపాటు యావత్ హైదరాబాద్ ప్రజలంతా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరే కిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే గచ్చిబౌలి భూముల విషయంలో జోక్యం చేసుకుని ఆ భూములను పరిరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా సానుకూ లంగా స్పందించిన కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ కంచ గచ్చిబౌలి భూములపై తక్షణమే నివేదిక ఇవ్వాలని అటవీ, పర్యావరణ శాఖ అధికారులను ఆదేశించారు. నివేదిక అందిన తరువాత తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కౌలాలంపూర్‌లో పేలిన గ్యాస్ పైప్‌లైన్

బద్దలై చెలరేగుతున్న మంటలు

కిలోమీటర్ల దూరం వరకు కనిపిస్తున్న అగ్నికీలలు

కౌలాలంపూర్ : మలేసియా రాజధాని కౌలాలంపూర్ శివారు ప్రాంతంలో గ్యాస్ పైప్‌లైన్ బద్దలవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. దాంతో సమీప ప్రాంతాల కుటుంబాలను అక్కడ నుండి తరలించారు. సెంట్రల్ సెలంగోర్ రాష్ట్రంలో పుత్రా హైట్స్‌లో గ్యాస్ స్టేషన్‌కు సమీపంలో చెలరేగిన ఈ మంటలు కిలోమీటర్ల దూరం వరకు కనిపిస్తున్నాయని నేషనల్ ఆయిల్ కంపెనీ పెట్రోనాస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 8.10గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొంది. ప్రస్తుతానికి దెబ్బతిన్న పైప్‌లైన్‌ను మిగిలిన వాటి నుండి వేరు చేశామని తెలిపింది. మంటలు చెలరేగుతున్న గ్యాస్ స్టేషన్‌కు సమీపంలోనే మరో మూడు స్టేషన్లు వున్నాయని, ఇవేమీ దెబ్బతినలేదని, కానీ ముందు జాగ్రత్త చర్యగా తాత్కాలికంగా మూసివేశామని పెట్రోనాస్ తెలిపింది. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. ఈ మంటలు సమీప గ్రామంలోని అనేక ఇళ్ళకు వ్యాపించాయని, మంటల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సెలంగోర్ విపత్తు నిర్వహణా విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. అనేకమందికి కాలిన గాయాల య్యాయని, వారికి చికిత్స అందుతోందని, నష్టమెంత జరిగిందనే విషయమై ఇంకా సమీక్ష జరపాల్సి వుందని పేర్కొంది. గ్యాస్ పైప్‌లైన్ వాల్వ్‌ను మూసివేయడం వల్ల నెమ్మదిగా మంటలు ఆరిపోతాయని తెలిపింది.

మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతుగా

5,6 తేదీల్లో కొచ్చిలో మిడ్‌నైట్ మార్కెట్

కొచ్చి : కేరళలోని మహిళా పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ఈ నెల 5,6 తేదీల్లో కొచ్చిలో మిడ్‌నైట్ మార్కెట్‌ను నిర్వహించనున్నారు. నగరంలోని రాజేంద్ర మైదానంలో సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకూ ఈ మిడ్‌నైట్ మార్కెట్‌ను మహిళా పారిశ్రామిక వేత్తల నెట్‌వర్క్ (డబ్ల్యూఈఎన్) నిర్వహించనుంది. ఈ నెల 5న ఎంపి ఈడెన్ ఈ మార్కెట్‌ను ప్రారంభించనున్నారు. కొజికోడ్, కొట్టాయం, త్రిస్సూర్, తిరువనంతపురంల్లో డబ్ల్యూఇఎన్ విస్తరించి ఉంది. ఇందుల్లో వెయికి పైగా సభ్యులు ఉన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతుగానూ, అలాగే మహిళలు, చిన్నారులకు భద్రతను నిర్ధారిస్తూ ఉత్సాహభరిత, వినోదాత్మక వాతావరణంలో ఈ మిడ్‌నైట్ మార్కెట్‌ను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఇందులో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యక్ష సంగీత ప్రదర్శనలు ఉంటాయని, గేమ్ జోన్‌లో ఆటలు, ఈవెంట్స్‌ల్లో సందర్శకులు పాల్గొనవచ్చనని చెప్పారు.

కంచ గచ్చిబౌలి భూములను కాపాడాలి

పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని అమ్మే ప్రక్రియను రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ ఖండించారు. మంగళవారం రాజ్యసభలో దీనిపై ఆయన మాట్లాడారు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయానికి 1974 లో విద్య, పరిశోధనల కోసం ఈ 400 ఎకరాల భూమి కేటాయించబడిందని చెప్పారు. కాని, ప్రభుత్వాలు అనేక సందర్భాల్లో విశ్వవిద్యాలయ భూములను ఇతర ప్రాజెక్టుల కోసం తీసుకుపోయాయని చెబుతూ..ఐఐఐటీ క్యాంపస్, గచ్చిబౌలి స్టేడియం, హెచ్‌సీయూ బస్‌డిపో, పవర్ స్టేషన్, పాఠశాల, షూటింగ్ రేంజ్ వంటి ప్రాజెక్టుల కోసం విశ్వవిద్యాలయ భూములు తీసుకున్నట్టు వివరించారు. '400 ఎకరాల భూమి, విద్యార్థులు, పరిశోధకులు ఉపయోగించుకునే స్థలం, పర్యావరణ సంపద కోసం కీలకమైనది. ఇప్పటికీ విద్యార్థి సంఘాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఈ భూమిని కాపాడాలని పోరాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూమిని విక్రయించాలని చూడటం సరిగాదు. అమ్మకాలు చేసే ప్రక్రియను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలి' అని కోరారు. ఈ భూముల అమ్మకం పర్యావరణానికి కూడా హానికరమైనదని గుర్తుచేశారు.

రుణం కోసం నిరీక్షణ..

తహసీల్దార్, మీసేవ కేంద్రాల చుట్టూ యువత ప్రదక్షిణలు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, కెరమెరి

స్వయం ఉపాధి రుణాల కోసం యువత ఎదురు చూస్తోంది. ఉపాధి లేక.. ఉద్యోగం రాక తీవ్ర నిరుత్సాహంలో ఉన్న యువత రుణాలు వస్తాయన్న ఆశతో ఉంది. ప్రభుత్వం నుంచి ఎంతో కొంత ఆర్థిక సాయం లభిస్తే స్థానికంగా ఉంటూ ఏదో చిన్న వ్యాపారం పెట్టుకుని జీవనం సాగించాలనే ఉద్దేశంతో రుణాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించగా.. వివిధ ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మీసేవా కేంద్రాల లైన్ కడుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. గడువు సమీపిస్తుండటం.. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుండటంతో తరచూ సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈనెల 5వ తేదీతో గడువు ముగియనుంది. ప్రభుత్వం దరఖాస్తుల గడువు పెంచాలని కోరుతున్నారు.ప్రభుత్వం యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా నిరుద్యోగ యువతకు వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు బ్యాంకు రుణాలు అందించి ఆదుకోవాలని భావిస్తోంది. వ్యవసాయ సంబంధిత అంశాలైన ఎద్దుల బండ్లు, ఆయిల్ ఇంజిన్, పంప్‌సెట్, ఎయిర్ కంప్రెషర్, పత్తి సేకరణ యంత్రం, పశుపోషణలో గేదెలు, ఆవులు, డెయిరీఫారం, కోడిగుడ్లు, చేపల వ్యాపారం, మేకలు, గొర్రెల పెంపకం, పాల వ్యాపారం, ఫౌల్ట్రీఫారం తదితర వాటితోపాటు సొంత వ్యాపారం కింద ఎయిర్ కూలర్లు, స్టీల్ సామాన్లు, బేకరీ షాపు, తదితర 75 రకాల వ్యాపారాలు ప్రారంభించుకునేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం ఆయా శాఖల ద్వారా అందించే స్వయం ఉపాధి రుణాలకు ప్రత్యేకంగా రాయితీ అవకాశం కల్పించింది. దీనికి ఎలాంటి నియమ నిబంధనలూ లేవు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుంటున్నారు. రూ.50వేల రుణం తీసుకున్న వారికి వందశాతం రాయితీ, రూ.50 నుంచి రూ.లక్ష తీసుకుంటే 90శాతం, రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు తీసుకుంటే 80శాతం, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు రుణం తీసుకుంటే 70శాతం రాయితీ అవకాశం కల్పిస్తోంది.

వెల్లువెత్తుతున్న దరఖాస్తులు..!

నిరుద్యోగం పెరుగుతున్న సమయంలో రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి రుణాల కోసం యువత తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ తదితర తరగతుల వారికి అవకాశం కల్పించడంతో పెద్దఎత్తున దరఖాస్తులు చేస్తున్నారు. గత ప్రభుత్వం స్వయం ఉపాధి రుణాలు అందించినా కొందరికి మాత్రమే పరిమితం చేయడం.. చాలా తక్కువ యూనిట్లు కేటాయించడంతో పూర్తిస్థాయిలో రుణాలు అందించలేకపోయింది. దీంతో ఏండ్లుగా స్వయం ఉపాధి రుణాల కోసం యువత ఆసక్తిగా ఎదురు చూస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికి ఈ అవకాశం కల్పించడంతో యువకులు మీసేవ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఆధార్, రేషన్, పాన్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు తీసుకొని ఆయా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

సర్వర్.. సర్టిఫికేట్ల సమస్యలు..

స్వయం ఉపాధి రుణాల కోసం కుల, ఆదాయ ధ్రుపత్రాలు పెట్టాల్సి ఉంది. రేషన్ కార్డుల్లో లబ్దిదారుడి పేరు ఉంటే ఇప్పుడే ఆదాయం(ఇన్‌కం) సర్టిఫికెట్ అవసరం లేకుండానే దరఖాస్తులు చేసుకోవచ్చు. రేషన్‌కార్డుల్లో పేర్లు లేని వారు మాత్రం ఆదాయ ధ్రువపత్రం కూడా అందజేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో రేషన్‌కార్డుల్లో పేర్లు లేని వారు ఇన్‌కం సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. మరోపక్క మీసేవ కేంద్రాల్లో తరచూ సర్వర్ సమస్యలు ఉత్పన్నమవుతుండటం కారణంగా దరఖాస్తుల ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోంది.

దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సమీప మీసేవ కేంద్రాలకు రోజూ వెళ్లాల్సి వస్తోంది. కొందరు సర్వర్ వచ్చే వరకు అక్కడే నిరీక్షిస్తున్నారు. దీంతో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులతో తహసీల్దార్ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తుల వెల్లువ

ఈ నెల 14వ తేదీతో ముగియనున్న గడువు

మరో 12 రోజులు గడువు..

ప్రభుత్వం స్వయం ఉపాధి రుణాల దరఖాస్తుల ప్రక్రియను మార్చి 17న ప్రారంభించింది. ఈనెల 14వ తేదీ వరకు చివరి గడువుగా నిర్ణయించింది. కానీ సర్వస్ సమస్యలు, ఇన్‌కం సర్టిఫికెట్లు త్వరగా కాకపోవడం వంటి కారణాలతో అనేక మంది దరఖాస్తులకు ఇంకా దూరంగానే ఉన్నారు. మరో 12 రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది శాఖాపరమైన విధుల్లో నిమగ్నం కావడంతో వారు అందుబాటులో ఉండటం లేదని.. సంతకాలు చేయించలేని పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం మరిన్ని రోజులు గడువు పొడిగించాలని కోరుతున్నారు.

దరఖాస్తుల గడువు పొడిగించాలి

గోగర్ల అశోక్, కెరమెరి



రాజీవ్ యువ వికాసం కింద రుణం కోసం దరఖా స్తులు చేసేందుకు కుల, ఆదాయ ధ్రువ పత్రాలు అవస రం ఉంది. వారం రోజుల కిందట దరఖాస్తు చేశాను. కానీ రెవెన్యూ కార్యాలయంలో సర్వర్ సమస్య కారణం గా ఆలస్యం జరుగుతోంది. ఇక్కడ సమస్య తొలగినా ఇన్‌కం సర్టిఫికెట్ ఇంకా జారీ కాలేదు. మీసేవ కేంద్రం లోనూ సర్వర్ సమస్య తలెత్తుతోంది. దీంతో దరఖాస్తు చేసుకోలేకపోతున్నాం. ప్రభుత్వం గడువు పొడిగించాలి.

ఎల్‌ఓసీ వద్ద పేలుడు

పూంచ్ : జమ్మూకాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) సమీపంలో బుధవారం మందుపాతర పేలుడు సంభవించింది. దీంతో భద్రతా దళాలు స్వల్ప కాల్పులు జరిపాయి. అయితే ఈ ఘటనలో ఎవ్వరికీ గాయాలు లేదా ప్రాణనష్టం సంభవించలేదు. ఈ విషయాన్ని అధికారులు ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. బుధవారం ఉదయం కృష్ణగతి సెక్టార్‌లో ఈ మందుపాతర పేలుడు ఘటన సంభవించినట్టు తెలిపారు. స్థానికుల సమాచారం ప్రకారం పాకిస్తాన్ వైపు నుంచి కూడా కాల్పులు జరిగాయి.

దొంగ అనుకుని ఇద్దరు యువకులకు దేహశుద్ధి

కామారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో బాధితుడికి చికిత్స



నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో ఇద్దరు యువకులను దొంగలుగా అనుమానించి గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. సోమవారం అర్ధరాత్రి బస్వాపూర్ గ్రామంలో ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా దొంగలుగా అనుమానించిన గ్రామస్తులు ఆ యువకులను పట్టుకొని దేహశుద్ధి చేశారు. దొంగల బెడద ఎక్కువగా ఉండటంతో వీరు దొంగతనం చేయడానికే వచ్చారని గ్రామస్తులు మూకుమ్మడిగా చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన యువకులను ఆస్పత్రికి తరలించారు. అందులో ఒకరు అంతంపల్లి గ్రామానికి చెందిన వారు కాగా, మరొకరు మెదక్ జిల్లా రామయంపేట్ పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రస్తుతం వారిలో ఒకరు కామారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ ఆంజనేయులు మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తొందరపడి ఎలాంటి దాడులకు పాల్పడొద్దని తెలిపారు.

బిజినెస్

మార్చిలో 10 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు



న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లతో ప్రభుత్వ ఖజానా గలగలలాడుతోంది. ప్రతీ నెల జీఎస్టీ వసూళ్లలో భారీగా పెరుగుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది మార్చిలో రూ.1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లయ్యింది. గతేడాది ఇదే నెల వసూళ్లతో పోల్చితే 9.9 శాతం పెరుగుదల నమోదయ్యింది. గడిచిన నెల వసూళ్లల్లో సీజీఎస్టీ కింద రూ.38,100 కోట్లు వసూళ్లు కాగా.. ఎస్‌జీఎస్టీ కింద రూ.49,900 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీకింద రూ.95,900 కోట్లు, సెస్సుల రూపంలో రూ.12,300 కోట్లు చొప్పున వసూలైనట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంగళవారం వెల్లడించింది. దేశీయ లావాదేవీలు 8.8 శాతం పెరిగి మొత్తం రూ.1.49 లక్షల కోట్లు ఆదాయం వచ్చినట్లు పేర్కొంది. దిగుమతి వస్తువుల పన్ను ఆదాయం 13.56 పెరిగి రూ.46,919 కోట్లు సమకూరినట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్టీ వసూళ్లు 1 శాతం తగ్గి రూ.4,033 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో రూ.4,082 కోట్ల వసూళ్లు చోటు చేసుకున్నాయి. ఇదే నెలలో తెలంగాణలో రూ.5,399 కోట్లుగా ఉన్న వసూళ్లు.. 2025 మార్చిలో స్వల్పంగా పెరిగి రూ.5,401 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి.

హెచ్‌ఎస్‌బీసీతో నాస్కామ్ జట్టు

హైదరాబాద్ : హెచ్‌ఎస్‌బీసీ ఇండియాతో కలిసి 4000 మంది మహిళా వ్యవస్థాపకులకు డిజిటల్ నైపుణ్యాలను అందించడానికి నాస్కామ్ ఫౌండేషన్ ఒప్పందం కుదర్చుకుంది. తెలంగాణ, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలోని మహిళా వ్యవస్థాపకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. డిజిటల్ , ఆర్థిక అక్షరాస్యత, వ్యవస్థాపకత అభివృద్ధి, వ్యాపారం, ఇ-గవర్నెన్స్ అప్లికేషన్‌పై సమగ్రమైన తోడ్పాటును అందించనున్నట్లు పేర్కొంది.

పార్క్ మెడి వరల్డ్ రూ.1,260 కోట్ల ఇష్యూ

ముంబయి : అక్రెడిటెడ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్వహిస్తున్న పార్క్ మెడి వరల్డ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ కోసం సెబీకి దరఖాస్తు చేసుకుంది. ఈ ఇష్యూ ద్వారా రూ.1,260 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ.2 ముఖ విలువ కలిగిన షేర్లను జారీ చేయనుంది. ఈ ఇష్యూలో రూ.960 కోట్ల వరకు విలువ చేసే షేర్లను జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్ విధానంలో రూ. 300 కోట్ల వరకు విలువ చేసే షేర్లను విక్రయించనున్నట్లు ప్రతిపాదించింది.

అంకుర హాస్పిటల్‌కు రూ.165 కోట్ల ఏడీబీ నిధులు



హైదరాబాద్ : ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నుంచి రూ.165 కోట్ల నిధులు అందుకున్నట్లు అంకుర హాస్పిటల్స్ వెల్లడించింది. ఈ వ్యూహాత్మక పెట్టుబడి తమ ప్రతిష్టాత్మక విస్తరణ ప్రణాళికలకు మద్దతు ఇవ్వనుందని అంకుర హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఏడీబీ నుండి అందిన ఈ ఆర్థిక సహాయం దేశంలో మహిళలు, పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలనే తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు. "ఇది మా పీడియాట్రిక్, ప్రసూతి, గైనకాలజీ సేవలను మెరుగుపరచడానికి, మా సౌకర్యాలను విస్తరించడానికి, మరిన్ని కుటుంబాలను చేరుకోవడానికి, వారు అత్యున్నత ప్రమాణాలతో కూడిన సంరక్షణను పొందేలా చూసుకోవడానికి వీలు కల్పిస్తుంది.' అని కృష్ణ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

పబ్లిక్ ఇష్యూకు ప్రోజిల్ గ్రీన్ దరఖాస్తు

ముంబయి : దిగ్గజ సోలార్ ఈపీసీ కంపెనీల్లో ఒక్కటైన ప్రోజిల్ గ్రీన్ ఎనర్జీ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రావడానికి సిద్ధం అవుతోంది. ఇందుకోసం మార్కెట్ రెగ్యులేటరీ సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పించినట్లు ఆ కంపెనీ వెల్లడించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.700 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ2 ముఖ విలువ కలిగిన షేర్లను జారీ చేయనున్నట్లు వెల్లడించింది. ఆయా నిధులను దీర్ఘకాలిక నిర్వహణ మూలధన అవసరాలు, నిర్దిష్ట రుణాల చెల్లింపునకు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనున్నట్లు తెలిపింది.

జొమాటాలో 500 మందిపై వేటు

బెంగళూరు : ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో వందలాది ఉద్యోగులను ఇంటికి పంపించింది. కస్టమర్ సపోర్ట్ అసోసియేట్స్‌గా విధులు నిర్వర్తిస్తున్న 500 మందికి పైగా సిబ్బందిని తొలగించింది. వీరిని విధుల్లోకి తీసుకుని ఏడాది కూడా కాలేదని సమాచారం. జొమాటో అసోసియేట్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ పేరిట కస్టమర్ సపోర్ట్ విభాగం కింద 1500 మందిని ఉద్యోగాల్లోకి తీసుకుంది. చాలా మందిని పేలవమైన పనితీరు, సమయపాలన పాటించని కారణంగా నోటీస్ పీరియడ్ ఇవ్వకుండానే తొలగించిందని తెలుస్తోంది.. వీరందరికీ ఒక నెల జీతాన్ని పరిహారంగా ఇచ్చిందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

వైవిధ్య రుచుల సమ్మేళనం బెర్గ్‌నర్ ఐసీసీ

హైదరాబాద్ : అత్యాధునిక వంట సామగ్రి ఉత్పత్తుల సంస్థ బెర్గ్‌నర్ హైదరాబాద్‌లో గృహిణుల పాకశాస్త్ర సామర్థ్యాన్ని ప్రోత్సహించేందుకు ఇండియన్ కుకింగ్ క్లబ్ (ఐసీసీ) ఎడిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్రత్యక్ష వంటల పోటీల్లో పలువురు చెఫ్‌లు పాల్గొని సంప్రదాయ వంటకాల రుచులను చూపించారు. ఈ పోటీల్లో ఎంతోమంది ఆసక్తిగా పాల్గొని తమదైన శైలిలో సంప్రదాయ వంటకాలను సరికొత్త రుచులలో సిద్ధం చేశారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన స్మితా బోస్ విజేతగా నిలిచి బెర్గ్‌నర్ ఐసీసీ చెఫ్‌గా కిరీటాన్ని పొందారు. ఇది సాంప్రదాయ రుచులను సరికొత్తగా అందించే సంపూర్ణ సమ్మేళనంగా ఆకట్టుకుందని బెర్గ్‌నెర్ ఇండియా ఎండి ఉమేష్ గుప్తా పేర్కొన్నారు.



బంగారం @ 94,150

న్యూఢిల్లీ : బంగారం ధర భగ్గుమంటోంది. మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.2,000 ఎగిసి రూ.94,150కి చేరినట్లు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. దీంతో తొలిసారి రూ.94వేల మార్క్‌ను దాటినట్లయ్యింది. అమెరికా వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో బంగారంపై పెట్టుబడులను సురక్షితంగా భావిస్తోన్న నేపథ్యంలో ఆ లోహం ధరలు అమాంతం పెరుగుతున్నాయి. 2025లో ఇప్పటి వరకు బంగారం ధర దాదాపు 18 శాతం పెరిగింది. జనవరి 1న రూ.79,390గా నమోదయ్యింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.15,000 ఎగిసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సు 3,149 డాలర్లకు చేరడంతో దేశీయంగా అదే స్థాయిలో పెరుగుతోంది. మరోవైపు కిలో వెండిపై రూ.500 తగ్గి రూ.1,02,500గా పలికింది.

అలహాబాద్ ట్రిపుల్ ఐటీలో ఇద్దరు విద్యార్థులు మృతి



అలహాబాద్ : అలహాబాద్ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందారు. వారిలో ఒకరు గుండెపోటుతో మృతి చెందగా, మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు. అలహాబాద్ ట్రిపుల్ ఐటీ ప్రాంగణ అధికారులు, తోటి విద్యార్థులు అందించిన వివరాల మేరకు ... రంగారెడ్డి జిల్లా మాడ్గులకు చెందిన కాట్రావత్ రాజూనాయక్, దేవి దంపతుల కుమారుడు అఖిల్ అలహాబాద్ ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ ఫస్టియర్ చదువుతున్నాడు. ట్రిపుల్ ఐటీ హాస్టల్లో శనివారం రాత్రి 9 గంటల సమయంలో గదిలోకి వెళ్లిన అఖిల్ గుండెపోటుతో మరణించాడు. అధికారులు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు రాజూనాయక్, దేవి ప్రయాగ్ రాజ్ వెళ్లారు. కుమారుడి మరణంపై అఖిల్ తల్లిదండ్రులు ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. వర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు ప్రాణాలు కోల్పోయాడని ఆరోపించారు. విచారణ జరుపుతామని హామీ ఇవ్వడంతో వారి ఆందోళనను విరమించారు.

అఖిల్ మరణాన్ని తట్టుకోలేక అతని స్నేహితుడు రాహుల్ చైతన్య బలవన్మరణానికి పాల్పడ్డాడు. ట్రిపుల్ ఐటీలో చేరినప్పటి నుంచి అఖిల్, రాహుల్ చైతన్యలు ఇద్దరు మంచి స్నేహితులుగా ఉన్నారని అఖిల్ మరణాన్ని తట్టుకోలేకనే చైతన్య ఆత్మహత్య చేసుకున్నాడని తోటి విద్యార్థులు చెబుతున్నారు. చెవుడు, మూగ సమస్యలను ఎదుర్కొంటున్న రాహుల్‌కు అఖిల్ అండగా ఉండేవాడని స్నేహితులు వివరించారు.

తల్లిదండ్రుల ఆందోళన ...

ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలోని అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ పిల్లలు మరణించారంటూ మతిచెందిన విద్యార్థుల తల్లిదండ్రులు వేర్వేరుగా ఆందోళన చేపట్టారు. ఇద్దరు విద్యార్థుల మతిపై విచారణ జరిపేందుకు కమిటీ ఏర్పాటు చేశామని, బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.


(ఫైల్)

ఆత్మహత్యకు పాల్పడిన రాహుల్ పుట్టిన రోజు ఆదివారం జరగాల్సి ఉండగా అదే రోజు అతను ఆత్మహత్యకు పాల్పడటం కుటుంబాన్ని విషాదంలో నింపింది. మార్చి 30న ఆదివారం రాత్రి రాహుల్ హాస్టల్ ఐదవ అంతస్తు నుంచి దూకాడు. పెద్ద శబ్దం రావడంతో అక్కడున్న వారు గమనించి రాహుల్‌ను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తీసుకెళ్లే లోపే రాహుల్ చనిపోయాడు. దీంతో అతని మతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్వరూప్ రాణి నెహ్రూ ఆసుపత్రి తరలించారు. అయితే.. రాహుల్ సూసైడ్ చేసుకోవడానికి విద్యా సంస్థే కారణమని విద్యార్థులు ఆరోపించారు. రాహుల్ మొదటి సెమిస్టర్‌లో ఆరు పేపర్లలో ఫెయిల్ అయ్యాడని, దీనివల్ల అతను ఆందోళనకు గురై సూసైడ్ చేసుకోవచ్చని అలహాబాద్ ఐఐఐటీ అధికారులు చెబుతున్నారు. అతను నెలల తరబడి క్లాసులకు హాజరు కావడం లేదని తెలిపారు. స్నేహితుడి మరణంతో కుంగుబాటుకు గురై ఉంటాడని భావిస్తున్నారు.

ఈ ఘటనపై నిజ నిర్ధారణ కోసం ప్రొఫెసర్ యుఎస్ తివారీ, ప్రొఫెసర్ ఓపి వ్యాస్, ప్రొఫెసర్ పవన్ చక్రవర్తిలతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసినట్లు.. ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ జీసీ నంది వివరించారు. ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని.. ఆ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కమిటీ సభ్యుల్లో 50 శాతం మంది విద్యార్థులు ఉంటారు.

బాలిక గొంతు కోసి చంపిన వ్యక్తికి ఉరిశిక్ష

చోడవరం కోర్టు తీర్పు



చోడవరం (అనకాపల్లి జిల్లా) : ఆరేళ్ల బాలిక గొంతు కోసి కిరాతకంగా హత్య చేసిన అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన సునాచారి గుణశేఖర్‌కు చోడవరం తొమ్మిదో అడిషనల్ సెషన్ కోర్టు న్యాయమూర్తి కె.రత్నకుమార్ ఉరిశిక్ష విధించారు. ఈ మేరకు మంగళవారం తీర్పు చెప్పారు. ఆ కేసు వివరాల్లోకి వెళితే... ఖమ్మం జిల్లా నుంచి వచ్చిన భార్యాభర్తలు వేపాడ ధనలక్ష్మి, మురుగన్ దేవరాపల్లి గ్రామంలో టీ దుకాణం నడుపుతుండేవారు. ధనలక్ష్మి తమ్ముడైన ఖమ్మం జిల్లాకు చెందిన గుణశేఖర్‌ను వారి వద్దనే ఉంచి దుకాణంలో పనిచేయించేవారు. అతని ప్రవర్తన సరిగా లేకపోవడంతో ధనలక్ష్మి దూరం పాటించారు. దీంతో, కక్ష పెంచుకున్న గుణశేఖర్ దేవరాపల్లి ఉషోదయ స్కూల్లో యుకెజి చదువుతున్న తన అక్క కూతురైె దివ్యను 2015 డిసెంబర్ 23న తినుబండారాలు కొనిచ్చి రైవాడ రిజర్వాయర్ సమీపంలో ఉన్న బిల్లలమెట్ట వద్దకు తీసుకెళ్లాడు. బీరు బాటిల్‌తో ఆ చిన్నారి గొంతు కోసి హత్య చేశాడు. అప్పట్లో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. దేవరాపల్లి పోలీసులు కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలను కోర్టు ముందు ఉంచడంతో శిక్ష ఖరారైంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకటరావు ఈ కేసును వాదించి నిందితునికి శిక్ష పడేలా చేశారు. చోడవరం కోర్టు చరిత్రలో నిందితునికి ఉరిశిక్ష ఖరారు చేయడం ఇదే మొదటిసారని, తాజా తీర్పు న్యాయ వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగిస్తుందని న్యాయవాదులు ఉగ్గిన వెంకటరావు, కె.డేవిడ్ హర్షం వ్యక్తం చేశారు.

2020 నాటి అల్లర్ల కేసులో... ఢిల్లీ న్యాయశాఖ మంత్రిపై ఎఫ్ఐఆర్



న్యూఢిల్లీ : 2020లో ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లకు సంబంధించిన కేసులో బీజేపీ నేత, ప్రస్తుత ఢిల్లీ న్యాయ శాఖ మంత్రి కపిల్ మిశ్రాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా ఢిల్లీ కోర్టు మంగళవారం ఆదేశించింది. యమునా విహార్‌లో నివసిస్తున్న మహమ్మద్ ఇల్లియాస్ దాఖలు చేసిన పిటిషన్‌పై అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

అల్లర్లు జరిగిన ప్రాంతంలో చౌరాసియా ఉన్నారంటూ ప్రాసిక్యూషన్ కొన్ని ఆధారాలను కోర్టుకు సమర్పించింది. 53 మంది మరణానికి, 700 మందికి పైగా గాయపడడానికి దారితీసిన ఢిల్లీ అల్లర్లలో మిశ్రా, మరో ఆరుగురి పాత్రపై విచారణ జరపాలని కోరుతూ గత సంవత్సరం డిసెంబరులో ఇల్లియాస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈ పిటిషన్‌ను గత నెలలో పోలీసులు వ్యతిరేకించారు. బీజేపీ నేత పాత్రపై ఇప్పటికే విచారణ జరిపామని, ఆయన ప్రమేయమేమీ లేదని తేలిందని వారు కోర్టుకు తెలిపారు. కాగా ఇల్లియాస్ తన పిటిషన్‌లో మిశ్రాతో పాటు ముస్తాఫాబాద్ ఎమ్మెల్యే, ఉప సభాపతి మోహన్ సింగ్ బిష్త్, అప్పటి డీసీపీ,

కోర్టు ఆదేశం

దయాల్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఆ సమయంలో ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన అధికారిని కూడా చేర్చారు. 2020 ఫిబ్రవరి 23న కర్దామ్‌పురిలోని ఓ రోడ్డును మిశ్రాతో పాటు మరికొందరు దిగ్బంధించి, వీధి వ్యాపారుల సామాగ్రిని ధ్వంసం చేయడాన్ని తాను చూశానని ఆయనతెలిపారు. సీఏఏ వ్యతిరేక నిరసనకారులను మిశ్రా బెదిరిస్తుంటే మాజీ డీసీపీతో పాటు కొందరు అధికారులు ఆయనకు వత్తాసు పలికారని కోర్టు దృష్టికి తెచ్చారు. దయాల్‌పూర్ మాజీ ఎస్‌హెచ్‌ఓ, ఇతరులు కలిసి ఈశాన్య ఢిల్లీలోని పలు మసీదును ధ్వంసం చేశారని ఆయన తన పిటిషన్‌లో వివరించారు.

అల్లర్లకు పలువురు విద్యార్థి నేతలు కుట్ర పన్నారని ఆరోపిస్తూ పోలీసులు వారిని ఈ కేసులో ఇరికించారు. అయితే ఢిల్లీ మైనారిటీ కమిషన్ ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిషన్ మాత్రం అల్లర్లు ఓ పథకం ప్రకారం, ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని జరిగాయని తేల్చింది. ఇందుకు మిశ్రాయే బాధ్యుడని స్పష్టం చేసింది.

అలవికాని హామీలు... భూముల అమ్మకాలు

- **వర్సిటీల భూములపై సీఎం రేవంత్‌రెడ్డి కన్ను : బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ఎన్నికల్లో గెలిచేందుకు అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు నిధుల కోసం హెచ్‌సీయూ భూములను అమ్మాలని చూస్తున్నదని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. హెచ్‌సీయూ తర్వాత ఉస్మానియా, జేఎన్టీయూ, కాకతీయ, వ్యవసాయ వర్సిటీల భూములను కాంగ్రెస్ సర్కార్ అమ్మాలని చూస్తున్నదని ఆరోపించారు. దీన్ని వ్యతిరేకిస్తూ వర్సిటీల్లో పోరాటాన్ని ప్రారంభించి విద్యార్థులను చైతన్యపరుస్తామని ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నిర్బంధ, అరాచక పాలన సాగుతున్నదని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలా రేవంత్ పాలన ఉందని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో హెచ్‌సీయూ భూములను సందర్శించేందుకు వెళ్తుంటే అరెస్టు చేయడం శోచనీయమన్నారు. 369 మంది విద్యార్థులు బలికావడంతో ఆ పాపాన్ని కడిగేసుకునేందుకు అప్పట్లో వర్సిటీకి భూములిచ్చారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో వందలాది ఎకరాలు వేలకోట్ల రూపాయలకు అమ్ముకున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ముప్పై, నలభై వేల ఎకరాల భూమిని అమ్ముకోవాలని చూస్తున్నదని విమర్శించారు. విద్యార్థుల పై దాడి చేసినందుకు సీఎంపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. వన్యప్రాణులుండగా జేసీబీ లతో చదును చేయడాన్ని తప్పుబట్టారు. పక్షులు జంతువులు లేవు అక్కడ గుంట నక్కలున్నాయని సీఎం అనటాన్ని తప్పుబట్టారు. ఆ భూమిని ఏ గుంట నక్కకు కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. మంత్రి శ్రీధర్ బాబు ఒక్క అంగుళం భూమి అమ్మబోమని చెబుతుంటే..మరోపక్క సీఎం భూములను తెగనమ్ముతున్నారని విమర్శించారు. అసెంబ్లీలో చెప్పినట్టు అక్కడకు అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు. కోదండరాం కు ఈ భూములు కనిపించడం లేదా? కూనంనేని కి విద్యార్థుల ఆర్తనాదాలు వినిపించడం లేదా? అని అడిగారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఆ భూములను రికవరీ చేస్తామని ప్రకటించారు. భూములమ్మితేగాని ప్రభుత్వాన్ని నడపలేని దుస్థితిలో కాంగ్రెస్ సర్కార్ ఉందని విమర్శించారు. ప్రతిపక్షాల, విద్యార్థి సంఘాల వినతులను, డిమాండ్లను పట్టించుకోకుండా కాంగ్రెస్ సర్కారు ఏకపక్షంగా, బలవంతంగా వర్సిటీ భూములను అమ్మాలనుకోవడం అప్రజాస్వామికమన్నారు.

హిమాలయాలతో భారత్ అందం అద్భుతం

67భారత్‌కు వస్తానని సునీతా విలియమ్స్ వ్యాఖ్యలు



న్యూయార్క్ : రోదసీ నుంచి భారత్ అద్భుతంగా కనిపిస్తుందని నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ వ్యాఖ్యానించారు. తన తండ్రి మాతృ దేశమైన భారత్‌కు తప్పక వస్తానని ఆమె తెలిపారు. అక్కడి ప్రజలతో, తన బంధువులతో రోదసీ అన్వేషణలో తన అనుభవాలను పంచుకుంటానన్నారు. అంతరిక్షం నుండి వచ్చిన తర్వాత సునీతా విలియమ్స్‌తో పాటూ మిగిలిన ఇద్దరు వ్యోమగాములు తొలిసారిగా పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా సునీత పై వ్యాఖ్యలు చేశారు. "భారత్ చాలా అద్భుతంగా కనిపిస్తుంది. హిమాలయాలపై నుండి వెళ్లిన ప్రతీసారీ బుచ్ విల్మోర్ వాటిని ఫోటోలు తీసేవారు. తూర్పు వైపు నుండి అంటే గుజరాత్, ముంబయిల మీదుగా వస్తున్నప్పుడు తీర ప్రాంతంలో వుండే చేపల బోట్లు చూడగానే ఒక సిగ్నల్‌లా అనిపించి, భారతదేశం మీదుగా పయనిస్తున్నామని అర్థమయ్యేది. పెద్ద పెద్ద నగరాల నుండి చిన్న నగరాలకు వరకు సాగుతుంటే లైట్ల నెట్‌వర్క్ అందంగా అనిపించేది నిశీధి వేళలోనే కాదు, పగటి పూట కూడా మంచు పర్వతాల అందం అద్భుతం, అనిర్వచనీయం...హిమాలయాలతో భారత్ అందం ఇనుమడిస్తోందని సునీతా వ్యాఖ్యానించారు. "నా తండ్రి మాతృదేశానికి రావాలని నాకు కూడా అనిపిస్తోంది. కచ్చితంగా వస్తాను. అక్కడున్న నా వారినందరినీ కలుస్తాను." అని చెప్పారు.

మమ్మల్ని కూడా మీతోపాటు తీసుకెళతారా అని బుచ్ విల్మోర్ అడగగా, కచ్చితంగా తీసుకెళతాను, మీకు కారంగా వుండే ఆహారాన్ని కూడా తినిపిస్తానని సునీతా నవ్వుతూ సమాధానమిచ్చారు. సునీతా తండ్రి దీపక్ పాండ్యా గుజరాత్‌కు చెందిన వారు. 1958లోనే ఆయన అమెరికాకు వలస వెళ్ళిపోయారు. సునీతా అమెరికాలోనే జన్మించారు. అంతరిక్షం నుండి భూమికి తిరిగివస్తున్న సునీతా బృందానికి స్వాగతం పలుకుతూ ప్రధాని మోడీ ఆమెను భారత్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు.

ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేద్దాం

చిలీ అధ్యక్షుడితో ప్రధాని మోడీ చర్చలు



న్యూఢిల్లీ : చిలీ అధ్యక్షుడు గాబ్రియేట్ బోరిక్ ఫాంట్ భారత్ పర్యటనలో భాగంగా ఢిల్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత ప్రధాని మోడీని ఆయన కలిశారు. ఇరు దేశాల నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వెల్లడించారు.

కాగా, భారత్ పర్యటనలో భాగంగా ఫాంట్ ఢిల్లీలోని మహాత్మాగాంధీ రాజ్‌ఘాట్‌కు చేరుకుని గాంధీజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'చిలీ మంత్రులు, పార్లమెంటు సభ్యుల బృందం బుధవారం ఢిల్లీలోని మహాత్మాగాంధీ గౌరవార్థం నిర్మించిన రాజ్‌ఘాట్ వద్ద చేరుకుని ఆయనకు నివాళులర్పించాము. భారతదేశం ఆయన వారసత్వాన్ని గుర్తుచేస్తుంది. ఈ సందర్భంగా మేము ఉమ్మడి ఆసక్తులను పంచుకోవడమే కాదు.. మా ప్రజల భవిష్యత్తు కోసం గొప్ప అవకాశాలనే కాదు.. ప్రాథమిక విలువలను పంచుకున్నాము' అని ఫాంట్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

ప్రాంతీయ వాణిజ్యాన్ని పెంచుకుందాం

చైనా, జపాన్, దక్షిణ కొరియా అంగీకారం

ట్రంప్ సుంకాలకు ప్రతిగా నిర్ణయం

న్యూఢిల్లీ : అమెరికా విధించబోయే ప్రతీకార సుంకాలను గట్టిగా ప్రతిఘటిస్తున్న చైనా, జపాన్, దక్షిణ కొరియా దేశాలు ఒక్కటయ్యాయి. ప్రాంతీయ వాణిజ్యాన్ని ఉమ్మడిగా పెంచుకునేందుకు అంగీకారానికి వచ్చాయి. ఐదు సంవత్సరాల విరామం అనంతరం ఈ మూడు దేశాల వాణిజ్య మంత్రులు తొలిసారిగా దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో గత నెల 30న ఆర్థిక చర్చలు జరిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ వాణిజ్యాన్ని ముందుకు తీసుకుపోయే దిశగా వారు ఓ నిర్ణయానికి వచ్చారు. సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలు అఅంతర్జాతీయంగా ఆందోళనలు రేపుతున్న తరుణంలో జపాన్ ఆర్థిక, వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి యోజి ముటో, చైనా వాణిజ్య మంత్రి వాంగ్ వెంటావో, దక్షిణ కొరియా వాణిజ్య, పరిశ్రమల, ఇంధన శాఖ మంత్రి డక్‌జున్ సమావేశం కావడం గమనార్హం.'అంతర్జాతీయ వాణిజ్య పరిస్థితులపై మూడు దేశాలు అభిప్రాయాలను పంచుకున్నాయి. ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉన్నదని గుర్తించాయి' అని దక్షిణ కొరియా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి తెలిపారు. కాగా 'కీలక రంగాలలో సవాళ్లను అధిగమించి ఫలితాలు సాధించేందుకు త్రైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉన్నదని మేము గుర్తించాము' అని కొరియా ప్రభుత్వం వివరించింది. జపాన్, కొరియా దేశాలు చైనా నుండి సెమీకండక్టర్ ముడి సామగ్రిని దిగుమతి చేసుకోవాలని ఆశిస్తుండగా జపాన్, దక్షిణ కొరియా నుండి చిప్ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని చైనా అనుకుంటోంది. స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన, అత్యున్నత నాణ్యతతో కూడిన, పరస్పర ప్రయోజనకరమైన ఎఫ్‌టీఏకు వాస్తవ రూపం ఇవ్వడానికి త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకునే దిశగా చర్చలను వేగవంతం చేయాలని మూడు దేశాలు అంగీకారానికి వచ్చాయని దక్షిణ కొరియా ఒక ప్రకటనలో వివరించింది. ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) ఈ మూడు ఆసియా దేశాలు నాలుగో వంతు వాటాను, ప్రపంచ వాణిజ్య విలువలో 21 శాతాన్ని కలిగి ఉన్నాయి. అయితే ఇటీవలి కాలంలో ఈ దేశాల మధ్య వాణిజ్య, దౌత్య సంబంధాలు అంత సజావుగా లేవు.

అన్నింటా బీజేపీ జోక్యం

ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ సవరణ బిల్లుకు సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ వ్యతిరేకించారు. అయితే ఈ సవరణ బిల్లుకు ఆల్ ఇండియా సూఫీ సజ్జాదంసిన్ కౌన్సిల్ (ఎఐఎస్‌ఎస్‌సి) చైర్మెన్, అజ్మీర్ దర్గా ఆధ్యాత్మిక అధిపతి సయ్యద్ నసీరుద్దీన్ చిష్టీ మద్దతు ప్రకటించారు. సయ్యద్ ప్రకటనపై ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పందించారు. బిజెపి అన్నింటా జోక్యం చేసుకుంటుందని ఆయన విమర్శించారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బీజేపీ ప్రతిదానిలోనూ జోక్యం చేసుకోవాలని కోరుకుంటుంది. ఆ పార్టీ నేతలు కూడా ప్రతిదాన్ని వారి నియంత్రణలోనే ఉండాలని భావిస్తారు. వక్ఫ్ సవరణ బిల్లుకి అజ్మీర్ దర్గా మద్దతు వెనుక బిజెపి ప్రమేయం ఉంది' అని ఆయన అన్నారు. కాగా, తాజాగా అజ్మీర్ దర్గా అధిపతి సయ్యద్ నసీం వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ప్రటించారు. రెచ్చగొట్టే ప్రకటనల ద్వారా ముస్లిం సమాజం మోసపోవద్దని, ప్రభుత్వ అధికారిక ప్రకటనలను నమ్మాలని ఆయన కోరారు. 'ప్రస్తుత వక్ఫ్ చట్టాన్ని మార్చాల్సిన అవసరం ఉందని నేను నమ్ముతున్నాను. దీనికి ముస్లింలు భయపడాల్సిన అవసరం లేదు. ముస్లిం సమాజానికి వ్యతిరేకం కాదని, మసీదులు, దర్గాలను స్వాధీనం చేసుకోబోమని ప్రభుత్వమే పార్లమెంటులో చెబుతున్నప్పుడు మనం ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలి. ఈ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపిన సూచనలు పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం చేసే మార్పులు బాగుంటాయని నేను ఆశిస్తున్నాను అని ఆయన మీడియాకు వెల్లడించారు. నసీరుద్దీన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ జేపీసీ కమిటీలో సభ్యులు ఇమ్రాన్ మసూద్ స్పందించారు. నసీరుద్దీన్ బీజేపీకి బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నారని ఇమ్రాన్ ఆరోపించారు.

నేటినుంచి తుదివిడత జేఈఈ మెయిన్

- 9 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ
- తెలుగు రాష్ట్రాల నుంచి 1.60 లక్షల మంది దరఖాస్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశం, ఐఐటీల్లో బీటెక్ ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ తుదివిడత పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దేశవ్యాప్తంగా ఈ పరీక్షలు ఆన్‌లైన్‌లో ఈనెల ఎనిమిదో తేదీ వరకు జరుగుతాయి. బుధవారంతోపాటు ఈనెల మూడు, నాలుగు, ఏడు, ఎనిమిది తేదీల్లో ఎన్ఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీ కోసం పేపర్-1 పరీక్షలను నిర్వహిస్తారు. ప్రతిరోజూ రెండు విడతల్లో ఈ పరీక్షలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుంది. చివరి రోజు ఈనెల తొమ్మిదిన బీఆర్క్, బీ ప్లానింగ్ సీట్ల భర్తీ కోసం పేపర్-2 పరీక్ష జరుగుతుంది. దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ రెండు పేపర్లకు కలిపి 13 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసినట్టు సమాచారం. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1.60 లక్షల మంది దరఖాస్తు చేసినట్టు తెలిసింది. అయితే జేఈఈ మెయిన్ మొదటి విడత పేపర్-1 పరీక్షలకు 13.11 లక్షల మంది దరఖాస్తు చేసినా 12.58 లక్షల మంది రాశారు. మొదటి విడతలో తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరే వంద పర్సెంటైల్ స్కోర్‌ను సాధించారు. తుది విడత పరీక్షల్లో ఎలాంటి స్కోర్ చేస్తారో చూడాలి. రెండు విడతల్లో కలిపి ఈనెల 17న లేదా అంతకమంటే ముందే ఫలితాలను ఎన్టీఏ విడుదల చేస్తుంది. రెండింటిలో వచ్చిన ఉత్తమ స్కోర్ ఆధారంగా అభ్యర్థులకు ర్యాంకులను కేటాయిస్తుంది. జేఈఈ మెయిన్‌లో కనీస మార్కులు సాధించిన 2.50 లక్షల మంది మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అవకాశం కల్పిస్తారు.

గాంధీ మునిమనవడి పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : సబర్మతి ఆశ్రమం ఆధునికీకరణ అంశంపై మహాత్మా గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. దీనిని భావోద్వేగాలతో ముడిపెట్టొద్దని సూచించింది. గుజరాత్ అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమాన్ని రూ.1200 కోట్లతో ఆధునీకరించాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దానిని 2022లో గుజరాత్ హైకోర్టు సమర్థించింది. అయితే తుషార్ గాంధీ ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. గుజరాత్ ప్రభుత్వ ప్రతిపాదిత ప్రాజెక్టు ఆశ్రమం టోపోగ్రఫీ మారిపోతుందని, నైతికత దెబ్బతింటుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. "మీ భావోద్వేగాలను ఈ అంశంతో ముడిపెట్టవద్దు. మనం ముందుకు వెళుతున్నాం. ఈ దేశం ముందుకు వెళుతోంది. ఇలాంటి అంశాలను ఇతర కోణాల్లో చూడాలి" అని కోర్టు ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. తాము అన్ని అంశాలను పరిశీలించామని, అభ్యంతరం చెప్పడానికి ఏమీ లేదని సుప్రీం స్పష్టం చేసింది.